

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

నూతన సంవత్సర శుభాకాంక్షలు



బుధవారం | 1-1-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 274 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, పుష్యమాసం, శుక్లపక్షం; తిథి: విదియ రా. 2.22 తదుపరి తదియ; నక్షత్రం: ఉత్తరాషాఢ రా. 11.46 తదుపరి శ్రవణం వర్జ్యం: ఉ. 7.58-9.22, తె. 3.40-5.13; దుర్ముహూర్తం: ఉ. 11.56-12.40; అమృతఘడియలు: సా. 5.26-7.01; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 6.49; సూర్యాస్తమయం: 5.48 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



బిజినెస్

వరంగల్ ● బుధవారం 1 జనవరి 2025



కొత్త ఏడాదికి
నయా పెట్టుబడి వ్యూహాలు

ఈక్విటీ, బులియన్, డెట్.. ఏది బెటర్?

కొత్త సంవత్సరం (2025) వచ్చేసింది. మరి ఈ ఏడాది మన పెట్టుబడుల వ్యూహం ఎలా ఉండాలి?. మన దగ్గర ఉన్న నిధుల్లో ఎంతెంత ఎందులో మదుపు చేయాలి? ఎందులో మదుపు చేస్తే బాగుంటుందో తెలుసుకుందాం.

గత ఏడాది (2024) దేశీయ స్టాక్ మార్కెట్ మదుపరులకు బొటాబొటిగా 8 శాతం మాత్రమే లాభాలు పంచింది. డెట్ మార్కెట్ కంటే ఇది కొద్దిగా మెరుగు. అదే బంగారంలో మదుపు చేస్తే 23 శాతం, వెండిలో మదుపు చేస్తే 23 శాతం లాభాలు కళ్ల జూసేవాళ్లం. ఈ నేపథ్యంలో 2025లో మన పెట్టుబడుల వ్యూహం ఎలా ఉంటే బాగుంటుందో తెలుసుకుందాం.

ఈక్విటీ

ఎన్ని ఆటుపోట్లు ఉన్నా, దీర్ఘకాలిక సంపద సృష్టిలో ఈక్విటీ మార్కెట్లదే అగ్రస్థానం. మదుపరులు ఎప్పుడూ ఈ విషయాన్ని మర్చిపోకూడదు. దీన్ని దృష్టిలో ఉంచుకుని కనీసం తమ పెట్టుబడుల్లో సగం మొత్తాన్ని అయినా మదుపరులు ఈక్విటీ మార్కెట్ కోసం కేటాయించాలి. ఇందుకోసం మిడ్, స్మాల్ క్యాప్ షేర్ల కంటే లార్జ్ క్యాప్ షేర్లను ఎంచుకోవడమే మంచిది. ఎందుకంటే ఇప్పటికీ మిడ్ క్యాప్ కంపెనీల షేర్లు, వాటి అసలు విలువ కంటే అధిక ధరల వద్ద ట్రేడవుతున్నాయి. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని మదుపరులు నయా సాల్‌లో ఐటీ, ఫార్మా, టెక్స్‌టైల్ రంగాలకు చెందిన లార్జ్ క్యాప్ షేర్లను ఎంచుకోవటం మంచిది. ప్రస్తుతం కరెక్షన్‌లో ఉన్న ఐటీసీ, డాబర్, మారికో వంటి ఎఫ్ఎంసీజీ కంపెనీల షేర్లపైనా మదుపరులు దృష్టి పెట్టవచ్చు.

బులియన్ మార్కెట్

రాబడులపరంగా చూస్తే గత ఏడాది (2024) బులియన్ మార్కెట్.. స్టాక్ మార్కెట్‌ను మించిపోయింది. పసిడిపై 23.25 శాతం, వెండిపై 23.11 శాతం లాభాలు వచ్చాయి. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ఇంకా చల్లార లేదు. ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియడం లేదు. మరోవైపు అమెరికా కొత్త అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జమానాలో ఆర్థిక పరిస్థితులు ఎలా ఉంటాయోనని చైనాతో సహా అనేక దేశాలు భయపడుతున్నాయి. పరిస్థితులు దిగజారితే తమ ఆర్థిక, ద్రవ్య పరిస్థితులను కాపాడుకునేందుకు అనేక దేశాల కేంద్ర బ్యాంకులు పెద్దమొత్తంలో బంగారం కొనిపెట్టుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో కొత్త ఏడాది (2025)లోనూ బంగారం, వెండి ధరలు మరింత చుక్కలనంటే అవకాశం ఉంది. ఈ విషయాలను దృష్టిలో ఉంచుకుని మదుపురులు తమ మొత్తం పెట్టుబడుల్లో కనీసం 35 శాతమైనా నేరుగా బంగారం, వెండిలో లేదా వాటికి సంబంధించిన ఈటీఎఫ్‌ల్లో మదుపు చేయడం మంచిది. డాలర్‌తో రూపాయి మారకం రేటు పతనమూ వచ్చే ఏడాది బంగారం, వెండిలకు మరింత కలిసి రానుంది.

డెట్

ఇవేవీ వద్దు. మేం ఏ మాత్రం రిస్క్ తీసుకోలేమనుకునే మదుపరులకు బ్యాంకు డిపాజిట్లు, మ్యూచువల్ ఫండ్స్ అందించే డెట్ ఫండ్స్ తప్ప వేరే మార్గం లేదు. కొత్త ఏడాది కూడా ఈ ఫండ్స్ సగటున 6 నుంచి 7 శాతం రాబడులు అందించే అవకాశం ఉంది. అయితే ధరల సెగను పరిగణనలోకి తీసుకుంటే బ్యాంకు డిపాజిట్లు, డెట్ ఫండ్స్‌పై వచ్చేది ప్రతికూల రాబడులు మాత్రమే. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని మదుపరులు కొత్త ఏడాది తమ మొత్తం పెట్టుబడుల్లో 15 శాతానికి మించి వీటిలో మదుపు చేయకపోవడమే మంచిది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



జనవరి 1			
హైదరాబాద్	520	విజయవాడ	545
వరంగల్	522	గోదావరి	540
చిత్తూరు	563	విశాఖపట్నం	570
		డజను గుడ్లు రూ.	84

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	99	విజయవాడ	106
వరంగల్	99	గుంటూరు	106
కరీంనగర్	99	ఒంగోలు	106
మహబూబ్‌నగర్	99	చిత్తూరు	97
కర్నూలు	99	నెల్లూరు	97
విశాఖపట్నం	105	అనంతపురం	97
గోదావరి	106		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	77,560 ▼	71,100 ▼	98,900 ▼
విజయవాడ	78,500 ▲	73,200 ▼	89,500 ▼
విశాఖపట్నం	76,650 ▼	70,260 ▼	87,130 ▼
రాజమండ్రి	77,560 ▼	71,100 ▼	89,800 ▼
ప్రొద్దుటూరు	78,300 ▼	72,510 ▼	88,200 ▼
ముంబై	76,162 ▼	69,764 ▼	86,017 ▼

పసిడి జోరు.. ఆపతరమా!



కొత్త ఏడాదిలో రూ.90,000 చేరే చాన్స్
2024లో పసిడి 23%, వెండి 30% వృద్ధి

ప్రపంచాన్ని అస్థిరతలు ఆవరించినప్పుడల్లా సురక్షితమైన రాబడులు అందించిన ఘనత బంగారానికి ఉంది. భౌగోళిక, రాజకీయ, ఆర్థిక అస్థిరతలు ఆవరించి ఉన్న ప్రస్తుత కాలంలో కూడా అది నిజమని రుజువైంది. తెరమరుగవుతున్న 2024 సంవత్సరంలో మంచి రాబడులు అందించిన బంగారం నూతన సంవత్సరంలో కూడా అదే జోరును కొనసాగిస్తుందని బులియన్ మార్కెట్ నిపుణులంటున్నారు. 2025 సంవత్సరంలో బంగారం 10 గ్రాములు రూ.90,000 తాకే ఆస్కారం ఉన్నదని వారు జోస్యం చెబుతున్నారు. అయితే భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు ఉపశమించి, ద్రవ్య విధానం విషయంలో కాఠిన్యం తగ్గితే మాత్రం బంగారం ధర తగ్గినా ఆశ్చర్యపోనక్కరలేదని వారు చెబుతున్నారు. ఆ పరిస్థితే గనుక ఏర్పడితే మాత్రం రూ.85,000 వరకు వెళ్లవచ్చంటున్నారు. అలాగే కిలో వెండి పరిస్థితులన్నీ సానుకూలంగా ఉంటే రూ.1.25 లక్షలు తాకవచ్చని, ప్రతికూల మొగ్గులో రూ.1.10 లక్షలకు పరిమితం కావచ్చని చెబుతున్నారు. ప్రస్తుతం స్పాట్ మార్కెట్లో 10 గ్రాముల బంగారం రూ.79,350, ఎంసీఎక్స్‌లో ఫ్యూచర్స్ ట్రేడ్‌లో 10 గ్రాములు రూ.76,600 పలుకుతోంది.

సెంట్రల్ బ్యాంకుల వైఖరే కీలకం

కొత్త సంవత్సరంలో బంగారం ధరలకు వివిధ దేశాల కేంద్ర బ్యాంకుల ద్రవ్య విధాన వైఖరే దిక్సూచి అంటున్నారు. కేంద్ర బ్యాంకులు వడ్డీ రేట్లు తగ్గించినట్టయితే మార్కెట్లో లిక్విడిటీ పెరిగి అమెరికన్ డాలర్ బలహీనపడుతుందని, ఇది బంగారం ధరల వృద్ధికి దోహదపడే అంశమని విశ్లేషకులంటున్నారు. ఒక వేళ కేంద్ర బ్యాంకులు అప్రమత్త ధోరణి ప్రదర్శించినట్టయితే మాత్రం బంగారం ధర పెరుగుదలకు దోహదకారి అవుతుందని వారంటున్నారు. ప్రస్తుత పరిస్థితిలో కేంద్ర బ్యాంకులు నిల్వలు పెంచుకునే లక్ష్యంతో బంగారం కొనుగోళ్లు కొనసాగిస్తూ కరెన్సీ స్థిరత్వంపై ఆందోళనలు నెలకొంటే మాత్రం బంగారం ధరల పెరుగుదలను ఆపే శక్తి ఏదీ ఉండదని వ్యాఖ్యానించారు. 2024లో భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) సహా వివిధ కేంద్ర బ్యాంకులు 500 టన్నులకు పైబడిన బంగారం కొనుగోలు చేశాయి.

2024లో 23% లాభం

దేశీయ మార్కెట్లో 23 శాతం లాభంతో బంగారం 2024 సంవత్సరంలో మంచి రాబడి అందించింది. అక్టోబరు 30వ తేదీన 10 గ్రాముల బంగారం జీవితకాల గరిష్ఠ స్థాయి రూ.82,400ని తాకింది. వెండి కూడా కిలో రూ.1 లక్ష దాటింది. 1979 తర్వాత బులియన్ మార్కెట్ నమోదు చేసిన అత్యుత్తమ ర్యాలీ ఇదే అని బులియన్ వర్గాలు వెల్లడించాయి. అంతర్జాతీయ విపణిలో చూసినా ఔన్సు బంగారం 2,062 డాలర్ల వద్ద ప్రారంభమై అక్టోబరు 31న రికార్డు గరిష్ఠ స్థాయి 2,790 డాలర్లు తాకింది. అంతర్జాతీయంగా ఏడాదిలో బంగారం పెట్టుబడిపై 28 శాతం రాబడి అందించింది.

ఆభరణాల డిమాండూ ప్రధానమే

ఆభరణాల డిమాండ్ బంగారం ధరలను ప్రభావితం చేసే మరో అంశం. ఒక పక్క పండగలు, వివాహాల సీజన్, మరో పక్క గత జూలైలో బంగారంపై దిగుమతి సుంకాన్ని ప్రభుత్వం 0.90 శాతం మేరకు తగ్గించడం వంటి చర్యలతో దేశంలో బంగారం వినియోగం 17 శాతం పెరిగిందని మెహతా ఈక్విటీస్ వైస్ ప్రెసిడెంట్ రాహుల్ కలంత్రి చెప్పారు. 2019-2024 సంవత్సరాల మధ్య కాలంలో దేశీయ ఆభరణాల పరిశ్రమ 11 శాతం సమీకృతవార్షిక వృద్ధిని నమోదు చేసిందని ఇక్రా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ శ్రీకుమార్ కృష్ణమూర్తి తెలిపారు. పండగలు, వివాహాల సీజన్ కారణంగా నవంబరులో బంగారం దిగుమతులు నాలుగు రెట్లు పెరిగి రికార్డు గరిష్ఠ స్థాయి 1,486 కోట్ల డాలర్లకు చేరాయి.

నూతన సంవత్సరంలో కూడా ఆభరణాల డిమాండు బలంగానే ఉంటుందని అఖిల భారత వజ్రాభరణాల వ్యాపారుల మండలి (జీజేసీ) చైర్మన్ సాయం మెహ్రా అంచనా వేస్తున్నారు. ప్రధానంగా మధ్యతరగతి ప్రజలు, యువత బులియన్ మార్కెట్ వృద్ధికి చోదకంగా నిలుస్తారని చెబుతున్నారు. అలాగే వివాహాభరణాల మార్కెట్ కూడా డిమాండు వృద్ధికి దోహదపడుతుందంటున్నారు. ఇవన్నీ కలిసి 2025 సంవత్సరంలో భారత వజ్రాభరణాల మార్కెట్ 10 వేల కోట్ల డాలర్లను చేరవచ్చని అంచనా.

ఏడాదిలో రూ.77.6 లక్షల కోట్లు

ఆటుపోట్లలోనూ స్టాక్ మార్కెట్ లాభాల పంట
స్వల్ప నష్టంతో 2024కి సెన్సెక్స్ వీడ్కోలు

ముంబై: ఈక్విటీ మార్కెట్ 2024 సంవత్సరం మొత్తం తీవ్ర ఆటుపోట్లలో ప్రయాణించినా చివరికి ఇన్వెస్టర్లకు లాభాల పంట పండించింది. కొంత కాలం బుల్ రన్, మరి కొంత కాలం బేర్ పట్టుతో ఈ ఏడాదిలో మార్కెట్ పయనం సాగింది. అప్పుడప్పుడూ ఆటుపోట్లు ఏర్పడినా స్థూలంగా ఆశావహ దృక్పథం మార్కెట్ పయనాన్ని నిర్దేశించింది. ఏడాది మొత్తం మీద ఈక్విటీ మార్కెట్ పెట్టుబడులకు దిక్సూచిగా భావించే సెన్సెక్స్ 5898.75 పాయింట్లు (8.16%) లాభపడగా, నిఫ్టీ 1913.40 పాయింట్లు (8.80%) లాభపడింది. సెప్టెంబరు 27వ తేదీన సెన్సెక్స్ జీవితకాల గరిష్ఠ స్థాయి 85,978.25 పాయింట్లను తాకగా నిఫ్టీ 26,277.35 పాయింట్ల రికార్డును నమోదు చేసింది. నిఫ్టీ సానుకూల రాబడులు అందించడం ఇది వరుసగా తొమ్మిదో సంవత్సరం అని మెహతా ఈక్విటీస్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ప్రశాంత్ తాప్సే చెప్పారు. కాగా బీఎస్ఈ స్మాల్‌క్యాప్ సూచీ 12,506.84 పాయింట్లు (29.30%), మిడ్‌క్యాప్ సూచీ 9,605.44 పాయింట్లు (26.07%) లాభపడ్డాయి. ఏడాదిలో మొత్తం మీద ఇన్వెస్టర్ల సంపద లేదా బీఎస్ఈలో లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ రూ.77,66,260.19 కోట్లు పెరిగి రూ.4,41,95,106.44 కోట్ల (5.16లక్షల కోట్ల డాలర్లు) వద్ద స్థిరపడింది. ఏప్రిల్ 8వ తేదీన ఇన్వెస్టర్ల సంపద తొలిసారిగా 400 లక్షల కోట్ల మైలురాయిని తాకింది.

బుల్, బేర్ నువ్వా..నేనా..?

ఏడాది మొత్తం మీద బుల్, బేర్ నువ్వా, నేనా అన్నట్టు పోరాడాయని విశ్లేషకులంటున్నారు. ప్రపంచంలోని పలు ప్రాంతాల్లో నెలకొన్న అస్థిరతలు మార్కెట్‌ను తీవ్రంగా ప్రభావితం చేశాయి. జనవరి నుంచి సెప్టెంబరు నెలల మధ్య కాలంలో మార్కెట్‌పై బుల్ పట్టు కొనసాగగా ఆ తర్వాత బేర్ గుప్పిట్లోకి వెళ్లిందని చెబుతున్నారు. ప్రపంచ మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాల నడుమ భారత మార్కెట్‌పై కన్సాలిడేషన్ ఒత్తిడి అధికంగా ఉందంటున్నారు.

నష్టాలతో ముగింపు: మార్కెట్ 2024 సంవత్సరం చివరి రోజున నష్టాలతో ముగిసింది. ప్రపంచ మార్కెట్ల బలహీన సంకేతాలు, విదేశీ నిధుల తరలింపు నేపథ్యంలో భారీ ఆటుపోట్లకు గురయింది. అమ్మకాల ప్రభావంతో ఇంట్రాడేలో 687.34 పాయింట్లు నష్టపోయి 77,560.79 కనిష్ఠ స్థాయిని తాకిన సెన్సెక్స్ చివరికి నష్టాన్ని 109.12 పాయింట్లకు పరిమితం చేసుకుని 78,139.01 పాయింట్ల వద్ద స్థిరపడింది. నిఫ్టీ మాత్రం 0.10 పాయింట్ల నామమాత్రపు నష్టంతో 23,644.80 వద్ద ఫ్లాట్‌గా ముగిసింది.

రూపాయి 3% డౌన్

ఫారెక్స్ మార్కెట్లో రూపాయి ఏడాది మొత్తం మీద 3% నష్టపోయింది. మంగళవారం డాలర్ మారకంలో రూపాయి 12 పైసలు నష్టపోయి జీవితకాల కనిష్ఠ స్థాయి 85.64కి పడిపోయింది. కాగా 2023 డిసెంబరు 29వ తేదీన డాలర్ మారకంలో రూపాయి 83.16 వద్ద ఉండగా మంగళవారం (2024 డిసెంబరు 31) 85.64 వద్ద క్లోజైంది. రూపాయి అక్టోబరు 10 వ తేదీన కీలకమైన 84 స్థాయిని, డిసెంబరు 19వ తేదీన 85 స్థాయిని బ్రేక్ చేసింది. డిసెంబరు 27వ తేదీన ఇంట్రాడేలో జీవితకాల కనిష్ఠ స్థాయి 85.80ని తాకింది.

క్రీడాభిమానులకు ఈ ఏడాది ఆరంభంలోనే క్రికెట్ పండుగ రానుంది. ఎనిమిదేళ్ల తర్వాత జరుగుతున్న చాంపియన్స్ ట్రోఫీ హైలైట్‌గా నిలవనుంది. హైబ్రిడ్ విధానంలో నిర్వహించనున్న తొలి ఐసీసీ ఈవెంట్ కావడంతో.. సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఇక, మహిళల వన్డే వరల్డ్‌కప్.. భారత్‌లో జరగనున్న మెగా ఈవెంట్. ఎప్పటి లాగానే టెన్నిస్ గ్రాండ్‌స్లామ్ ఈవెంట్లు మజాను పంచనున్నాయి. ఎఫ్-1 రేస్ క్యాలెండర్ ఫుల్‌గా నిండిపోగా.. బ్యాడ్మింటన్, ఫుట్‌బాల్, ఖో-ఖో వరల్డ్‌కప్ అలరించనున్నాయి.



2025 స్పోర్ట్స్ క్యాలెండర్

ఈ ఏడాదీ ఫుల్ జోష్..

జనవరి
- డిసెంబరు 28-ఫిబ్రవరి 1: పురుషుల హాకీ ఇండియా లీగ్ 2024-25 (హాకీ)
- జనవరి 12-26: మహిళల హాకీ ఇండియా లీగ్ 2024-25 (హాకీ)
- జనవరి 12-26: ఆస్ట్రేలియన్ ఓపెన్ (టెన్నిస్)
- జనవరి 13-19: ఖో-ఖో ప్రపంచకప్ (ఖో-ఖో)
- జనవరి 14-19: ఇండియా ఓపెన్ (బ్యాడ్మింటన్)
- జనవరి 18-ఫిబ్రవరి 2: అండర్ 19 మహిళల టీ20 ప్రపంచకప్ (క్రికెట్)

ఫిబ్రవరి
- ఫిబ్రవరి 7-14: ఆసియా వింటర్ క్రీడలు
- ఫిబ్రవరి 15-జూన్ 29: మహిళల హాకీ ప్రొ లీగ్ 2024-25 (హాకీ)
- ఫిబ్రవరి 15-జూన్ 22: పురుషుల హాకీ ప్రొ లీగ్ 2024-25 (హాకీ)
- ఫిబ్రవరి 19-మార్చి 9: చాంపియన్స్ ట్రోఫీ (క్రికెట్)

మార్చి
- మార్చి 1-12: మహిళల హాకీ జాతీయ చాంపియన్‌షిప్ (హాకీ)
- మార్చి 10-11: వరల్డ్ అథ్లెటిక్స్ రిలే (అథ్లెటిక్స్)
- మార్చి 11-16: ఆల్ ఇంగ్లండ్ ఓపెన్ (బ్యాడ్మింటన్)
- మార్చి 14- మే 25: ఐపీఎల్ (క్రికెట్)
- మార్చి 14-16: ఆస్ట్రేలియన్ గ్రాండ్ ప్రీ (ఎఫ్-1 రేస్)
- మార్చి 16: ఇంగ్లిష్ లీగ్ కప్ ఫైనల్ (ఫుట్‌బాల్)
- మార్చి 21-23: చైనా గ్రాండ్ ప్రీ (ఎఫ్-1 రేస్)

ఏప్రిల్
- ఏప్రిల్ 4-6: జపనీస్ గ్రాండ్ ప్రీ (ఎఫ్-1 రేస్)
- ఏప్రిల్ 4-15: సీనియర్ పురుషుల హాకీ జాతీయ చాంపియన్‌షిప్ (హాకీ)
- ఏప్రిల్ 7-13: మాస్టర్స్ టోర్నీ (గోల్ఫ్)
- ఏప్రిల్ 11-13: బహ్రెయిన్ గ్రాండ్ ప్రీ (ఎఫ్-1 రేస్)
- ఏప్రిల్ 18-20: అబుధాబి గ్రాండ్ ప్రీ (ఎఫ్-1 రేస్)
- ఏప్రిల్ 19- మే 5: వరల్డ్ స్నూకర్ చాంపియన్‌షిప్ (స్నూకర్)
- ఏప్రిల్ 26-28: డైమండ్ లీగ్
- ఏప్రిల్ 27: లండన్ మారథాన్ (అథ్లెటిక్స్)

మే
- మే 2-4: మయామి గ్రాండ్ ప్రీ (ఎఫ్-1 రేస్)
- మే 15-18: పీజీఏ చాంపియన్‌షిప్ (గోల్ఫ్)
- మే 16-18: ఐమోలా గ్రాండ్ ప్రీ (ఎఫ్-1 రేస్)
- మే 17-25: వరల్డ్ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్ (టేబుల్ టెన్నిస్)
- మే 21: యూరోపియన్ లీగ్ ఫైనల్ (ఫుట్‌బాల్)
- మే 23-25: మొనాకో గ్రాండ్ ప్రీ (ఎఫ్-1 రేస్)
- మే 24: జర్మన్ కప్ ఫైనల్ (ఫుట్‌బాల్)
- మే 24: ఫ్రెంచ్ కప్ ఫైనల్ (ఫుట్‌బాల్)
- మే 24: మహిళల చాంపియన్స్ లీగ్ ఫైనల్ (ఫుట్‌బాల్)
- మే 25-జూన్ 7: ఫ్రెంచ్ ఓపెన్ (టెన్నిస్)
- మే 27-31: ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ (అథ్లెటిక్స్)
- మే 28: యూరోపా కాన్ఫరెన్స్ లీగ్ ఫైనల్ (ఫుట్‌బాల్)
- మే 30-జూన్ 1: స్పానిష్ గ్రాండ్ ప్రీ (ఎఫ్-1 రేస్)
- మే 31: చాంపియన్స్ లీగ్ ఫైనల్ (ఫుట్‌బాల్)

జూన్
- జూన్ 4-8: యూఈఎఫ్ఏ నేషన్స్ లీగ్ ఫైనల్స్ (ఫుట్‌బాల్)
- జూన్ 5-22: ఎన్‌బీఏ ఫైనల్స్ (బాస్కెట్‌బాల్)
- జూన్ 12-15: యూఎస్ ఓపెన్ (గోల్ఫ్)
- జూన్ 13-15: కెనడా గ్రాండ్ ప్రీ (ఎఫ్-1 రేస్)
- జూన్ 14-జూలై 13: ఫిఫా క్లబ్ వరల్డ్ కప్ (ఫుట్‌బాల్)
- జూన్ 14-జూలై 6: కాన్‌కాఫ్ గోల్డ్ కప్ (ఫుట్‌బాల్)
- జూన్ 27-29: ఆస్ట్రియన్ గ్రాండ్ ప్రీ (ఎఫ్-1 రేస్)
- జూన్ 30-జూలై 13: వింబుల్డన్ (టెన్నిస్)


జూలై
- జూలై 2-27: యూఈఎఫ్ఏ మహిళల యూరో (ఫుట్‌బాల్)
- జూలై 4-6: బ్రిటిష్ గ్రాండ్ ప్రీ (ఎఫ్-1 రేస్)
- జూలై 5-26: సీఏఎఫ్ మహిళల ఆఫ్రికా కప్ ఆఫ్ నేషన్స్ ఫుట్‌బాల్)
- జూలై 5-29: ఫిడే మహిళల వరల్డ్ కప్ (చెస్)
- జూలై 11-ఆగస్టు 3: వరల్డ్ ఆక్వాటిక్స్ చాంపియన్‌షిప్స్ (స్విమ్మింగ్)
- జూలై 12-ఆగస్టు 2: కోపా అమెరికా ఫెమినినా (ఫుట్‌బాల్)
- జూలై 17-20: ది ఓపెన్ చాంపియన్‌షిప్ (గోల్ఫ్)
- జూలై 25-27: బెల్జియన్ గ్రాండ్ ప్రీ (ఎఫ్-1 రేస్)

ఆగస్టు



- ఆగస్టు 1-3: హంగేరియన్ గ్రాండ్ ప్రీ (ఎఫ్-1 రేస్)
- ఆగస్టు 7-17: వరల్డ్ గేమ్స్ (మల్టీ స్పోర్ట్స్)
- ఆగస్టు 15-సెప్టెంబరు 15: **మహిళల వన్డే వరల్డ్‌కప్ (షెడ్యూల్ ఖరారు కాలేదు)**
- ఆగస్టు 25-సెప్టెంబరు 7: యూఎస్ ఓపెన్ (టెన్నిస్)
- ఆగస్టు 25-31: వరల్డ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ (బ్యాడ్మింటన్)
- ఆగస్టు 27-28: డైమండ్ లీగ్ ఫైనల్ (అథ్లెటిక్స్)
- ఆగస్టు 29-31: డచ్ గ్రాండ్ ప్రీ (ఎఫ్-1 స్పోర్ట్స్)

సెప్టెంబరు



- సెప్టెంబరు 5-12: వరల్డ్ ఆర్చరీ చాంపియన్‌షిప్ (ఆర్చరీ)
- సెప్టెంబరు 5-7: ఇటాలియన్ గ్రాండ్ ప్రీ (ఎఫ్-1 రేస్)
- **సెప్టెంబరు 13-21: వరల్డ్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్**
- సెప్టెంబరు 13-21: వరల్డ్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్స్
- సెప్టెంబరు 19-21: అజర్‌బైజాన్ గ్రాండ్ ప్రీ (ఎఫ్-1 రేస్)
- సెప్టెంబరు 25-28: రైడర్ కప్ (గోల్ఫ్)
- సెప్టెంబరు 27-అక్టోబరు 19: ఫిఫా అండర్-20 వరల్డ్‌కప్
- మహిళల వన్డే వరల్డ్‌కప్ (క్రికెట్) (షెడ్యూల్ ప్రకటించాలి)

అక్టోబరు
- అక్టోబరు 1-10: వరల్డ్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్స్ (వెయిట్ లిఫ్టింగ్)
- అక్టోబరు 3-5: సింగపూర్ గ్రాండ్ ప్రీ (ఎఫ్-1 రేస్)
- అక్టోబరు 13-19: వరల్డ్ జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ (బ్యాడ్మింటన్)
- అక్టోబరు 17-19: యూఎస్ గ్రాండ్ ప్రీ (ఎఫ్-1 రేస్)
- అక్టోబరు 19-25: వరల్డ్ ఆర్టిస్టిక్ జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్స్ (జిమ్నాస్టిక్స్)
- అక్టోబరు 24-26: మెక్సికో గ్రాండ్ ప్రీ (ఎఫ్-1 రేస్)

నవంబరు
- వరల్డ్ బాక్సింగ్ కప్ ఫైనల్ (బాక్సింగ్) (షెడ్యూల్ ప్రకటించాలి)
- నవంబరు 6-16: వరల్డ్ రైఫిల్, పిస్టల్ చాంపియన్‌షిప్స్ (షూటింగ్)
- నవంబరు 7-9: బ్రెజీలియన్ గ్రాండ్ ప్రీ (ఎఫ్-1 రేస్)
- నవంబరు 15-26: డెఫిలింపిక్స్ (మల్టీ స్పోర్ట్స్)
- నవంబరు 20-22: లాస్ వెగాస్ గ్రాండ్ ప్రీ (ఎఫ్-1 రేస్)
- నవంబరు 25-30: సయ్యద్ మోదీ ఇంటర్నేషనల్ (బ్యాడ్మింటన్)
- నవంబరు 28-30: ఖతార్ గ్రాండ్ ప్రీ (ఎఫ్-1 రేస్)

డిసెంబరు



- డిసెంబరు 5-7: అబుధాబి గ్రాండ్ ప్రీ (ఎఫ్-1 రేస్)
- డిసెంబరు 10-14: బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ ఫైనల్స్ (బ్యాడ్మింటన్)
- డిసెంబరు 21-జనవరి 18: ఆఫ్రికా కప్ ఆఫ్ నేషన్స్ (ఫుట్‌బాల్)
- పురుషుల హాకీ జూనియర్ వరల్డ్‌కప్ (హాకీ) (షెడ్యూల్ ప్రకటించాలి)

స్పోర్ట్స్



వావ్.. వైశాలి

అజేయంగా క్వార్టర్స్‌లోకి ● అర్జున్, ప్రజ్ఞానంద, హంపిలకు నిరాశ ● వరల్డ్ బ్లిట్జ్ చెస్

న్యూయార్క్: ప్రపంచ బ్లిట్జ్ చెస్ చాంపియన్‌షిప్ మహిళల విభాగంలో భారత గ్రాండ్‌మాస్టర్ ఆర్.వైశాలి అదరగొడుతోంది. అనూహ్య ఆటతీరుతో అజేయంగా దూసుకెళ్తున్న ఈ తమిళనాడు క్రీడాకారిణి 9.5 పాయింట్లతో క్వార్టర్‌ఫైనల్స్‌కు చేరుకుంది. దీంతో తాజా టోర్నీలో నాకౌట్‌లో అడుగుపెట్టిన ఏకైక భారత ప్లేయర్‌గా నిలిచిన వైశాలి.. 2024లో గుకేశ్, హంపి తర్వాత మరో వరల్డ్ చాంపియన్‌గా రికార్డులకెక్కాలనుకుంటోంది. తొలి దశలో ఆడిన 11 రౌండ్లలో 8 విజయాలు, మూడు డ్రాలతో వైశాలి టాప్‌లో ఉంది. సెమీస్‌లో చోటు కోసం 23 ఏళ్ల వైశాలి ఝు జినెర్ (చైనా)తో తలపడనుంది. టోర్నీలో వైశాలి మినహా భారత ఆటగాళ్ల పోరాటం ముగిసింది. టాప్-8 మాత్రమే క్వార్టర్స్‌కు వెళ్లనుండగా, 8 పాయింట్లతో హంపి తొమ్మిదో స్థానంలో నిలిచింది. దివ్య, వంతిక కూడా నిరాశపరిచారు. ఇక ఓపెన్ విభాగంలోనూ వైశాలి సోదరుడు ప్రజ్ఞానంద (8.5) 23వ స్థానంలో, అర్జున్ ఇరిగేసి (7) 64వ స్థానంలో, ప్రణవ్ (7) 67వ స్థానంలో నిలిచి నిష్క్రమించారు.

ఆస్ట్రేలియా డ్రీమ్ టీమ్ కెప్టెన్ బుమ్రా



సిడ్నీ: ఆస్ట్రేలియా టూర్‌లో బంతితో ఒంటరి పోరాటం చేస్తున్న బుమ్రాకు అరుదైన గౌరవం దక్కింది. క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) ప్రతి ఏడాది ప్రకటించే తమ 'అత్యుత్తమ టెస్ట్ టీమ్ ఆఫ్ ద ఇయర్ కెప్టెన్‌గా బుమ్రాను ఎంపిక చేసింది. యశస్వీ జైస్వాల్‌కు కూడా ఈ జట్టులో చోటు లభించింది. 2024లో బుమ్రా అన్ని ఫార్మాట్లలో కలిపి అత్యధికంగా 84 వికెట్లు పడగొట్టాడు. ఆసీస్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్‌కు చోటు దక్కక పోవడం గమనార్హం.

ఆస్ట్రేలియా అత్యుత్తమ టెస్ట్ జట్టు: జైస్వాల్, బెన్ డకెట్ (ఇంగ్లండ్), జో రూట్ (ఇంగ్లండ్), రచిన్ రవీంద్ర (న్యూజిలాండ్), హ్యారీ బ్రూక్ (ఇంగ్లండ్), కమిందు మెండిస్ (శ్రీలంక), అలెక్స్ క్యారీ (ఆస్ట్రేలియా), మ్యాట్ హెన్రీ (న్యూజిలాండ్), బుమ్రా (కెప్టెన్), హాజెల్‌వుడ్ (ఆస్ట్రేలియా), కేశవ్ మహరాజ్ (దక్షిణాఫ్రికా).

విరాట్, రోహిత్‌లకు విశ్రాంతి!

బుమ్రాకు సైతం.. ఇంగ్లండ్‌తో పరిమిత ఓవర్ల సిరీస్

న్యూఢిల్లీ: ఇంగ్లండ్‌తో జరుగబోయే పరిమిత ఓవర్ల సిరీస్‌ల్లో సీనియర్లకు విశ్రాంతినిచ్చే అవకాశముంది. ఈనెల 22 నుంచి ఇంగ్లండ్‌తో టీమిండియా ఐదు టీ20లు, మూడు వన్డేల సిరీస్‌లను ఆడనుంది. ఫిబ్రవరి 6 నుంచి జరిగే మూడు వన్డేల సిరీస్‌లో ఈ ముగ్గురికి పనిఒత్తిడి కారణంగా సెలెక్టర్లు విశ్రాంతినివ్వనున్నట్టు మీడియా కథనం. ఎందుకంటే అదే నెల 19 నుంచి ప్రతిష్ఠాత్మక చాంపియన్స్ ట్రోఫీ జరుగబోతోంది. ఈ టోర్నీని దృష్టిలో ఉంచుకుని బీసీసీఐ కీలక ఆటగాళ్లను తాజాగా ఉంచాలనుకుంటోంది.

సంతోష్ ట్రోఫీ విజేత బెంగాల్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): సంతోష్ ట్రోఫీను పశ్చిమ బెంగాల్ జట్టు కైవసం చేసుకుంది. మంగళవారం గచ్చిబౌలిలోని జీఎంసీ బాలయోగి ఫుట్‌బాల్ స్టేడియంలో జరిగిన ఫైనల్లో బెంగాల్ 1-0తో కేరళపై గెలిచింది. ఇంజ్యూరీ టైమ్ నాలుగో నిమిషంలో బెంగాల్ స్టార్ ప్లేయర్ రోబి హన్సడా మెరుపు గోల్ చేసి ఆ జట్టును ఆధిక్యంలోకి తీసుకెళ్లాడు. బెంగాల్ జట్టు సంతోష్ ట్రోఫీ గెలవడం ఇది 33వ సారి.

హైదరాబాద్ ఉత్కంఠ విజయం

అహ్మదాబాద్: వరుణ్ గౌడ్ (109), కెప్టెన్ తిలక్ వర్మ (99) రాణించడంతో.. విజయ్ హజారే ట్రోఫీలో హైదరాబాద్ వరుసగా రెండో మ్యాచ్‌లో గెలిచింది. మంగళవారం జరిగిన ఈ మ్యాచ్‌లో హైదరాబాద్ 3 వికెట్ల తేడాతో కర్ణాటకపై గెలిచింది. తొలుత కర్ణాటక 50 ఓవర్లలో 320/8 స్కోరు చేసింది. మయాంక్ అగర్వాల్ (124) సెంచరీ సాధించాడు. చామా మిలింద్ 3 వికెట్లు పడగొట్టాడు. ఛేదనలో హైదరాబాద్ 49.4 ఓవర్లలో 7 వికెట్లకు 322 పరుగులు చేసి నెగ్గింది.

ఆయుష్ ప్రపంచ రికార్డు

లిస్ట్-ఎ క్రికెట్‌లో 150పైగా పరుగులు సాధించిన పిన్న వయస్కుడిగా ముంబై బ్యాటర్ ఆయుష్ మహత్రే (17 ఏళ్ల 168 రోజులు) ప్రపంచ రికార్డు సృష్టించాడు. ఈ క్రమంలో యశస్వి జైస్వాల్ (17 ఏళ్ల 291 రోజులు) రికార్డును బద్దలుకొట్టాడు. ఆయుష్ (117 బంతుల్లో 181) అదరగొట్టడంతో.. విజయ్ హజారే ట్రోఫీ మ్యాచ్‌లో నాగాలాండ్ (214/9)పైముంబై(403/7) నెగ్గింది.

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
నూతన సంవత్సర శుభాకాంక్షలు


ఆస్ట్రేలియాలోని సిడ్నీలో ప్రఖ్యాత ఒపెరా హౌజ్‌వద్ద నూతన సంవత్సర సంబురాలు

బుధవారం | 1-1-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 274 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, పుష్యమాసం, శుక్లపక్షం; తిథి: విదియ రా. 2.22 తదుపరి తదియ; నక్షత్రం: ఉత్తరాషాఢ రా. 11.46 తదుపరి శ్రవణం వర్జ్యం: ఉ. 7.58-9.22, తె. 3.40-5.13; దుర్ముహూర్తం: ఉ. 11.56-12.40; అమృతఘడియలు: సా. 5.26-7.01; రాహుకాలం: మ. 12.00-1.30, సూర్యోదయం: 6.49; సూర్యాస్తమయం: 5.48 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



4న రాష్ట్ర మంత్రివర్గ సమావేశం

రేషన్ కార్డుల జారీ, రైతు భరోసా తదితర కీలక అంశాలపై చర్చ

బీసీ కమిషన్ నివేదిక, ఎస్సీ వర్గీకరణ, యాదగిరిగుట్ట ఆలయ బోర్డుపైనా..

హైదరాబాద్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఈ నెల 4న జరగనుంది. డిసెంబరు 30న నిర్వహించాలని ముందు నిర్ణయించినా మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మృతితో వాయిదా వేశారు. 4న సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షత జరిగే ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చించి, తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ముఖ్యంగా కొత్త రేషన్ కార్డులు, రైతు భరోసా, రైతు కూలీలకు సంవత్సరానికి రూ.12 వేల సహాయం, స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్ల కోసం డెడికేటెడ్ కమిషన్ నివేదిక, ఎస్సీ వర్గీకరణ, యాదగిరిగుట్ట ఆలయ బోర్డు వంటి అంశాలపై చర్చించనున్నారని సమాచారం. రాష్ట్రంలో కొత్త తెల్ల రేషన్ కార్డులు జారీ చేయాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది. ప్రజల నుంచి దరఖాస్తులు కూడా స్వీకరించింది. కార్డుల జారీకి నిబంధనలపై చర్చించి, ఆమోదం తెలిపే అవకాశం ఉంది. రైతు భరోసాపై ఇప్పటికే క్యాబినెట్ సబ్ కమిటీ పలుమార్లు చర్చించింది. దీనిపై క్యాబినెట్‌లోనూ చర్చించనున్నారు. ఎంత భూ విస్తీర్ణానికి రైతు భరోసాను పరిమితం చేయాలి? లబ్ధిదారుల గుర్తింపు ఎలా? వంటి అంశాలపై కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. రైతు కూలీలకు ఏటా రూ.12 వేలను చెల్లిస్తామని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీపై కూడా చర్చించి, ఓ నిర్ణయానికి రానున్నట్లు సమాచారం. యాదగిరి గుట్టను టీటీడీ తరహాలో తీర్చిదిద్దాలని భావిస్తున్న ప్రభుత్వం.. అందుకోసం తీసుకోవాల్సిన చర్యలపైనా చర్చించనుంది. రెండు కొత్త కార్పొరేషన్లు, 12 కొత్త మునిసిపాలిటీల ఏర్పాటుకు క్యాబినెట్ ఆమోదం తెలపనుంది.

11

గవర్నర్ వద్దకు భూభారతి బిల్లు

పీఎం కిసాన్ ఇక 10 వేలు



ఏడాదికి ఇస్తున్న రూ.6 వేలను పెంచిన కేంద్రం

అన్నదాతలకు మోదీ నూతన సంవత్సర కానుక

బడ్జెట్‌లో వెల్లడించకముందే ప్రకటించిన ప్రధాని!

దేశవ్యాప్తంగా మరో 2 కోట్ల ఇళ్ల నిర్మాణంపై సర్వే

ప్రాధాన్య ప్రాతిపదికన మూడు నెలల్లో సర్వే పూర్తి

అన్ని రాష్ట్రాలకు లేఖలు రాసిన కేంద్ర ప్రభుత్వం

'మేరా భారత్ బఢ్ రహా'

సమష్టి కృషితో 2024లో అనేక విజయాలు

2025లో మరింత కష్టపడదాం: ప్రధాని మోదీ

ఇందిరమ్మ ఇంటికి ఇసుక ఉచితం!

ఒక్కో నిర్మాణానికి 37-40 టన్నులు అవసరం

4.50 లక్షల ఇళ్లకు 112 లక్షల క్యూ.మీ. ఇసుక

అదనంగా 60 వేలు వెచ్చించనున్న రాష్ట్ర ప్రభుత్వం

ఇంటివద్దకే పహాణీ

పేద రైతులకు ఉచిత న్యాయ సహాయం

భూభారతి-2024 చట్టంలో పెట్టిన ప్రభుత్వం

తొలిసారి తెలంగాణలో ఉచిత న్యాయం ప్రస్తావన

11

న్యూఢిల్లీ, డిసెంబరు 31: దేశవ్యాప్తంగా రైతులు, పేదలకు ప్రధాని మోదీ నూతన సంవత్సర కానుకలు ప్రకటించారు. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి కింద అన్నదాతలకు అందిస్తున్న పెట్టుబడి సాయాన్ని పెంచుతున్నట్లు తెలిపారు. అలాగే దేశంలో పేదల కోసం మరో 2 కోట్ల ఇళ్ల నిర్మాణానికి అవసరమైన సర్వే చేయాలని నిర్ణయించారు. 2019 నుంచి మోదీ సర్కారు ఏటా రైతులకు రూ.6 వేలు పెట్టుబడి సాయం అందిస్తోంది. రూ.2 వేల చొప్పున మూడు విడతల్లో అన్నదాతల ఖాతాల్లో సొమ్మును జమ చేస్తున్నారు. ఈ మొత్తాన్ని ఇప్పుడు రూ.10 వేలకు పెంచుతున్నట్లు మోదీ 'ఎక్స్'లో తెలిపారు. రైతులను ఆర్థికంగా ఆదుకునేందుకు వారి ఖాతాల్లో నేరుగా రూ.10 వేలు జమ చేయనున్నట్లు ప్రకటించారు. కిసాన్ నిధిని పెంచేందుకు కేంద్రం కసరత్తు చేస్తోందని.. ఆర్థిక మంత్రి నిర్మల త్వరలో ప్రవేశపెట్టే 2025-26 బడ్జెట్‌లో ప్రకటన చేసే అవకాశాలున్నాయని అధికార వర్గాలు ఇదివరకే పేర్కొన్నాయి. అయితే దానికి ముందే ఆ మొత్తాన్ని రూ.10 వేలకు పెంచుతున్నట్లు మంగళవారం ప్రధాని స్వయంగా వెల్లడించడం గమనార్హం. రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడానికి ఆరేళ్లుగా అమలు చేస్తున్న ఈ పథకానికి దేశవ్యాప్తంగా విశేష ఆదరణ ఉంది. రైతులకు పంట సాయం కింద బాగా ఉపయోగపడుతోంది. ఇప్పటి వరకు కేంద్రం 18 వాయిదాలు చెల్లించింది. కొత్త ఏడాది



మిగతా 2వ పేజీలో...

గ్రీన్‌ఫీల్డ్ రహదారి భూసేకరణకు నోటిఫికేషన్ 12

ఫోర్త్ సిటీని కలుపుతూ నిర్మాణం

554 ఎకరాలు సేకరించనున్న సర్కారు

కొత్త మెడికల్ కాలేజీలకు శాశ్వత సెలవు

ప్రజాప్రతినిధులకు కాన్‌స్టిట్యూషన్ క్లబ్

న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఏర్పాటుకు నిర్ణయం 11

నాలుగు ఎకరాల్లో నిర్మాణం

■ సినిమా సిటీకి..

2,000 ఎకరాలు ఇవ్వండి

పారదర్శకతకు 'ఆన్‌లైన్ టికెట్' అమలు చేయాలి

అటవీ ప్రాంతాల్లో షూటింగ్ చార్జీలను తగ్గించాలి

ఆఫీసులు, బస్టాండ్లలో షూటింగ్‌కు అనుమతినివ్వండి

రూ. 4 కోట్ల పెండింగ్ రాయితీని విడుదల చేయండి

ఎఫ్‌డీసీకి ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ విజ్ఞప్తి

రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించనున్న ఎఫ్‌డీసీ

హైదరాబాద్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): 'హైదరాబాద్‌లో సినిమా సిటీ ఏర్పాటు చేస్తాం. అందుకు 1500-2000 ఎకరాల భూవిని కేటాయించండి' అంటూ తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు పలు వినతులతో కూడిన లేఖను అందించారు. గత ప్రభుత్వం 2020లో హైదరాబాద్‌లో సినిమా సిటీ ఏర్పాటు కోసం భూములను ఇస్తామని ప్రకటించింది. ఆ భూముల్లో అంతర్జాతీయ స్థాయిలో స్టూడియోల నిర్మాణం, అత్యుత్తమ సౌకర్యాలను కూడా కల్పిస్తామని చెప్పింది. అంతేకాకుండా ప్రభుత్వం కేటాయించే భూముల్లో మౌలిక సదుపాయాలను కూడా కల్పిస్తుందని, విమానాలు తిరిగేలా ఒక ఎయిర్‌స్ట్రిప్‌ను కూడా నిర్మించేలా ప్రతిపాదించింది. కానీ, ఇప్పటివరకూ ఏదీ ముందుకుపడలేదు. ఇదే అంశాన్ని ప్రధానంగా సినీ పరిశ్రమ ఎఫ్‌డీసీ ముందుంచింది. ప్రస్తుత ప్రభుత్వం రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి 24 కి.మీ. పరిధిలో ఎక్కడైనా సినిమా సిటీ నిర్మాణానికి భూములను కేటాయించాలని కోరింది. ఇక, టికెట్ల పారదర్శకత కోసం ప్రత్యేక చర్యలు చేపట్టాలని ప్రభుత్వానికి సూచించింది. పెద్ద సినిమాల విడుదల సమయంలో బ్లాక్ టికెట్ల దందా జోరుగా సాగుతోంది. దీనికి చరమగీతం పాడేలా 'ఆన్‌లైన్ టికెటింగ్' వ్యవస్థను ప్రవేశపెట్టాలని పరిశ్రమ ప్రతిపాదించింది. ఈ ఆన్‌లైన్



మిగతా 3వ పేజీలో...

కుంటల్లో షెడ్లు కూల్చివేత

హైదరాబాద్ ఖాజాగూడలో హైడ్రా చర్యలు

రోడ్డున పడ్డ కూలీలు.. సామగ్రి డివైడర్లపైకి 3

నోటీసులు ఇవ్వమన్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

ఆధారాల్లేకుండా చర్యలా: హైకోర్టు ఆగ్రహం

హైడ్రా కమిషనర్‌ను మళ్లీ పిలవాల్సి వస్తుందని వ్యాఖ్య

వాదనలకు అవకాశమిచ్చి, చర్యలు తీసుకోవాలని ఆదేశాలు


భగీరథమ్మ చెరువులో ఆక్రమణలను తొలగిస్తున్న హైడ్రా

హైడ్రా ఠాణాకు సీఎం పచ్చజెండా 3



తీర్పు ఇచ్చేదాకా అరెస్టు వద్దు

హైకోర్టు ఆదేశం.. కేటీఆర్ క్వాష్ పిటిషన్‌పై తీర్పు రిజర్వు

హెచ్‌ఎండీఏ నిధులను రేస్‌లకు వినియోగించవచ్చా?

దర్యాప్తు ఏ దశలో ఉంది? ఇప్పటివరకు ఏం చేశారు?

ఫార్ములా ఈ-రేస్ కేసులో ఏసీబీకి ధర్మాసనం ప్రశ్నలు

ఆర్థికశాఖ అనుమతి.. క్యాబినెట్ ఆమోదం లేదు

ఒప్పందానికి ముందు చెల్లింపులు ఎలా చేస్తారు?

గంపగుత్తగా నిబంధనలు ఉల్లంఘన: ఏసీబీ, ప్రభుత్వం

ఉల్లంఘనే నేరం జరిగినట్లు కాదు: కేటీఆర్ న్యాయవాదులు

హైదరాబాద్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ఫార్ములా ఈ-రేస్ కేసులో మాజీ మంత్రి కేటీఆర్‌కు హైకోర్టులో భారీ ఊరట లభించింది. ఈ కేసులో కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌లో తీర్పు వెలువరించే వరకు ఆయనను అరెస్ట్ చేయరాదని హైకోర్టు పేర్కొంది. ఈ మేరకు తీర్పును రిజర్వు చేస్తున్నట్లు ప్రకటించింది. ఏసీబీ దర్యాప్తును మాత్రం యథావిధిగా చేసుకోవచ్చని తెలిపింది. అయితే విచారణలో భాగంగా ఇటు

మిగతా 12వ పేజీలో...

ప్రతి రైతుకూ 'భరోసా'

సాగు చేసే అందరికీ ఇవ్వాలనేది నా అభిప్రాయం

దుష్ప్రచారాలను నమ్మొద్దు.. మంత్రివర్గ ఉపసంఘం చర్చిస్తోంది

పథకం విధివిధానాలపై అక్కడే నిర్ణయం: మంత్రి తుమ్మల

ఈ యాసంగిలో 70 లక్షల ఎకరాల్లో పంటలు సాగు అంచనా

ఇందుకోసం రైతు భరోసాకు రూ. రూ.5,250 కోట్లు అవసరం!

రోడ్డు భద్రతామాసాన్ని విజయవంతం చేయండి

అవగాహన కార్యక్రమాలు, కంటి పరీక్షలు నిర్వహించండి 11

రవాణా శాఖ, ఆర్టీసీ అధికారులతో మంత్రి పొన్నం ప్రభాకర్

కార్పొరేట్ స్థాయిలో సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులు

తొలిదశలో నాలుగు జిల్లాల్లో నిర్మాణం 11

గచ్చిబౌలిలో మోడల్ రిజిస్ట్రేషన్ ఆఫీసు: మంత్రి పొంగులేటి





సత్తుపల్లి/హైదరాబాద్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): రైతుగా, వ్యవసాయ శాఖ మంత్రిగా పంట సాగు చేసే ప్రతి ఒక్క రైతుకూ ఏ రకమైన కోత లేకుండా రైతు భరోసా అందాలనేది తన వ్యక్తిగత అభిప్రాయమని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రైతు భరోసా పథకానికి సంబంధించిన విధివిధానాలపై ప్రభుత్వం ఇంకా ఏ విధమైన నిర్ణయం తీసుకోలేదని చెప్పారు. కొన్ని మీడియా సంస్థలు, ప్రతిపక్షాలు చేస్తున్న దుష్ప్రచారాన్ని రైతులు నమ్మవద్దని కోరారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలంలోని తన వ్యవసాయ క్షేత్రంలో మంగళవారం మంత్రి విలేకరులతో మాట్లాడారు. రైతుభరోసా విధివిధానాలపై రాష్ట్ర ప్రభుత్వం నియమించిన మంత్రివర్గ ఉపసంఘం చర్చిస్తోందని చెప్పారు. మంత్రివర్గ సమావేశంలోనూ చర్చించిన తరువాతే ప్రభుత్వం తగిన నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న నిర్ణయమే తుది నిర్ణయం అని పేర్కొన్నారు. రైతుభరోసాపై ప్రభుత్వ నిర్ణయం జరిపోయిందంటూ కొన్ని మీడియా సంస్థలు, ప్రతిపక్షాలు ప్రచారం చేయటం తగదన్నారు. రైతుభరోసా పథకంలో రైతుల సంఖ్యను తగ్గించే ప్రయత్నం జరుగుతోందనే ప్రచారంలోనూ వాస్తవం లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్ణయమే తీసుకోనప్పుడు

మిగతా 3వ పేజీలో...

రుణాల పునర్వ్యవస్థీకరణ

నీటిపారుదల శాఖలో రూ. 11 వేల కోట్లు అసలు/వడ్డీకే పోతుంది

గతంలో ప్రాజెక్టుల కోసం స్వల్పకాలిక రుణాలు అధిక వడ్డీకే

ఇలాంటి వాటిని దీర్ఘకాలిక రుణాలుగా మార్చుతాం

కృష్ణాలో 550 టీఎంసీలను సాధించేలా వాదనలు 11

రానున్న 15 రోజుల్లో పదోన్నతులు, బదిలీలు: మంత్రి ఉత్తమ్


విలేకర్ల సమావేశంలో మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి


విదేశీ ప్రయాణాలపై ఐటీ నజర్?

దుబాయ్, అమెరికా ప్రయాణాలపై దృష్టి

విమాన టికెట్, భోజనాలు, లగేజీ విశ్లేషణ

వివరాల కోసం ఎయిర్‌లైన్స్‌కు సర్క్యులర్లు

ఈ నెల 10వ తేదీ వరకు గడువు విధింపు



(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

విదేశీ ప్రయాణాలు జరిపే భారతీయులపై ఇకపై ఆదాయపన్ను (ఐటీ) శాఖ కూడా నిఘా పెట్టనుంది. ఇప్పటి వరకు అడ్వాన్స్‌డ్ ప్యాసింజర్స్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (ఏపీఐబీ) ద్వారా ఇంటిలిజెన్స్ వర్గాలు.. అతిథి యాప్ ద్వారా కస్టమ్స్ శాఖ, డీఆర్‌ఐ నిఘా పెట్టేవి. అదే కోవలో ఇప్పుడు ఐటీ శాఖ కూడా విమానయాన సంస్థలు భారతీయుల ప్రయాణాల వివరాలను అందించేందుకు ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించింది. భారత్‌కు రాకపోకలు సాగించే దేశ, విదేశీ విమానయాన సంస్థలు ఈ సాఫ్ట్‌వేర్‌ను

మిగతా 3వ పేజీలో...



రైళ్ల వేళల్లో మార్పులు 2

ఎంఎంటీఎస్ వేళల్లోనూ.. అమల్లోకి కొత్త టైమ్ టేబుల్

సర్వీసుల మెరుగు, ప్రయాణికులకు ఉత్తమ సేవలకే

సంక్రాంతికి 6,432 సర్వీసులు

557 సర్వీసులకు ముందస్తు రిజర్వేషన్ 11

ఈ సంక్రాంతికి జిల్లాల నుంచి హైదరాబాద్‌కు ఎలక్ట్రిక్ బస్సులు ప్రత్యేకం

ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్న టీజీఎస్ఆర్టీసీ

జనవరి 9-15 వరకు అందుబాటులో..

రద్దీ ప్రాంతాల్లో ప్రజలకు సౌకర్యాలు



మణిపూర్ సీఎం క్షమాపణ

- హింసలో 200 మందికిపైగా మరణించారు
- కొత్త ఏడాదిలోనైనా శాంతి నెలకొనాలి: బీరేన్ సింగ్



ఇంఫాల్/న్యూఢిల్లీ, డిసెంబరు 31: జాతుల వైరం సుదీర్ఘకాలంగా కొనసాగుతుండటంపై మణిపూర్ సీఎం బీరేన్ సింగ్ ప్రజలకు క్షమాపణలు చెప్పారు. మైతేయి, కుకీ తెగల మధ్య ఘర్షణతో 2023 మే నుంచి ఆ రాష్ట్రంలో హింస కొనసాగుతోంది. 250 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. వేలాదిమంది ఇళ్లను వీడిపోయారు. ఇప్పటికీ అనేకమంది పునరావాస కేంద్రాల్లోనే తలదాచుకుంటున్నారు. దీనిపై మంగళవారం మీడియా ఎదుట విచారం వ్యక్తం చేసిన బీరేన్ సింగ్ ప్రజలను క్షమాపణ కోరారు. 'ఈ ఏడాదంతా చాలా దురదృష్టకర పరిణామాలతోనే కొనసాగింది. గతేడాది మే 3 నుంచి ఇప్పటి వరకు జరిగినదానికి క్షమించమని రాష్ట్ర ప్రజలను కోరుతున్నా. నూతన సంవత్సరం-2025 రాష్ట్రంలో శాంతి, సాధారణ పరిస్థితులను పునరుద్ధరిస్తుందని ఆశాభావంతో ఉన్నా. జరిగిందేదో జరిగిపోయింది. గత తప్పులను మరచిపోయి ఇప్పుడు మనమంతా కొత్త జీవితాన్ని ప్రారంభించాలి. శాంతియుత మణిపూర్, సుసంపన్న మణిపూర్ కోసం మనమంతా కలిసి జీవించాలని రాష్ట్రంలోని అన్ని కులాలను కోరుతున్నా' అన్నారు.

ఈశాన్యంలో 77% హింస మణిపూర్‌లోనే

ఇంఫాల్/న్యూఢిల్లీ, డిసెంబరు 31: ఈశాన్య ప్రాంతంలో 2023లో జరిగిన మొత్తం హింసలో 77 శాతం మణిపూర్‌లోనే చోటుచేసుకుందని తాజాగా కేంద్ర హోంశాఖ వార్షిక నివేదిక వెల్లడించింది. 2022తో పోల్చితే మణిపూర్‌లో హింసాత్మక ఘటనలు 2023లో పెరిగాయని తెలిపింది. ఈశాన్య ప్రాంతంలో 243 హింసాత్మక ఘటనలు జరుగగా, వాటిలో 187 ఘటనలు మణిపూర్‌లోనే జరిగాయని పేర్కొంది. మణిపూర్‌లో తిరుగుబాటు వ్యతిరేక ఆపరేషన్లలో 33 మంది తిరుగుబాటుదారులను హతమార్చామని, 184 మందిని అరెస్టు చేశామని, 49 ఆయుధాలను స్వాధీనం చేసుకున్నామని వివరించింది. అలాగే, 80 తిరుగుబాటు సంస్థల కేడర్ లొంగిపోయారని, 31 ఆయుధాలను స్వాధీనం చేశారని తెలిపింది. కాగా, గడిచిన పదేళ్లలో దేశంలో నక్సలిజం తగ్గుముఖం పట్టిందని కేంద్ర హోంశాఖ వెల్లడించింది. 2026 మార్చి 31కల్లా మావోయిజం పూర్తిస్థాయిలో తుడిచిపెట్టుకుపోతుందని స్పష్టం చేసింది. 2013తో పోలిస్తే.. 2023కల్లా నక్సల్స్ హింస 48%(1,136 నుంచి 594కు) తగ్గిందని.. నక్సల్స్ దాడుల్లో భద్రత బలగాలు, పౌరుల మరణాలు కూడా 65%(397 నుంచి 171) తగ్గినట్లు వివరించింది. నక్సల్స్ ఉనికి కూడా 76 జిల్లాలోని 328 పోలీస్‌స్టేషన్ల నుంచి 42 జిల్లాల్లోని 171 ఠాణాలకు తగ్గినట్లు పేర్కొంది. నక్సల్స్ హింస 25 జిల్లాలకే పరిమితమైనట్లు తెలిపింది.

కేరళ నర్సుకు యెమెన్‌లో మరణశిక్ష



న్యూఢిల్లీ, డిసెంబరు 31: యెమెన్‌లో మరణశిక్ష పడిన భారతీయ నర్సు నిమిష ప్రియను ఆదుకొనేందుకు అన్నివిధాలా ప్రయత్నిస్తున్నామని విదేశాంగ శాఖ తెలిపింది. ఆ దేశ పౌరుడు తలాల్ అబ్దో మెహదీని హత్య చేసిన కేసులో కేరళకు చెందిన ఆమెకు విధించిన మరణశిక్షను దేశాధ్యక్షుడు రషాద్ అల్-అలిమి తాజాగా ఖరారు చేశారు. ఒక నెలలోపే ఆమెకు శిక్ష అమలు చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ అంశంపై విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మంగళవారం స్పందించారు. 'ప్రియను కాపాడుకొనేందుకు ఆమె కుటుంబం అన్ని అవకాశాలను అన్వేషించడాన్ని అర్థం చేసుకోగలం. ఈ విషయంలో ప్రభుత్వం అన్నివిధాలుగా సహకరిస్తుంది' అని తెలిపారు. 2017 జూలైలో మెహదీని హత్య చేయడంతో పాటు అతడి మృతదేహాన్ని ముక్కలు చేసి పారేసిన కేసులో ప్రియకు ట్రయల్ కోర్టు 2020లో మరణశిక్ష విధించింది. 2022 మార్చిలో ఆమె అప్పీలును అప్పిలేట్ కోర్టు తిరస్కరించింది. 2023 నవంబరులో ఆ దేశ సుప్రీంకోర్టు ఈ తీర్పును సమర్థించింది.

పీఎం కిసాన్ ఇక రూ.10 వేలు!

(మొదటి పేజీ తరువాయి)



ఫిబ్రవరిలో 19వ వాయిదా జమ కోసం రైతులు ఎదురుచూస్తున్న తరుణంలో ప్రధాని ప్రకటన వారిలో ఆనందోత్సాహాలు రేపింది. దేశంలో పేదల కోసం మరో 2 కోట్ల ఇళ్లను నిర్మించే విషయంపై సర్వే జరిపించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రధాని మోదీ తరఫున నూతన సంవత్సర కానుకగా ఈ నిర్ణయం తీసుకుంది. 2025 మార్చి 31లోపు ఈ సర్వేను పూర్తి చేయాలని కేంద్రం నిర్ణయించింది. ప్రాధాన్య ప్రాతిపదికన ఈ సర్వేను మూడు నెలల్లో పూర్తి చేయాలంటూ డిసెంబరు 27న కేంద్రం అన్ని రాష్ట్రాలకూ లేఖ రాసింది. 'ఆవాస్ 2024' పేరిట రూపొందించిన యాప్‌లో ప్రజలు స్వయంగా సర్వేలో పాల్గొనేందుకు కేంద్రం అవకాశం కల్పించింది. గత సెప్టెంబరులో ప్రధాని మోదీ ఈ యాప్‌ను ప్రారంభించారు. ఆధార్ ఆధారిత ఈ-కేవైసీ ద్వారా ప్రజలు సర్వేలో పాల్గొనే అవకాశం కల్పించారు. కాగా పేదలకు మరో 3 కోట్ల ఇళ్లు నిర్మిస్తామని బీజేపీ 2024 ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చింది. అయితే రాబోయే నాలుగేళ్లలో అదనంగా 2 కోట్ల ఇళ్లు నిర్మించాలని కేంద్రం భావిస్తున్నట్లు గ్రామీణాభివృద్ధి శాఖ మంగళవారం విడుదల చేసిన వార్షిక నివేదికలో పేర్కొంది. ఇప్పటి వరకు ఎన్డీయే సర్కారు మొత్తం 3.33 కోట్ల ఇళ్లను రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు కేటాయించగా, అందులో 3.22 కోట్ల ఇళ్లు మంజూరయ్యాయని.. 2.68 కోట్ల ఇళ్లు నిర్మించారని తెలిపింది. పీఎంఏవై గ్రామీణ లబ్ధిదారులను గుర్తించేందుకు కృత్రిమ మేధ(ఏఐ) ఆధారిత ఫేస్ టెక్నాలజీని రూపొందించామని, దీనివల్ల మోసాలకు అవకాశం ఉండదని వెల్లడించింది.

మోదీ నూతన సంవత్సర శుభాకాంక్షలు

ఆకాంక్షల భారతావనికి ప్రధాని మోదీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. "అంతరిక్షం నుంచి భూమి వరకు.. రైల్వేస్ నుంచి రన్‌వేస్ దాకా.. సంస్కృతి నుంచి ఆవిష్కరణ వరకు.. 2024లో భారత్ గణనీయ పురోగతిని, పరివర్తనను సాధించింది. ప్రగతి దిశగా నా భారత్ వడివడిగా అడుగులేస్తోంది. మేరా భారత్ బఢ్ రహా" అని 'ఎక్స్'లో తెలిపారు. 2025లోకి విశ్వాసంతో అడుగుపెడుతున్న తరుణంలో తన ట్వీట్‌ను కవితా వేడుకగా అభివర్ణించారు. 2024లో భారత విజయాలను, చేరుకున్న మైలురాళ్లను వివరించే 2.41 నిమిషాల వీడియోను ఈ సందర్భంగా ఆయన పోస్టు చేశారు. ఇందులో అంతరిక్ష ప్రయోగాల విజయాలు, సూపర్-కంప్యూటింగ్, రక్షణ ఉత్పత్తుల పెంపు, పౌరవిమానయాన పరిశ్రమ వృద్ధి, హౌరా మైదాన్ అండర్‌వాటర్ మెట్రో, రామేశ్వరం రైలు వంతెన, వందే భారత్ రైళ్లు, దేశవ్యాప్తంగా వైద్యకళాశాలల పెంపు, ఆరోగ్య సౌకర్యాల మెరుగుదల, అటల్ పెన్షన్ స్కీం, పీఎం ఆవాస్ యోజన, అబుదాబిలో దేవాలయ ప్రతిష్ఠ, మూడు కొత్త క్రిమినల్ చట్టాల అమలు మొదలైనవాటి ప్రస్తావన ఉంది. 2024లో తన ప్రభుత్వ ప్రోగ్రెస్ రిపోర్టు కార్డు ఉంది. విదేశీ మారక ద్రవ్య నిల్వలు 70 వేల కోట్ల డాలర్లకు చేరుకోవడం సహా ఆర్థిక రంగానికి సంబంధించిన ప్రత్యేక సమాచారాన్ని కూడా అందులో పొందుపరిచారు. ఆసియాలో మూడో అతిపెద్ద శక్తిగా భారత్ ఆవిర్భవించడం.. ఉపాధి కల్పన రంగంలో 4.1 కోట్ల మంది యువతకు రూ.2 లక్షల కోట్ల ప్యాకేజీ అందించడం, క్రీడల రంగంలో.. పారా-ఒలింపిక్స్‌లో రికార్డు స్థాయిలో 29 పతకాలు సాధించడం.. పర్యావరణహితం కోరి 'అమ్మ పేరుతో ఒక మొక్క నాటుదాం (ఏక్ పేడ్ మా కే నామ్)' అన్న సందేశం.. గ్రీన్ పవర్ ఉత్పత్తి సామర్థ్యం మొదలైనవాటిని కూడా వివరించారు. సమష్టి కృషితో 2024లో అనేక విజయాలు అందుకున్నామన్నారు. 2025లో మరింత కష్టించి 'వికసిత్ భారత్' కలను సాకారం చేసుకుందామని తెలిపారు. కొత్త సంవత్సరం అందరికీ పురోగతి, శాంతి, ఆరోగ్యం అందిస్తుందన్న ఆశాభావాన్ని మోదీ వ్యక్తంచేశారు.

ఇక డాకింగ్‌పై గురి!

- ఈ నెల 7న ఉండొచ్చన్న ఇస్రో
- ఇస్ట్రాక్ సెంటర్ నుంచి పర్యవేక్షణ



సూళ్లూరుపేట, డిసెంబరు 31: అంతరిక్షంలో డాకింగ్ సాంకేతికతను ప్రదర్శించేందుకు ఇస్రో చేపట్టిన స్పేడెక్స్ మిషన్‌లో కీలక ఘట్టం పూర్తయింది. సోమవారం రాత్రి ఛేజర్, టార్గెట్ అనే జంట ఉపగ్రహాలను రోదసీలోకి మోసుకెళ్లిన పీఎస్ఎల్వీ-సీ60 వాటిని ఒకదాని తర్వాత ఒకటిగా నిర్దేశిత కక్ష్యలో ప్రవేశపెట్టింది. ఇక ఈ ప్రయోగంలో మిగిలింది అసలు సిసలైన డాకింగ్ (రెండు ఉపగ్రహాల అనుసంధానం) ఘట్టమే. దీనిపై ఇస్రో ఛైర్మన్ మాట్లాడుతూ.. డిసెంబరు 31 నుంచి ఇస్రో శాస్త్రవేత్తలు బెంగళూరులోని ఇస్ట్రాక్ సెంటర్ నుంచి వీటిని పర్యవేక్షిస్తారని చెప్పారు. డాకింగ్ ప్రక్రియ బహుశా జనవరి 7న ఉండొచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఆ ఉపగ్రహాలు కక్ష్యలో తిరుగుతున్నాయని కొద్ది రోజుల తర్వాత వాటిని దగ్గరకు చేర్చి మరో వారం రోజుల్లో డాకింగ్ ప్రక్రియ ప్రారంభిస్తామని చెప్పారు. స్పేస్ డాకింగ్ కోసం ఎస్‌డీఎక్స్01 (ఛేజర్), ఎస్‌డీఎక్స్02 (టార్గెట్) అనే జంట ఉపగ్రహాలను ఇస్రో ప్రయోగించింది. ఒక్కోటి 220 కేజీల బరువుండే ఈ శాటిలైట్లను అనంత్ టెక్నాలజీస్ లిమిటెడ్ (ఏటీఎల్) అనే ప్రైవేటు పరిశ్రమ అందించింది. కొన్నేళ్లుగా ఇస్రోతో అనుబంధం కొనసాగిస్తున్న ఏటీఎల్... ఇస్రో సహకారంతో వాటిని రూపొందించింది. 'ఇప్పటివరకు ప్రైవేటు పరిశ్రమలు ఇలాంటి పెద్ద ఉపగ్రహాలను సొంతంగా తయారు చేయలేదు. అయితే ఈ రెండు ఉపగ్రహాలను రూపొందించి వాటిని పరీక్షించడం ఇదే తొలిసారి' అని యూఆర్‌రావు స్పేస్ సెంటర్ డైరెక్టర్ ఎం శంకరన్ తెలిపారు.

త్వరలో శ్రీహరికోటలో ఇస్రో సెంచరీ

ఇస్రో ప్రధాన కార్యాలయం ఉన్నది బెంగళూరులో అయినా.. రాకెట్ ప్రయోగాలు ఎక్కువగా చేపట్టేది మాత్రం తిరుపతి జిల్లా శ్రీహరికోటలోనే. ఈ క్రమంలో ఇక్కడి సతీశ్ ధవన్ అంతరిక్ష కేంద్రం (షార్) అరుదైన రికార్డుకు చేరువైంది. ఈ జనవరిలో ఇస్రో జీఎస్ఎల్వీ ప్రయోగానికి సిద్ధమవుతోంది. ఇది శ్రీహరికోటలో చేపట్టే 100వ ప్రయోగంగా రికార్డులకెక్కనుంది. స్పేడెక్స్ మిషన్ కోసం డిసెంబరు 30న.. ఇస్రో చేపట్టిన పీఎస్ఎల్వీ-సీ60 రాకెట్ ప్రయోగం ఇక్కడ 99వది. జీఎస్ఎల్వీ ప్రయోగం ద్వారా నావిగేషన్ శాటిలైట్ ఎన్వీఎస్-02ను జనవరిలో ప్రయోగిస్తామని ఇస్రో ఛైర్మన్ సోమనాథ్ తెలిపారు.

లోకం తీరు



దక్షిణ కొరియా అధ్యక్షుడిపై అరెస్టు వారెంట్

సియోల్, డిసెంబరు 31: మార్షల్ లా విధింపు వివాదం నేపథ్యంలో ఇప్పటికే అభిశంసనను ఎదుర్కొంటున్న దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సుక్ యోల్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. యూన్‌ను అరెస్టు చేయడంతో పాటు ఆయన కార్యాలయం, నివాసాల్లో సోదాలు చేపట్టేందుకు స్థానిక కోర్టు వారెంట్లు జారీచేసింది. సియోల్ వెస్టర్న్ డిస్ట్రిక్ట్ కోర్టు ఈ వారెంట్లు ఇచ్చిందని అవినీతి దర్యాప్తు సంస్థ ఒక ప్రకటనలో వెల్లడించింది. దేశంలో మార్షల్ లా విధిస్తూ అధ్యక్షుడు యూన్ చేసిన ప్రకటన తిరుగుబాటు కిందకు వస్తుందా? లేదా? అనే దానిపై దర్యాప్తు చేస్తున్నామని తెలిపింది. అయితే యూన్‌ను అధికారికంగా అధ్యక్ష పదవి నుంచి తప్పించకుండా.. ఆయన్ను అరెస్టు చేసేందుకు లేదా సోదాలు చేపట్టేందుకు చాలా తక్కువ అవకాశాలు ఉన్నాయని నిపుణులు చెబుతున్నారు.

అమెరికా ట్రెజరీపై చైనా సైబర్ దాడి!

వాషింగ్టన్, డిసెంబరు 31: తమ ట్రెజరీ డిపార్ట్‌మెంట్‌పై చైనా సైబర్ దాడులకు పాల్పడినట్లు అమెరికా ఆరోపించింది. కీలకమైన పత్రాలను దొంగిలించేందుకు ప్రయత్నించారని తెలిపింది. ఈ మేరకు సెనేట్ బ్యాంకింగ్ కమిటీకి రాసిన లేఖలో ఈ విషయాన్ని వివరించినట్లు ఓ మీడియా సంస్థ పేర్కొంది. డిసెంబరు ప్రారంభంలో ఈ ఘటన జరిగిందని, థర్డ్ పార్టీ సైబర్ సెక్యూరిటీ హ్యాకర్లు.. 'బియాండ్ ట్రస్ట్' నెట్‌వర్క్ లోపాలను వాడుకుని కీలకమైన ఫైళ్లను యాక్సస్ చేసినట్లు ట్రెజరీ అధికార ప్రతినిధి తెలిపారు. సైబర్ దాడి కారణంగా జరిగిన నష్టంపై అంచనా వేసేందుకు సంబంధిత అధికారులతో కలిసి పనిచేస్తున్నట్లు వివరించారు. థర్డ్‌పార్టీ హ్యాకర్ల ద్వారా మొత్తం ట్రెజరీ వ్యవస్థలోని సమాచారం దోపిడీకి గురైనట్లు సమాచారం లేదన్నారు. అయితే, చైనా ఈ ఆరోపణలను నిరాధారమని కొట్టిపారేసింది.

మంచు విష్ణు అనుచరుల అడవి పందుల వేట?

- సోషల్ మీడియాలో వీడియో వైరల్
- పాత వీడియోగా తేల్చిన అధికారులు
- మనోజ్ పోస్టు పెట్టినట్లు ప్రచారం..!

పహాడీషరీఫ్/హైదరాబాద్ సిటీ, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): మంచు కుటుంబంలో అంతర్గత కటుంబ కలహాలు చల్లారక ముందే మరో వీడియో వైరల్‌గా మారింది. ముగ్గురు వ్యక్తులు అడవి పందిని వేటాడి తీసుకెళ్తున్న ఓ వీడియో మంగళవారం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. జల్‌పల్లి లోని మంచు కుటుంబం నివాసం సమీపంలోని గరిగుట్ట అడవిలో మంచు విష్ణు అనుచరులైన మేనేజర్ కిరణ్, ఎలక్ట్రీషన్ దేవేంద్ర ప్రసాద్‌తో పాటు మరో వ్యక్తి అడవి పందిని వేటాడి బంధించి భుజాలపై మంచు టౌన్ లోకి తీసుకెళ్తున్న దృశ్యాలు వైరల్ గా మారాయి. దీనిపై స్పందించిన పహాడిషరీఫ్ పోలీసులు, అటవీశాక సిబ్బంది రంగంలోకి దిగి.. ఇది పాత వీడియోగా తేల్చారు. జల్‌పల్లిలో మంచు టౌన్‌షిప్‌లో మంచు మోహన్‌బాబు ఫ్యామిలీ గత పదిహేను సంవత్సరాలుగా నివసిస్తున్నారు. కొన్నాళ్లుగా వారి కుటుంబంలో తగాదాలు జరుగుతున్న విషయం తెలిసిందే. వన్య ప్రాణులను వేటాడొద్దని మంచు మనోజ్ అభ్యంతరాలు వ్యక్తం చేసినప్పటికీ మేనేజర్ కిరణ్, ఎలక్ట్రీషన్ దేవేంద్ర ప్రసాద్‌లు ఏనాడూ పట్టించుకోలేదన్న సారాంశంతో కూడిన వీడియో, కథనం వైరల్ అవ్వడాన్ని చూస్తే ఇది కావాలనే మంచు మనోజ్ వైరల్ చేశాడన్న ప్రచారం జరుగుతోంది. వీడియోలో ఉన్న వ్యక్తులు ఇప్పటి వరకు ఎన్ని వన్యమృగాలను వేటాడారన్నది వెలుగులోకి రావాల్సి ఉంది.

కొత్త మెడికల్ కాలేజీలకు శాశ్వత సెలవు

- తెలంగాణలో ప్రభుత్వ, ప్రైవేటులోనూ నో చాన్స్
- రాష్ట్రంలో 34 ప్రభుత్వ, 28 ప్రైవేటు కళాశాలలు
- జనాభా ప్రాతిపదికన 35 కాలేజీలకే పరిమితం
- ఇప్పటికే అదనంగా 29 కళాశాలలు

హైదరాబాద్, డిసెంబరు31(ఆంధ్రజ్యోతి): భవిష్యత్‌లో తెలంగాణ రాష్ట్రంలో కొత్తగా ఒక్క వైద్య కళాశాల కూడా రాదు. కొత్త మెడికల్ కాలేజీల ఏర్పాటుకు కేంద్రం శాశ్వతంగా ఫుల్‌స్టాప్ పెట్టింది. ప్రతి పది లక్షల జనాభాకు 100 ఎంబీబీఎస్ సీట్లతో మాత్రమే నూతన వైద్య కళాశాల మంజూరు చేస్తామని జాతీయ వైద్య కమిషన్ గత ఏడాది ఆగస్టు 16న కొత్త మార్గదర్శకాలను విడుదల చేసింది. అందులో 2024-25 విద్యా సంవత్సరం నుంచి ప్రతి 10 లక్షల జనాభాకు మాత్రమే కొత్తగా మెడికల్ కాలేజీ కోసం దరఖాస్తు చేసుకోవాలని, అలాగే 150 మించి ఎంబీబీఎస్ సీట్ల సంఖ్యను పెంచుకోవడానికి వీలు లేదని స్పష్టం చేసింది. అయితే ఆ నిబంధనను ఈ ఒక్క ఏడాదికి మినహాయింపునిస్తున్నట్లు జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎమ్‌సీ) తాజాగా రాష్ట్ర ప్రభుత్వానికి సమాచారం ఇచ్చింది. అంటే 2025-26 విద్యా సంవత్సరానికి మాత్రమే కొత్త కాలేజీ ఏర్పాటుకు దరఖాస్తు చేసుకునే వెసులుబాటు ఉంటుంది. ఆ తర్వాత అటు ప్రభుత్వ ప్రైవేటు ఆధ్వర్యంలోనూ కొత్తగా మెడికల్ కాలేజీ ఏర్పాటు చేసుకునే అవకాశం ఇక ఉండదు. రాబోయే విద్యా సంవత్సరానికి నూతన వైద్య కళాశాలల ఏర్పాటుకు ఇప్పటికే ఎన్ఎమ్‌సీ దరఖాస్తులు ఆహ్వానించింది. అందుకు తుది గడువు జనవరి 4వ తేదీగా తొలుత ప్రకటించింది. ఆ తర్వాత దాన్ని జనవరి 19 నాటికి పొడగించింది. దీంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లో కొత్త మెడికల్ కాలేజీ ఏర్పాటుకు మార్గం సుగమమైంది. కొడంగల్‌లో ఏర్పాటుకాబోయే కొత్త మెడికల్ కాలేజీ జనవరి రెండోవారంలోగా దరఖాస్తు చేయనున్నట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ వర్గాలు తెలిపాయి.

ఇప్పటికే ఎక్కువగా మెడికల్ కాలేజీలు

రాష్ట్రంలో ఇప్పటికే 33 జిల్లాల్లో 34 మెడికల్ కాలేజీలు వచ్చాయి. హస్తం పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత బీఆర్ఎస్ హయంలో దరఖాస్తు చేసిన 8 కళాశాలలకు కేంద్రం నుంచి అనుమతులు సాధించింది. నిజానికి తెలంగాణలో జనాభా కంటే ఎక్కువగానే మెడికల్ కాలేజీలున్నాయి. ఉదాహరణకు తెలంగాణలో 3.5 కోట్ల జనాభా ఉంటే 62 ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కాలేజీలున్నాయి. మొత్తం 8515 ఎంబీబీఎస్ సీట్లున్నాయి. ఎన్ఎంసీ తాజా నిబంధన మేరకు కేవలం 3500ఎంబీబీఎస్ సీట్లు మాత్రమే ఉండాలి. అంతకు మించి ఉంటే కొత్త కాలేజీలకు అనుమతి ఇవ్వబోమని ఎన్ఎమ్‌సీ నిబంధన చెబుతోంది. తెలంగాణలో ఇబ్బడిముబ్బడిగా వైద్య కళాశాలలు రావడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. మెడికల్ కాలేజీల సంఖ్య పెరగడం వల్ల రాష్ట్ర విద్యార్థులు ఎంబీబీఎస్ చేసే అవకాశం పెరిగిందని వారంటున్నారు. అయితే తగిన మౌలిక సదుపాయాలు కల్పించకుండా పుట్టగొడుగుల్లా మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేయడం వల్ల నష్టమే ఎక్కువగా ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



జనాభాకు మించి ఎక్కువగానే మనదగ్గర కాలేజీలున్నాయి

ఇప్పటికే మనదగ్గర జనాభాకు మించి మెడికల్ కాలేజీలున్నాయి. వాస్తవానికి కళాశాల భవనాలు, అనుబంధ ఆస్పత్రులు నిర్మించిన తర్వాతనే నూతన మెడికల్ కాలేజీల కోసం దరఖాస్తు చేయాలి. కానీ గత ప్రభుత్వం ఏమీ లేకుండానే మెడికల్ కాలేజీల జీవోలు ఇచ్చింది. తెలంగాణలో కొత్తగా ఏర్పాటైన 25 మెడికల్ కాలేజీల అనుబంధ ఆస్పత్రులకు ఇంతవరకు శంకుస్థాపన చేయలేదు. మెజార్టీ ఏరియా ఆస్పత్రులు, జిల్లా వైద్యశాలల్లో బోధనాస్పత్రులు నడుస్తున్నాయి.

- డాక్టర్ నరహరి, తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం అధ్యక్షుడు.

కారుణ్యం అంటే ఎందుకంత కాఠిన్యం?


పట్టాలు పుచ్చుకున్న చేతుల్లో చీపుర్లు పెట్టారు

- సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు నిర్వాకం

హైదరాబాద్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): వారంతా కారుణ్య నియామకాల ద్వారా ఉపాధి పొందారు. ఒకరు వైద్య పట్టా అందుకున్న వారైతే మరొకరు సీఏ.. ఇంకొందరు ఎంబీఏ, బీటెక్, బీఎడ్ ఇలా రకరకాల కోర్సులు చదివి పట్టాలందుకున్న వారున్నారు. వారి తల్లిదండ్రులు కంటోన్మెంట్ బోర్డులో పని చేస్తూ మృతి చెందగా వారి స్థానంలో కారుణ్య నియామకాల్లో భాగంగా ఎంపికైన వారికి వారి వారి అర్హతలకు తగిన ఉద్యోగాలు ఇవ్వకపోయినా, నిబంధనల ప్రకారం గ్రూప్-సీ కేటగిరీలో ఉండే క్లరికల్ విభాగంలో పనిచేసే అవకాశం కల్పించాలనే నిబంధనలున్నాయి. జూనియర్ సహాయకులుగా, రికార్డు అసిస్టెంట్లుగా, బిల్ కలెక్టర్లుగా అవకాశం ఇవ్వొచ్చుననే నిబంధన ఉందని అధికారులు చెబుతున్నారు. కంటోన్మెంట్ బోర్డు పెద్దలు మాత్రం ఇటీవల నియామకాలు అందించిన 22 మంది చేత చీపుర్లు పట్టించారు. వారిలో ఉన్నత విద్య చదువుకున్న ఐదుగురితోనూ చీపుర్లు పట్టించి వీధుల్లో పనిచేయించడం, ఇందులో ఒక వైద్యవిద్య చదివినవారు కూడా ఉండటం చర్చనీయాంశమైంది. కంటోన్మెంట్ బోర్డు పరిధిలో గత 15 ఏళ్లగా కారుణ్య నియామకాలు చేపట్టడం లేదు. ఈ విభాగంలో ఉపాధి కల్పించాలని కోరుతూ బోర్డుకు 121 దరఖాస్తులొచ్చాయి. నిబంధనల ప్రకారం ఉన్న ఖాళీల్లో ఏటా 5 శాతం ఖాళీలను కారుణ్య నియామకాల ద్వారా చేపట్టాలని ఉంది. దీన్ని ప్రాతిపదికగా తీసుకుని 121 దరఖాస్తులొచ్చినా కేవలం 22 మందికే అవకాశమిచ్చారు. ఇటీవల బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ కూడా లోక్‌సభలో ఇదే అంశాన్ని లేవనెత్తారు. 458 ఖాళీలున్నా కారుణ్య నియామకాలు చేపట్టడం లేదని అభ్యంతరం వ్యక్తం చేశారు.

గ్రూప్-డీ కిందనే ఇవ్వాలని లేదు

స్వీపర్లుగా పని చేస్తూ చనిపోయిన వారంతా గ్రూప్-డి కేటగిరీలో పని చేసిన వారే.. అయితే వారి వారసులుగా కారుణ్య నియామకాలు పొందిన వారు ఉన్నత చదువు చదువుకుని ఉంటే వారికి గ్రూప్-డికి బదులు గ్రూప్-సి కేటగిరీలో ఉపాధి చూపాలనే నిబంధనలున్నాయి. ఇటీవల జరిగిన బోర్డు సమావేశంలో ఇదే విషయంపై చర్చించిన బోర్డు.. ఖాళీలు ఉంటే గ్రూప్-సి కేటగిరీలో ఉపాధి కల్పించాలని మినిట్స్‌లో నమోదు చేసింది. మరి 458 ఖాళీలు ఉన్నప్పటికీ నిబంధనలు కాదని ఉన్నత చదువులు చదువుకున్న వారిని స్వీపర్లుగా పని చేయించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదే విషయంపై సీపీఎం నాయకుడు శ్రీనివాస్, బోర్డు సీఈవో మధుకర్ నాయక్‌ను ప్రశ్నించారు. గ్రూప్-సి కింద అవకాశం ఉన్నా ఉన్నత విద్య చదువుకున్న వారికి ఎందుకు అవకాశం కల్పించలేదని నిలదీశారు.



కొత్త సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న హైకోర్టు సీజే జస్టిస్ అలోక్ అరాధే, హైకోర్టు బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు

తెలిసినవారే 'తోడేళ్లు'



రాష్ట్రంలో 2,945 అత్యాచార ఘటనలు.. ఐదేళ్లలో అత్యధికం

- 2,912 కేసుల ఛేదన.. బాధితులకు నిందితులు పరిచయస్థులే
- 15-18 ఏళ్లలోపు వయసు బాలికలపై 1,970 అఘాయిత్యాలు

హైదరాబాద్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): చుట్టుపక్కల వారో.. దూరపు చుట్టాలో..! తెలిసినవారే తోడేళ్లుగా మారుతున్నారు..! పరిచయస్తులే కదా? అని నమ్మితే అఘాయిత్యాలకు ఒడిగడుతున్నారు..! బాలికలు, యువతులు, మహిళలపై అత్యాచారాలకు పాల్పడుతున్నారు. రాష్ట్రంలో 2024లో నమోదైన కేసులను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టం అవుతోంది. ఏడాదిలో 2,945 దారుణాలు జరగ్గా 2,912 ఉదంతాల్లో నిందితులు బాధితులకు తెలిసినవారే కావడం గమనార్హం. మరో ఆందోళనకర అంశం ఏమంటే.. మొత్తం అత్యాచార ఘటనల్లో 15-18 ఏళ్లలోపు వారు అధికంగా ఉండడం. వీరిపై జరిగిన దారుణాల సంఖ్య 1,970. ఇక బాధితుల్లో 15 ఏళ్లలోపు బాలికలు 87 మంది, 18 ఏళ్లు దాటిన మహిళలు 888 మంది ఉన్నారు. కీలక విషయం ఏమంటే.. 2,945 కేసుల్లో 33 కేసుల్లో మాత్రమే నిందితులు ఎవరో తేలలేదు. అంటే.. 2,912 ఘటనల్లో నిందితులను పట్టుకున్నారు. 2020 నుంచి చూస్తే రాష్ట్రంలో 11,838 అత్యాచార కేసులు నమోదయ్యాయి. వీటిలో 2024లోనే అత్యధికంగా 2,945 దారుణాలు జరిగాయి. 2020లో 1,934, 2021లో 2,382, 2022లో 2,293, 2023 సంవత్సరంలో 2,284 ఉదంతాలు చోటుచేసుకున్నాయి. మరోవైపు రాష్ట్రంలో అహపరణ కేసుల సంఖ్య ఏటా పెరుగుతూనే ఉంది. వీటిల్లో 18 ఏళ్లలోపు పిల్లలే ఎక్కువగా ఉండడం ఆందోళనకర పరిణామం. 2024లో 1,525 కిడ్నాప్ కేసులు నమోదవగా మహిళలు, చిన్నారులే 1,122 మంది ఉన్నారు. వీరిలోనూ మైనర్లు 1,251 మంది (82 శాతం) ఉన్నట్లు పోలీసు గణాంకాలు చెబుతున్నాయి. ఇలాంటి సందర్భాల్లో అందే ఫిర్యాదులను పోలీసులు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. దీంతో 90 శాతం పైగా కేసులు పరిష్కారం అవుతున్నాయి.

టీనేజీ ప్రేమలే కారణం..!

టీనేజీ ప్రేమలు అత్యాచార ఘటనలకు ఒక కారణమవుతున్నాయని తెలంగాణ మహిళా భద్రతా విభాగం డీజీపీ శిఖా గోయల్ తెలిపారు. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే బాలికలు, యువతులను లక్ష్యంగా చేసుకుంటున్నారని చెప్పారు. ఈ కేసులను అత్యంత ప్రాధాన్యంగా తీసుకోవడంతో నేరం జరిగిన కొద్ది గంటల్లోనే నిందితులను అరెస్టు చేస్తున్నామని పేర్కొన్నారు. ఫిర్యాదు అందిన 8 గంటల్లోపు అరెస్టు చేసిన ఘటనలు 940 ఉన్నట్లు వివరించారు. మైనర్లపై నేరం జరిగినపుడు నిందితులపై పోక్సో కేసులు నమోదు చేసి, నిందితులను త్వరగా అరెస్టు చేసి శిక్ష పడేలా చూస్తున్నామన్నారు. పోక్సో కేసుల్లో బాధితులకు ప్రభుత్వం తరఫున పరిహారంగా రూ.5.42 కోట్లు చెల్లించామన్నారు. అపహరణ కేసుల్లోనూ చాలావరకు టీనేజీ ప్రేమ కథలే ఉంటున్నాయని అధికారులు తెలిపారు.

రైళ్ల వేళల్లో మార్పులు

అమల్లోకి కొత్త రైల్వే టైమ్ టేబుల్.. ఎంఎంటీఎస్ వేళలూ మారుతున్నాయి

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): కొత్త రైల్వే టైమ్ టేబుల్ బుధవారం నుంచి అమలులోకి వచ్చింది. దీని ప్రకారం దక్షిణ మధ్య రైల్వేతో పాటు దేశవ్యాప్తంగా పలు రైళ్ల వేళలు మారాయి. ఈ వివరాల కోసం ఐఆర్‌సీటీసీ, ఎన్‌టీఈఎస్ వెబ్‌సైట్లను సందర్శించాలని రైల్వే అధికారులు సూచించారు. ప్రయాణికులు ముందుగా తాము ఎక్కవలసిన రైలు వేళలు మారాయో లేదో ఒకసారి తనిఖీ చేసుకోవాలన్నారు. విజయవాడ నుంచి విశాఖపట్నం వెళ్లే రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ ఇక నుంచి 15 నిమిషాలు ముందుగా ఉదయం 6 గంటలకే బయలుదేరుతుంది. రైల్వే సర్వీసులను మరింత మెరుగుపరిచేందుకు, ప్రయాణికులకు ఉత్తమ సేవలు అందించేందుకు ఈ మార్పులు చేసినట్లు పేర్కొన్నారు. జంట నగరాల్లో తిరిగే ఎంఎంటీఎస్ సర్వీసుల వేళల్లోనూ మార్పులు చోటుచేసుకున్నాయి. సర్వీసులను విస్తరించడ ం వల్ల, వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌ల రాకపోకలకు అనుగుణంగా, ప్రయాణికుల డిమాండ్లను దృష్టిలో ఉంచుకుని ఈ మార్పులు చేసినట్లు వివరించారు. తమ డిమాండ్లను దక్షిణ మధ్య రైల్వే దృష్టిలో ఉంచుకుని ఎంఎంటీఎస్ సర్వీసుల వేళల్లో మార్పులు చేయడంపై ప్రయాణికుల సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

హైదరాబాద్‌లోని వివిధ స్టేషన్ల నుంచి వేళలు మారిన ప్రధాన రైళ్ల వివరాలు

● కాచిగూడ స్టేషన్ మీదుగా వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైళ్లు.. యశ్వంత్‌పూర్-కోయంబత్తూర్, యశ్వంత్‌పూర్-కోర్బా, నిజాముద్దీన్-కోయంబత్తూర్, యశ్వంత్‌పూర్ -నిజాముద్దీన్, తిరుపతి-నిజాముద్దీన్, తిరుపతి-సికింద్రాబాద్, అమరావతి-తిరుపతి, తిరుపతి-అమరావతి, మహబూబ్‌నగర్- విశాఖపట్నం, మైసూర్-జైపూర్, జైపూర్-మైసూర్, చెన్నై-నాగర్‌సోల్, యశ్వంత్‌పూర్-గోరఖ్‌పూర్, రామేశ్వరం-ఓకా, నర్సపూర్-నాగర్‌సోల్, యశ్వంతపూర్-అంబేడ్కర్ నగర్, కర్నూల్-జైపూర్, యశ్వంతపూర్-కాచిగూడ, కాచిగూడ-యశ్వంతపూర్, యశ్వంతపూర్-లక్నో. ●సికింద్రాబాద్ స్టేషన్.. వాస్కోడగామా-హైదరాబాద్, హైదరాబాద్-వాస్కోడగామా, పూణె-సికింద్రాబాద్. ●నాంపల్లి స్టేషన్... హైదరాబాద్-ముంబై, ముంబై- హైదరాబాద్, విజయపుర-హైదరాబాద్, హుబ్లీ-హైదరాబాద్, ●లింగంపల్లి స్టేషన్... కాకినాడ-లింగంపల్లి, తిరుపతి-లింగంపల్లి.

సినిమా సిటీకి 2వేల ఎకరాలు ఇవ్వండి

(మొదటి పేజీ తరువాయి)

టికెట్ విధానాన్ని దశల వారీగా అమలుచేయాలని, వీటిలో జిల్లా కేంద్రాలు, మునిసిపాలిటీ పరిధిల్లో మొదటి విడత కింద, గ్రామపంచాయతీల్లో రెండో విడత కింద అమలు చేయాలని సూచించింది. అదే విధంగా డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్స్ విషయంలోనూ ఒక నిర్ణయం తీసుకోవాలని కోరింది. ఈ ప్లాట్‌ఫాంలో ఉన్న పలు కంపెనీలు సినిమాలను ప్రదర్శించేందుకు అధిక చార్జీలను వసూలు చేస్తున్నాయని, వాటిని తగ్గించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అంతేకాకుండా ప్రభుత్వ పరిధిలోనే ఒక డిజిటల్ సర్వీస్ ప్రొవైడర్ విధానాన్ని తీసుకొస్తే బాగుంటుందని సూచించింది. ఆన్‌లైన్ టికెటింగ్ విధానంతో పాటు, ఈ సర్వీస్ ప్రొవైడర్‌లను ప్రభుత్వం తన పరిధిలోకి తీసుకొస్తే నిర్మాతలకు భారీ ఉపశమనం కలుగుతుందని వివరించారు. ఇక జాయింట్ వెంచర్ డిజిటల్ సినిమా టెక్నాలజీ విధానాన్ని అందుబాటులోకి తీసుకు రావడానికి కూడా ప్రభుత్వం అనుమతినివ్వాలని కోరారు.

లొకేషన్ చార్జీలను తగ్గించండి

సినిమా షూటింగ్‌లకు అవసరమైన అనుమతులను సింగిల్ విండో విధానంలో ఇవ్వాలని పరిశ్రమ ప్రభుత్వాన్ని కోరింది. అటవీ శాఖ పరిధిలోని ఏదైనా ప్రాంతాల్లో షూటింగ్ చేసేందుకు రోజుకు రూ.50వేలు తీసుకుంటున్నారని, ఇది చాలా భారంగా ఉందని, ప్రభుత్వం దృష్టి సారించి ఈ ధరలను తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. అదే విధంగా ప్రభుత్వ కార్యాలయాలు, గ్రేటర్ హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్, రోడ్లు, పార్కులు, బ్రిడ్జిలు, బస్‌స్టేషన్లు, ఎంఎంటీఎస్ సహా వివిధ ప్రభుత్వ స్థలాల్లో షూటింగ్‌కు అనుమతినివ్వాలని కోరారు. పర్యాటక ప్రాంతాల్లో షూటింగ్‌లకు ఉచితంగా అవకాశం కల్పించాలని, దాంతో రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ఇది దోహదపడుతుందన్నారు. ఇక పోలీస్ శాఖ, జీహెచ్ఎంసీ అనుమతులను ఒకేసారి సింగిల్‌విండో కింద ఇవ్వాలని కోరారు.

చిన్న సినిమాలకు రాయితీ ఇవ్వాలి

రాష్ట్ర ప్రభుత్వం చిన్న సినిమాలను ఇన్సెంటివ్‌లు, రాయితీలను అందించాలని కూడా పరిశ్రమ కోరింది. దీనివలన ఎంతోమంది కొత్త వారికి అవకాశం లభిస్తుందన్నారు. ఇక దాదాపు 41 తక్కువ బడ్జెట్ సినిమాలతో పాటు, 7పిల్లల చిత్రాలు ప్రభుత్వ రాయితీ కోసం ఎదురుచూస్తున్నాయని, వీటన్నింటికీ కలిపి రూ.4 కోట్ల వరకు రాయితీ ఇవ్వాల్సి ఉందని, వీలైనంత త్వరితగతిన రాయితీని అందించాలని కోరారు. వీటితో పాటు బీ-ఫామ్ లైసెన్స్‌ల విషయంలో ఫైర్ డిపార్ట్‌మెంట్, పోలీసు శాఖ, ఆర్ అండ్ బీ శాఖలు సహకరించాలని, లైసెన్స్‌ల రెన్యువల్స్ విషయంలో కొంత సడలింపులు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అదే విధంగా ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన గదర్ (గద్దర్) అవార్డుల అమలుకు కూడా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎఫ్‌డీసీ త్వరలోనే ప్రభుత్వానికి ఈ విజ్ఞప్తి లేఖను అందించనుంది.

ప్రతి రైతుకూ ‘భరోసా’

(మొదటి పేజీ తరువాయి)

రైతుల సంఖ్యను తగ్గిస్తున్నట్లు ఎలా చెబుతారన్నారు. మంత్రివర్గ ఉపసంఘంలో రైతుభరోసా విధివిధానాలపై చర్చ మాత్రమే చేశామన్నారు. సాగు చేసే ప్రతి ఒక్క రైతుకు ఆర్థిక వెసులుబాటు కలిగించాలనేదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రైతుభరోసాకు సంబంధించి రైతులకు మేలు చేసే సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. పథకం విధివిధానాలు ఉపసంఘం చర్చల స్థాయిలోనే ఉన్న కారణంగా తాను ఇంతకు మించి ఏమీ మాట్లాడలేనన్నారు. అలాగే, రాష్ట్రంలోని ప్రతి ఉమ్మడి జిల్లాలో కనీసం ఒక పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మించాలనేది ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. రాబోయే మూడు నాలుగేళ్లలో వీటిని నిర్మించాలని ప్రయత్నాలు చేస్తున్నామని మంత్రి తుమ్మల తెలిపారు.

యాసంగిలో సుమారు 70 లక్షల ఎకరాల్లో పంటల సాగు

పంటలు సాగుచేసే భూములకే రైతు భరోసా ఇవ్వాలని ఇప్పటికే ప్రభుత్వం ప్రాథమిక నిర్ణయానికి వచ్చిన నేపథ్యంలో నిధుల సర్దుబాటుపై చర్చ జరుగుతోంది. సంక్రాంతి తర్వాత రైతుభరోసా చెల్లింపులు ప్రారంభిస్తామని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించింది. ఎన్నికల హామీ మేరకు ఎకరానికి రూ.7,500 చొప్పున పంపిణీ చేయాల్సి ఉంది. ఈ యాసంగిలో సుమారు 70 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతాయనే అంచనాలున్నాయి. రైతుభరోసా ఇవ్వాలంటే.. రూ.5,250 కోట్ల నిధులు సర్దుబాటు చేయాల్సి ఉంటుంది. ధరణి రికార్డుల ప్రకారం రాష్ట్రంలో కోటిన్నర ఎకరాల భూమి వ్యవసాయ భూముల జాబితాలో ఉన్న విషయం విదితమే! గత ప్రభుత్వం ప్రతి సీజన్‌లో కోటిన్నర ఎకరాలకు రైతుబంధు పంపిణీ చేసింది. ఎకరానికి రూ.5 వేల చొప్పున గత ప్రభుత్వం చెల్లించగా.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎకరానికి రూ.7,500 చొప్పున చెల్లిస్తామని హామీ ఇచ్చింది. పంటలు సాగుచేయని భూములకు కూడా గత ప్రభుత్వం రూ. 21,284 కోట్లు చెల్లించిందని అసెంబ్లీలో ప్రభుత్వం ప్రకటన చేసిన విషయం తెలిసిందే. ఈనెల రెండో తేదీన నిర్వహించే మంత్రివర్గ ఉప సంఘం భేటీలో మరోసారి చర్చించిన తర్వాత..4న నిర్వహించే రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో తుది నిర్ణయం తీసుకునే అవకాశాలు ఉన్నాయి.

ఉపాధ్యాయులు, అధ్యాపకుల సమస్యలు జటిలమైనవి కావు

» ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి

కవాడిగూడ, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల, అధ్యాపకుల సమస్యలు జటిలమైనవి ఏమీ కావని, వాటి పరిష్కారానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టీఎస్‌యూటీఎఫ్) కార్యాలయంలో ఫెడరేషన్ నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్సీ నర్సిరెడ్డి మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల పెండింగ్‌ల డీఏలు, ఒకటో తేదీన జీతాలు, ఓపీఎస్ లాంటి సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. అలాగే పాఠశాలల పర్యవేక్షణ వ్యవస్థను పటిష్ఠం చేయాలని, ప్రాథమిక పాఠశాలల బలోపేతం కోసం చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్నట్లు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యా రంగాన్ని బలోపేతం చేయడం కోసం బడ్జెట్‌లో 15శాతం కేటాయించాలని, పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక తరగతులు ప్రారంభించాలని ప్రభుత్వాన్ని కోరుతూ టీఎస్‌యూటీఎఫ్ తీర్మానం చేసింది.

కేబీఆర్ ప్రాజెక్టుల టెండర్ తాత్కాలిక రద్దు!

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని కేబీఆర్ పార్కు చుట్టూ వంతెనలు, అండర్‌పాస్‌ల నిర్మాణంపై తాత్కాలిక సందిగ్ధత నెలకొంది. బిడ్‌లు ఆహ్వానిస్తూ తాజాగా ప్రకటించిన టెండర్‌ను రద్దు చేయాలని జీహెచ్ఎంసీ నిర్ణయించింది. ఉన్నతస్థాయి ఆదేశాల నేపథ్యంలో టెండర్‌ను రద్దు చేస్తున్నట్టు పేర్కొంటూ నోటిఫికేషన్ జారీ చేశారు. హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ ట్రాన్స్‌ఫర్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (హెచ్-సిటీ)లో భాగంగా పార్కు చుట్టూ ఆరు జంక్షన్లలో రూ.1090 కోట్లతో వంతెనలు, అండర్ పాస్‌లు నిర్మించాలని నిర్ణయించారు. ప్రభుత్వం పాలనాపరమైన అనుమతులు జారీ చేసిన నేపథ్యంలో రెండు ప్యాకేజీలుగా బిడ్‌లు ఆహ్వానిస్తూ జీహెచ్ఎంసీ టెండర్ ప్రకటించింది. 14 పని దినాలను గడువుగా పేర్కొన్నారు. ప్రాజెక్టులో స్వల్ప మార్పుల దృష్ట్యా.. టెండర్ నోటిఫికేషన్‌ను తాత్కాలికంగా నిలిపివేసినట్టు తెలిసింది. ఉన్నత స్థాయిలో మరోసారి చర్చించిన అనంతరం తదుపరి టెండర్ ప్రకటనపై స్పష్టత వస్తుందని ఇంజనీరింగ్ విభాగం ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

కుంటల్లో షెడ్లు కూల్చేసిన హైడ్రా

ఖాజాగూడలో రోడ్డున పడ్డ కూలీలు.. నోటీసులు ఇచ్చాం: రంగనాథ్

» మాకు తెలియదు: కూలీలు

» హైడ్రా ఠాణాకు సీఎం పచ్చజెండా

హైదరాబాద్ సిటీ/రాయదుర్గం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని నానక్‌రామ్‌గూడ-ఖాజాగూడ రహదారికి ఇరువైపులా ఉన్న భగీరథమ్మ కుంట, తౌటోనికుంట బఫర్‌జోన్‌లలో వేసిన రేకుల షెడ్లను హైడ్రా కూల్చివేసింది. దీంతో.. వాటిల్లో నివాసముంటున్న కూలీలు రోడ్డునపడ్డారు. ఈ చర్యపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. భగీరథమ్మ, తౌటోనికుంటల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలో రేకుల షెడ్లను వేసిన కొందరు వ్యక్తులు.. వాటిని కూలీలకు అద్దెకిచ్చారు. ఈ వ్యవహారంపై ఫిర్యాదులు రావడంతో హైడ్రా మంగళవారం ఉదయం రంగంలోకి దిగింది. 10 ఆక్రమణలను తొలగించింది. ఆ షెడ్లలో ఉంటున్న కూలీలకు తమ సామగ్రిని తీసుకోవడానికి మాత్రమే సమయం ఇవ్వడంతో.. వంటావార్పులేక.. వారు రోడ్డుపక్కనే పడిగాపులుకాయడం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. కూలీల పిల్లలు "ఆకలి" అంటూ దీనంగా కూర్చున్న వీడియోలు.. ఇంటి సామగ్రి కుప్పలుగా రోడ్డుపక్కన పడి ఉన్న ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టాయి. షెడ్ల యజమానులు వాటిని స్వచ్ఛందంగా తొలగించాలని ముందుగానే నోటీసులు ఇచ్చామని, చెరువుల ఆక్రమణల విషయంలో ఉపేక్షించేది లేదని హైడ్రా చీఫ్ రంగనాథ్ ఈ సందర్భంగా స్పష్టంచేశారు. అయితే.. తమకు ఎలాంటి నోటీసులు అందలేదని కూలీల కుటుంబాలు చెబుతున్నాయి. ఇటీవల హైడ్రా కమిషనర్ మాట్లాడుతూ.. ఆక్రమణల విషయంలో యజమానులతోపాటు.. అద్దెకు ఉంటున్నవారికి కూడా సమాచారం ఇస్తామని పేర్కొన్నారు. ఖాజాగూడ కూల్చివేతల విషయంలో ఆ విషయాన్ని విస్మరించారనే విమర్శలు వినిపిస్తున్నాయి. "కబ్జాల్లో ఇదో ప్రణాళిక. తొలుత షెడ్లు వేస్తారు. కూలీలకు





రోడ్డున పడ్డ కూలీల కుటుంబాలు, కుప్పలుగా కూలీల సామగ్రి

అద్దెకిస్తారు. కూల్చివేతలకు వెళ్తే.. ‘మానవత్వం’ పేరుతో అడ్డుకునే ప్రయత్నాలు చేస్తారు. చెరువుల ఆక్రమణల విషయంలో ఇలాంటి వాటిని ఉపేక్షించేది లేదు. కఠినంగా వ్యవహరిస్తాం" అని రంగనాథ్ వ్యాఖ్యానించారు.

హైడ్రా పోలీస్‌స్టేషన్‌కు సీఎం గ్రీన్ సిగ్నల్..!

హైడ్రా ప్రత్యేక పోలీస్‌స్టేషన్ ఏర్పాటుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పచ్చజెండా ఊపారు. ఈ మేరకు మంగళవారం ఆయన సంబంధిత ఫైల్‌పై సంతకం కూడా చేసినట్లు సమాచారం. దీంతో ఒక ట్రెండ్రోజుల్లో హైడ్రా ఠాణాకు సంబంధించి ఉత్తర్వులు జారీ అయ్యే అవకాశాలున్నాయి. హైడ్రా పోలీస్‌స్టేషన్ ఏర్పాటైతే.. ఈ విభాగం పోలీసులకు ఇక నుంచి ఎఫ్ఐఆర్ నమోదు చేసే వెసులుబాటు కలుగుతుంది.

హైడ్రా కమిషనర్‌ను పిలవాలా: హైకోర్టు

» ఆధారాల్లేకుండా కూల్చివేతలపై ఆగ్రహం

హైదరాబాద్, డిసెంబరు31 (ఆంధ్రజ్యోతి): ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ కుంటల పరిధిలో కూల్చివేతలపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. చట్టబద్ధంగా ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లను గుర్తించకుండా.. ఆధారాల్లేకుండా కూల్చివేతలను ఎలా జరుపుతారని హైడ్రా, నీటిపారుదల శాఖను నిలదీసింది. "హైడ్రా కమిషనర్ తీరు బాగోలేదు. మరోమారు ప్రత్యక్షంగా హాజరు కావాలని ఆదేశించమంటారా?" అంటూ అసహనం వ్యక్తం చేసింది. మంగళవారం నాటి కూల్చివేతలపై పలువురు హైకోర్టును ఆశ్రయించగా.. జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం విచారణ చేపట్టింది. హద్దులను గుర్తించకుండా చేపట్టిన కూల్చివేతలను ధర్మాసనం తప్పుబట్టింది. "హైడ్రా కమిషనర్ ప్రవర్తన సరిగా లేదు. మరోమారు పిలిచిలా మమ్మల్ని రెచ్చగొట్టరాదు" అని వ్యాఖ్యానించింది. 24 గంటల నోటీసులు ఇవ్వడాన్నీ తప్పుబట్టింది. "24 గంటల్లో ఎలా ఖాళీ చేస్తారు? కూల్చివేతలను ఆపాలని ప్రభుత్వ న్యాయవాదులు ఇప్పుడే హైడ్రా అధికారులకు సమాచారమివ్వాలి. లేకుంటే హైడ్రా కమిషనర్‌పై చర్యలు తీసుకుంటాం" అని హెచ్చరించింది. ప్రభుత్వ, జీహెచ్ఎంసీ న్యాయవాదులు సమాధానమిస్తూ.. అనుమతుల్లేని నిర్మాణాలను కూల్చివేస్తున్నట్లు వివరించారు. దీనికి ధర్మాసనం స్పందిస్తూ.. పిటిషనర్లకు వాదనలను వినిపించే అవకాశం, సమయమిచ్చి, చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.

శ్రీశైలం విద్యుత్ కేంద్రంలో నీటి లీకేజీ

» ఎడమ గట్టు డ్రాఫ్ట్ ట్యూబ్ వద్ద నీటి ధారలు

» వదిలేస్తే కేంద్రానికే ప్రమాదం : నిపుణులు

దోమలపెంట, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఎడమ గట్టు భూగర్భ జలవిద్యుత్ కేంద్రంలో వారం రోజులుగా నీరు లీకవుతోంది. 1వ యూనిట్ డ్రాఫ్ట్ ట్యూబ్ జీరో ఫ్లోర్ నుంచి ఈ లీకేజీ జరుగుతున్నట్లు గుర్తించారు. 2024 సెప్టెంబరు 18న మొదటి సారి సన్నటి నీటి చుక్కలుగా లీకేజీ ప్రారంభం కాగా, నెల రోజుల నుంచి నిరంతరాయంగా విద్యుత్ ఉత్పాదనతో పాటు, పంపు మోడ్ పద్ధతిలో శ్రీశైలం డ్యాంలోకి నీటి మళ్లింపు కొనసాగుతోంది. పంపు మోడ్‌లో టర్బైన్ వేగంగా తిరుగుతుండటంతో డ్రాఫ్ట్ ట్యూబ్ జీరో ఫ్లోర్ స్లాబ్ నుంచి డిసెంబరు 25న పంపు మోడ్ జరిగే సమయంలో నీటి చుక్కలు ధారలా పడుతుండటంతో జెన్‌కో అధికారులు అక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. అయితే, సర్జి చాంబర్, పెన్‌స్టాక్ గేట్లను మూసివేసి, టర్బైన్‌లో నిలువ నీటిని పూర్తిగా తొలగిస్తే తప్ప లీకేజీ అవుతున్న ప్రాంతాన్ని గుర్తించే పరిస్థితి లేదు. ఎడమ గట్టు విద్యుత్ కేంద్రాన్ని 24 ఏళ్ల క్రితం నిర్మించారు. లీకేజీ నీటి ధారలను అరికట్టకపోతే జీరో ఫ్లోర్ స్లాబ్ కూడా పడిపోయే ప్రమాదం ఉందని కొందరు ఇంజనీర్లు, మాజీ ఉద్యోగులు చెబుతున్నారు. మరోవైపు, నీరు లీకవుతున్న ప్రాంతాన్ని హైదరాబాద్ విద్యుత్ సౌధ నుంచి జర్నల్ హైడెల్ సీఈ నారాయణ మంగళవారం పరిశీలించారు. తక్షణమే పూర్తి వివరాలతో నివేదిక రూపొందించాలని స్థానిక ఇంజనీర్లను ఆదేశించినట్టు సమాచారం. కాగా, ఒకటో యూనిట్ డ్రాఫ్ట్ ట్యూబ్ దగ్గర లీకేజీ అవుతున్న నీటి ధారలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నామని జెన్‌కో సివిల్ ఎస్ఈ రవీంద్ర కుమార్ తెలిపారు. అనుభవం ఉన్న నిపుణులతో చర్చించి ఈ సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు.

కొత్త ఏడాదిలో సన్నబియ్యంతో అన్నం

» పాఠశాల, వసతి గృహ విద్యార్థులకు అందిస్తాం

» మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

» గురుకుల పాఠశాల సందర్శన

» విద్యార్థులతో కలిసి భోజనం



గురుకుల విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

హైదరాబాద్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ విద్యా వ్యవస్థను మార్చడంలో సమీకృత గురుకులాలు కీలక పాత్రను పోషిస్తున్నాయని, నూతన సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో సన్న బియ్యంతో భోజనం అందించనున్నామని నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటించారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా మంగళవారం రాత్రి ఆయన హుజూర్‌నగర్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా వారితో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ కుటుంబాలకు దూరంగా ఉంటూ... చదువుకుంటున్న విద్యార్థులకు ఆనందాన్ని పంచేలా ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల సంక్షేమం కోసం పలు నిర్ణయాలు తీసుకున్నామని, డైట్ చార్జీలను 40 శాతం మేర, కాస్మటిక్ ఛార్జీలను 200 శాతానికి పైగా పెంచామని ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా 8 లక్షల మంది విద్యార్థులకు పోషకాలతో కూడిన భోజనం అందించడానికి వీలుగా కామన్ డైట్‌ను అమలు చేస్తున్నామన్నారు. ఐఐటీలు, ఎంబీబీఎస్ వంటి అత్యుత్తమ కోర్సులు అభ్యసించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. విద్యార్థుల విజ్ఞప్తి మేరకు ఎమ్మెల్యే నిధుల నుంచి కాలేజీ ఫర్నిచర్‌కు రూ.10 లక్షలు, గ్రంథాలయ పుస్తకాలకు రూ.5 లక్షలు, క్రీడా సౌకర్యాల మెరుగుదలకు రూ.5 లక్షలు మంజూరు చేశారు. రూ.200 కోట్లతో గడ్డిపల్లిలో సమీకృత ప్రభుత్వ గురుకుల పాఠశాలను నిర్మిస్తున్నామని, తొలిదశలో రాష్ట్రవ్యాప్తంగా 28 సమీకృత గురుకులాల నిర్మాణం చేపడుతున్నామని, మలిదశలో మరో 26 నిర్మించనున్నామన్నారు. నూతన సంవత్సరం సందర్భంగా మంత్రి బుధవారం కూడా కోదాడ ఎమ్మెల్యే పద్మావతితో కలిసి మైనార్టీ బాలికల గురుకుల పాఠశాలను సందర్శించి, అక్కడే భోజనం చేసి, విద్యార్థినులతో ముచ్చటించనున్నారు.

విదేశీ ప్రయాణాలపై ఐటీ నజర్?

(మొదటి పేజీ తరువాయి)

వినియోగించాల్సిందేనని.. ఈ నెల 10వ తేదీలోగా ఆ పనిని పూర్తి చేయాలని సర్క్యులర్లు జారీ చేసింది. అంతేకాదు.. ఏప్రిల్ 1 నుంచి రెండు విదేశీ విమానయాన సంస్థల విషయంలో ప్రయోగాత్మకంగా ఈ విధానాన్ని అమలు చేయనుంది. జూన్ 1 నుంచి అన్ని విమానయాన సంస్థలను తన నిఘా పరిధిలోకి తీసుకురానుంది.

ఆన్‌బోర్డ్ చాయ్ వివరాలు కూడా

విదేశీ ప్రయాణాలు చేసే భారతీయులు చాలా వరకు ఆదాయ పన్ను చెల్లించేవారే ఉంటారు. అయితే.. కొందరు ఎగవేతదారులు కూడా విదేశీ ప్రయాణాలు చేస్తున్నట్లు ఐటీ శాఖ అనుమానిస్తోంది. ఈ క్రమంలో విమాన టికెట్ పీఎన్ఆర్ నంబరుపై ఎంత మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్నారు? బంధుమిత్రులను వెంట తీసుకెళ్తున్నారా? టికెట్‌ను ఎంతకు కొన్నారు? ఎలా కొన్నారు? బ్యాగేజీ బరువెంత? విమానంలో ఏం తిన్నారు(చాయ్ మొదలు వెజ్, నాన్‌వెజ్, లిక్కర్)? అనే వివరాలను కొత్త సంవత్సరంలో రికార్డు చేయనుంది.

విమానయాన సంస్థలకు ఆదేశాలు

ఈ వివరాల సేకరణకు ఐటీ శాఖ ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను రూపొందించింది. భారత్‌కు రాకపోకలు సాగించే అన్ని విమానయాన సంస్థలు దీన్ని వినియోగించాలంటూ సర్క్యులర్లు జారీ చేసింది. ఈ నెల 10వ తేదీ వరకు గడువిచ్చింది. ఆలోగా సాఫ్ట్‌వేర్‌లో లాగిన్ అవ్వని విమానయాన సంస్థలకు దేశంలోని విమానాశ్రయాల్లో ప్రవేశం ఉండబోదని హుకుం జారీ చేసింది. ప్రయాణికుల సమ్మతితో సంబంధం లేకుండా.. ఈ సమాచారాన్ని అందజేయాలని విమానయాన సంస్థలను ఆదేశించింది. రెండు విదేశీ విమానాయాన సంస్థల్లో ఈ విధానాన్ని ఫిబ్రవరి 25 నుంచి ప్రయోగాత్మకంగా



అమలు చేయనున్నట్లు ఆ సర్క్యులర్‌లో పేర్కొంది. మార్చి 1 నుంచి అన్ని విమానయాన సంస్థలకూ ఈ విధానం అమలవుతుంది.

వ్యక్తిగత వివరాలు ఇవే..

విమానయాన సంస్థల నుంచి ఐటీ శాఖ సేకరించే వ్యక్తిగత వివరాల్లో ప్రయాణికుడి పేరు, పుట్టిన తేదీ, పాస్‌పోర్టు నంబర్, మొబైల్ ఫోన్ నంబర్, ఈ-మెయిల్ ఐడీ, విమాన టికెట్ కొనుగోలు తేదీ, టికెట్ కొనుగోలు చేసేందుకు వినియోగించిన క్రెడిట్ కార్డు నంబర్ వంటి వివరాలను సేకరించనుంది. ఈ సమాచారాన్ని కేంద్ర ప్రత్యక్ష పన్నుల మండలి(సీబీడీటీ) విశ్లేషించి, సంబంధిత ఐటీ జోన్ సెంట్రల్ ఇన్వెస్టిగేషన్ యూనిట్(సీఐయూ)కు పంపుతుందని సమాచారం. సీబీడీటీ ఇప్పటికే ఈ వివరాలను కృత్రిమ మేధ(ఏఐ) సాయంతో సేకరిస్తూ.. పన్ను మోసాలు, జీఎస్టీ ఎగవేతలను నియంత్రిస్తోంది. ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా కచ్చితత్వంతో సమగ్ర డేటా అందుతుందని ఐటీ శాఖ భావిస్తోంది.

2024లో అవినీతి కేసుల్లో 223 మంది అరెస్టు

» 97 కోట్ల ఆస్తులు స్వాధీనం: ఏసీబీ డీజీ

హైదరాబాద్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): 2024లో అవినీతి నిరోధకశాఖ అధికారులు 152 కేసులు నమోదు చేసి 223 మందిని అరెస్టు చేశారని రాష్ట్ర ఏసీబీ డీజీ విజయ్ కుమార్ మంగళవారం తెలిపారు. 129 మాటు వేసిన కేసుల్లో 200 మందిని అదుపులోకి తీసుకున్నామని, వారిలో 159 మంది ప్రభుత్వ ఉద్యోగులున్నారని చెప్పారు. ఆదాయానికి మించి ఆస్తుల కేసులు 11 నమోదు చేశామని, వారి నుంచి రూ. 97.42 కోట్ల ఆస్తులను అటాచ్ చేశామని వివరించారు. మాటు వేసిన కేసులకు సంబంధించి రూ.82.78 కోట్లు, స్వాధీనం చేసుకుని, ఫిర్యాదుదారులకు రూ. 64.80 కోట్లు తిరిగి అప్పగించామని తెలిపారు. 2024లో 11 విచారణలు చేపట్టిన ఏసీబీ అధికారులు, 29 ఆకస్మిక తనిఖీలు నిర్వహించి ఆ వివరాలను ప్రభుత్వానికి అందజేశారని వివరించారు. ప్రభుత్వ అధికారుల వ్యాజ్యాలకు సంబంధించి ప్రభుత్వం నుంచి 105 కేసులకు అనుమతి వచ్చిందని, ఆయా కేసుల్లో చార్జిషీట్లు దాఖలు చేశామని తెలిపారు. 16 కేసుల్లో నిందితులకు శిక్షలు పడ్డాయని, 26 పాత కేసులూ విచారణ తుది దశలో ఉన్నాయన్నారు. అవినీతిపై ప్రజలు 1064కి ఫిర్యాదు చేయాలని ఏసీబీ డీజీ విజయ్ కుమార్ సూచించారు.

రోటిబండ తండా ఘటనలో పట్నం మహేందర్ రెడ్డికి నోటీసులు

బొంరాస్‌పేట్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం రోటిబండ తండాలో జరిగిన ఘటనకు సంబంధించి ఈ నెల 2న బొంరాస్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో విచారణకు హాజరు కావాలని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డికి నోటీసులు జారీ చేసినట్లు ఎస్సై అబ్దుల్ రవూఫ్ తెలిపారు. లగచర్ల, హకీంపేట్, పోలెపల్లి గ్రామాల పరిధిలో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుకు భూముల కోసం అభిప్రాయ సేకరణకు అధికారులు వెళ్లగా.. వారిపై దాడి జరిగిన ఘటనలో బాధ్యుడిగా గుర్తిస్తూ నరేందర్‌రెడ్డిపై బొంరాస్‌పేట్ పీఎస్‌లో కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. లగచర్ల గ్రామ పరిధిలోని రోటిబండ తండాలో అక్టోబరు 25న లగచర్ల గ్రామానికి వస్తున్న దుద్యాల మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అవుటి శేఖర్‌పై గిరిజనులు దాడికి పాల్పడ్డారు. అప్పట్లో ఈ ఘటనతో మాజీ ఎమ్మెల్యేకు సంబంధం ఉందని అనుమానిస్తూ కేసు నమోదు చేశారు. అనంతరం లగచర్లలో జిల్లా కలెక్టర్‌తో పాటు ఇతర అధికారులపై దాడి జరిగిన ఘటనలో మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డిని ఏ1గా చేర్చుతూ జైలుకు పంపించారు. ఈ కేసులో ఆయన బెయిలుపై వచ్చారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

రాజనీతిజ్ఞుడు, రైతుబిడ్డ

ప్రజాస్వామ్య వ్యవస్థలు ప్రజానుకూలంగా ఉండడం లేదు. ఉత్తమ నాయకులు కొరవడడం కూడా అందుకు ఒక కారణం. గత గురువారంనాడు మన్మోహన్ సింగ్, ఆదివారం నాడు జిమ్మీ కార్టర్ శాశ్వత నిష్క్రమణలు కాలధర్మమే అయినప్పటికీ ప్రపంచ పురాతన, అతి పెద్ద ప్రజాస్వామ్య సమాజాలకు పరితాప ఘటనలు. ఇరువురూ తమ తమ గణతంత్ర రాజ్యాల సంస్థాపక ఆశయాలకు నిబద్ధమైనవారు. ఒకరు యాదృచ్ఛికంగా భారత ప్రధానమంత్రి అయ్యారు; మరొకరు జీవనయానంలో పౌర ధర్మాలను నిజాయితీగా నిర్వర్తిస్తూ నాయకుడుగా వికసించిన విలక్షణుడు. ప్రపంచ వ్యాప్తంగా పలు సమస్యల పరిష్కారానికి కృషి చేసిన రాజనీతిజ్ఞుడు.

వంద సంవత్సరాల పైబడిన వయసులో మరణించిన అమెరికా మాజీ అధ్యక్షుడు జిమ్మీ కార్టర్ రైతు కుటుంబం నుంచి ప్రభవించారు. చిన్నతనంలోనే పొలం పనులు అన్నీ చేసేవారు. స్వరాష్ట్రమైన జార్జియాలో జాతి వివక్ష తీవ్రంగా ఉండేది. అయినా నల్లజాతి పాలేర్లతో కలిసిమెలసి పనిచేయడం, తల్లిదండ్రుల సంస్కార భావాలు చిన్నారి జిమ్మీని ఆ సంకుచితత్వ ధోరణుల పట్ల విముఖుడిని చేశాయి. వ్యవసాయాన్ని జీవనాధారంగా చేసుకున్న కార్టర్ 1962లో రాజకీయాలలోకి ప్రవేశించేందుకు నిర్ణయించుకున్నారు. జార్జియా సెనేట్ కు రెండుసార్లు ఎన్నికయ్యారు. గవర్నర్ పదవికి పోటీ చేసి ప్రథమ ప్రయత్నంలో విఫలమయ్యారు. రెండో ప్రయత్నంలో జయపతాక ఎగురవేశారు. ఈ సందర్భంలో ఇరానియన్ – జూయిష్ మూలాలు ఉన్న డేవిడ్ రబ్బాన్ తన విమానంలో కార్టర్‌ను ప్రచారానికి రాష్ట్రమంతటా తిప్పాడు. ఎటువంటి ప్రతిఫలాన్ని ఆడగలేదు కానీ, జాతివివక్షకు కాలం చెల్లిపోయిందని గవర్నర్‌గా మీ ప్రారంభోపన్యాసంలో ప్రకటించాలని కోరాడు. 1971 జనవరిలో జార్జియా గవర్నర్‌గా తన ప్రారంభోపన్యాసంలో కార్టర్ అదే మాట గట్టిగా చెప్పారు. పేదలు, గ్రామీణులు, నల్ల జాతివారు అందరికీ అన్నిటా సమన్యాయం చేయడమే తన విధ్యుక్త ధర్మమని ప్రకటించారు. 1976లో అమెరికా అధ్యక్ష పదవికి పోటీ చేసేందుకై డెమోక్రాటిక్ పార్టీ అభ్యర్థిత్వాన్ని కార్టర్ సాధించుకున్నారు.

వియత్నాం నుంచి అవమానకరంగా నిష్క్రమించవలసిరావడం; చమురు ధల పెరుగుదల, వాటర్ గేట్ కుంభకోణం.. ఈ మూడూ 1970 దశకం ప్రథమార్ధంలో అమెరికా సమాజాన్ని కుదిపివేశాయి. వీటి నేపథ్యంలో నీతి నిజాయితీలకు నిండుతార్కాణంగా ఉన్న జిమ్మీ కార్టర్ ను అమెరికా ఓటర్లు గెలిపించారు. 1977 నుంచి 81 దాకా కొనసాగిన ఆయన అధ్యక్షతను, దురదృష్టవశాత్తు ఇరాన్ లో అమెరికా ఖైదీల ను విడిపించడంలో వైఫల్యానికి మాత్రమే గుర్తు చేసుకోవడం పరిపాటిగా ఉన్నది. నిజానికి కార్టర్ పాలన చాలా ప్రభావశీలమైన మార్పులు తీసుకువచ్చింది. పనామా కాలువపై నియంత్రణ అధికారాలను పూర్తిగా పనామా దేశానికి అప్పగించేందుకు కార్టర్ చొరవ తీసుకున్నారు. లాటిన్ అమెరికా దేశాలలోని సైనిక పాలకులకు అమెరికా మద్దతు నిచ్చే ఆనవాయితీకి స్వస్తి చెప్పారు. కమ్యూనిస్టు చైనాతో సత్సంబంధాలను నెలకొల్పుకునేందుకు నిక్సన్ హయాంలో జరిగిన ప్రశస్త కృషిని కార్టర్ మరింత ముందుకు తీసుకువెళ్లారు. అయితే ఇరాన్‌లో ఇస్లామిక్ విప్లవం రావడం, టెహ్రాన్‌లోని అమెరికా రాయబారి కార్యాలయంలోని సిబ్బందిని ఇరానియన్ విప్లవకారులు తమ నిర్బంధంలోకి తీసుకోవడం సంభవించింది. వారిని విడిపించే ప్రయత్నం విఫలమవడం కార్టర్ ప్రభుత్వ ప్రతిష్ఠను పూర్తిగా మసకబార్చింది. 1980 అధ్యక్ష పదవి ఎన్నికలలో కార్టర్ ఘోర పరాజయానికి అది దారితీసింది.

ప్రపంచవ్యాప్తంగా మానవ హక్కుల పరిరక్షణకు జిమ్మీ కార్టర్ అగ్ర ప్రాధాన్యమిచ్చారు. ఇజ్రాయిల్, ఈజిప్ట్ మధ్య చరిత్రాత్మక శాంతి ఒప్పందాన్ని సుసాధ్యం చేయడంలో ఆయన కీలక పాత్ర వహించారు. వాతావరణ మార్పు విషమ పర్యవసానాలపై సమగ్ర అవగాహనతో వాటి నిరోధానికి ఆయన పటిష్ఠ చర్యలు చేపట్టారు. వైట్ హౌస్ నుంచి నిష్క్రమించిన తరువాత కార్టర్ ప్రపంచవ్యాప్తంగా సామాజిక సేవా కార్యక్రమాలకు అంకిత మయ్యారు. అమెరికా అధ్యక్షుడుగా కార్టర్ వైఫల్యాలు ఏమైనప్పటికీ ఆయనపై చరిత్ర తీర్పు దయాభావంతో ఉంటుంది. కార్టర్ మహా చదువరి, బహు గ్రంథ రచయిత కూడా. బ్రిటిష్ కవి డిలాన్ థామస్ ను అమితంగా అభిమానించే కార్టర్ కవిత్వమూ రాశారు. తన వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దిన చిన్ననాటి పరిసరాల ప్రభావం తనలో సజీవంగా ఉందని ఒక కవితలో అభివర్ణించుకున్న మట్టి మనిషి జిమ్మీ కార్టర్.

జాగృత తెలంగాణ విద్యుత్తేజం

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో వికసించిన అగ్ని పుష్పం ఆరుట్ల కమలాదేవి. నిజాం సంస్థానం క్రింద జాగీర్దారులు, దేశ్‌ముఖ్‌లు, ఇనాందార్లు, బంజరుదార్లు, మక్తేదార్లు, అనే వివిధ రకాల ఫ్యూడల్ శక్తులు ప్రజలను పీడించే పరిస్థితుల్లో దొరతనాన్ని బొంద పెట్టిన సాయుధ సమరం. భూమి, భుక్తి, విముక్తి కోసం చేసిన పోరాటంలో బందూకు పట్టిన వీరనారి, ప్రజా ఉద్యమాలను ఊపిరిగా మార్చుకున్న విప్లవకారిణి, జీవిత పర్యంతం ప్రజల పక్షాన గళమెత్తిన మహిళ ఆరుట్ల కమలాదేవి. బలిదానాలను తెంచుకొని బందూకు పట్టి అబలలను సబలలుగా తయారు చేసే సేనానిగా మారింది. నిజాం నిరంకుశత్వానికీ, దోపిడీకి వ్యతిరేకంగా ఎగిసిపడ్డ అగ్ని కెరటం ఆరుట్ల కమలాదేవి.

అవిభక్త నల్లగొండ జిల్లా ఆలేరు తాలూకాలోని మంతపూరి గ్రామంలో 1920లో లక్ష్మీనరసమ్మ, పల్లా వెంకటరాం రెడ్డి దంపతుల కుమార్తె. ఆమెకు తల్లిదండ్రులు పెట్టిన పేరు రుక్మిణి. ఆనాడు తెలంగాణ పల్లెలు అన్నిటిలో ఉన్న పరిస్థితే మంతపూరి గ్రామంలో ఉంది. పాఠశాల లేదు. కొంత మంది ఇండ్ల ముంగిలిలో ఉపాధ్యాయున్ని నియమించి తమ పిల్లలకు చదువు చెప్పించుకొనేవారు. ఇటువంటి వీధిబడిలోనే రుక్మిణి విద్యాభ్యాసం చేసింది. మేనమామ కొడుకైన ఆరుట్ల రామచంద్రారెడ్డితో, రుక్మిణి పెళ్లి చేశారు. అప్పటికే అభ్యుదయ భావాలు ఉన్న రామచంద్రారెడ్డి పెండ్లి తర్వాత ఆమెను పైచదువులు చదవడానికి అంగీకరించాలనే నియమాలు విధించాడు వారి పెద్దవాళ్ళతో. ఆ కాలంలో సరోజినీనాయుడు, కమలాదేవి చటోపాధ్యాయ ఉన్నత చదువులు చదివారు. వారి స్ఫూర్తితోనే రామచంద్రారెడ్డి తన భార్య రుక్మిణి పేరును కమలాదేవిగా మార్పించారు. ఆమెను ప్రగతిశీల భావాల వైపు నడిపించారు.

పెళ్ళి తర్వాత ఆమె జీవితంలో ఎన్నెన్నో మార్పులు జరిగాయి. భర్త ప్రోత్సాహంతో ఆమె చదువు మొదలుపెట్టింది. ఆ రోజుల్లో స్త్రీ విద్యకు అంత ప్రాముఖ్యత లేదు. ఆ పరిస్థితుల్లో మాడపాటి హనుమంతరావు బాలికల పాఠశాలలో చేర్చారు. రాజ్‌బహదూర్ వెంకటరామిరెడ్డి వసతి గృహంలో ఉండి చదువుకున్న తొలి మహిళ కూడా కమలాదేవే. హాస్టల్‌లో అధికారుల అనుమతితో కమలాదేవి తన భర్తతో మీటింగ్‌లకు వెళ్ళేవారు. ఆంధ్ర మహాసభలలో రామచంద్రారెడ్డితో పాటు కమలాదేవి కూడా పాల్గొనేవారు. నిజామాబాద్‌లో జరిగిన 6వ ఆంధ్ర మహాసభ మల్కాపురంలో జరిగిన 7వ సభలో కమలాదేవి పాల్గొని, వాలెంటీరుగా పనిచేశారు. ఆంధ్ర మహాసభలకు వెళ్ళిన తర్వాతనే రాజకీయ అవగాహన ఆమెకు ఏర్పడింది. స్కూల్ ఫైనల్ 'హెచ్.ఎస్.సి' పాస్ అయిన తర్వాత కమలాదేవి కొలనుపాక వెళ్ళారు.



ఒక మహిళగాకాక ఒక వ్యవస్థలా బతికిన ఆరుట్ల కమలాదేవి (1920–2001) తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో వికసించిన అగ్ని పుష్పం; నిజాం నిరంకుశత్వానికీ, దోపిడీకి వ్యతిరేకంగా ఎగిసిపడ్డ అగ్ని కెరటం.అవిభక్త ఆంధ్రప్రదేశ్ శాసన సభ చరిత్రలో ఏకైక మహిళా ప్రతిపక్ష నాయకురాలు కమలా దేవి.

'రామానుజ కూటం' అనే పేరుతో జాగీరు తహశీలుతో 1941, మే 5న అనుమతి తీసుకున్నారు. కమలాదేవి ఆ భవనంలో బాలికల పాఠశాలను 1941, జూన్ 15న ప్రారంభించి, ఉచితంగా బాలికలకు విద్యను నేర్పించారు. అది దినదినాభివృద్ధి చెంది, 60 మంది బాలికలకు విద్య నేర్పించే స్థాయికి చేరుకున్నది. కొంత కాలానికి ఈ విషయం జాగీర్‌దార్లకు తెలిసిపోయింది. ప్రభుత్వం ఈ కేంద్రాన్ని మూసివేయించింది. పాఠశాల ఎక్కడ నడుపాలన్న ప్రశ్న కలిగింది. కొలనుపాక జైన మందిరం అధ్యక్షుడు లక్ష్మీచందు ఉదార స్వభావుడు. ఇతరులకు మేలు చేయాలనే సంకల్పం కలిగినవారు. వారితో సంప్రదించగా జాగీర్‌దార్ల దుర్మార్గాన్ని తెలుసుకున్న జైన మందిరం నిర్వాహకులు తమ దేవాలయంలో స్థలమిచ్చి, రాజబహదూర్ వెంకటరామారెడ్డి 'కన్యా బాలికల పాఠశాల' అనే పేరుతో పాఠశాలను ప్రారంభించారు. బాలికల పాఠశాల నడిపినందుకు జీతం ఇస్తానన్నా కూడా కమలాదేవి తీసుకోలేదు. ఉచితంగా బోధించారు. దాదాపు 100 మంది బాలికలు పాఠశాలలో చేరారు. కుట్టుపని, కోలాటం, ఆటలు, పాటలు, అన్నీ నేర్పించింది. మద్యపాన నిషేధం గురించి ఎక్కువగా ప్రచారం సాగుతున్న రోజులవి. కమలాదేవి గ్రామంలో మద్యపాన నిషేధం గురించి బాలికలతో 'కల్లు మానండోయ్' అని పాటలు పాడిస్తూ ప్రచారం చేసారు. బాలికలకు కర్రసాము, చేయిపట్టుకుంటే ఎట్లా విడిపించుకోవాలో, మనిషి దగ్గరకు రాకుండా కర్ర ఏ విధంగా తిప్పాలో నేర్పించారు. అక్కడ ఒక ఏడాదిపాటు పాఠశాలను నడిపి, గ్రామీణులను అక్షరాస్యులుగా మార్చి, చైతన్యపరిచారు.

రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, మఖ్దూం మొహియుద్దీన్ మొదలైన అగ్రనాయకులు కమలాదేవి అంకితభావాన్ని మెచ్చుకోకుండా ఉండలేకపోయారు. అక్కడి నుండి తిరిగి రాగానే భువనగిరిలో 11వ ఆంధ్ర మహాసభ సన్నాహాలు ప్రారంభమయ్యాయి. కమలాదేవి ఊరూరా తిరిగి ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. భువనగిరి ఆంధ్ర మహాసభ రాజకీయ పోరాట వేదికగా మారింది. వెట్టిచాకిరి, దొరల దౌర్జన్యాలు, భూస్వాముల పీడన, నిర్బంధపు వసూళ్ళకు వ్యతిరేకంగా ఉద్యమించడానికి భువనగిరి మహాసభ పిలుపునిచ్చింది. ఆంధ్రమహాసభ, కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం స్వీకరించిన కమలాదేవి రాజకీయ, సైనిక శిక్షణలు పొంది, తెలంగాణ సాయుధ పోరాటంలో క్రమశిక్షణ గల యోధగా పాల్గొనడం ప్రారంభించారు.

తెలంగాణ సాయుధ సమరంలో గెరిల్లా శిక్షణ పొందిన ఆమె, ఆడబెబ్బులిలా విరుచుకు పడ్డారు. రజాకార్ల దొర గుండాల రాక్షసత్వంపై అలుపెరుగని పోరు చేశారు. మహిళలతోనే గెరిల్లా దళాన్ని ఏర్పాటు చేసి, నిజాం సర్కార్ వెన్నులో వణుకు పుట్టించారు. రహస్య జీవితం, గెరిల్లా పోరాట ఫలితంగా 1948లో కమలాదేవి ఆరోగ్యం దెబ్బతిన్నది. చికిత్స కోసం బయటకు వచ్చిన కమలాదేవిని, ఆమె భర్తను ఆలేరు వద్ద పోలీసులు గుర్తించి అరెస్టు చేసారు. రామచంద్రారెడ్డిని ఖమ్మం క్యాంపుకు, కమలాదేవిని వరంగల్ జైలుకు పంపారు. వరంగల్, ఔరంగాబాద్, సికింద్రాబాద్ జైళ్లల్లో రెండున్నరేళ్లకు పైగా కఠిన కారాగారవాసాన్ని అనుభవించిన కమలాదేవి 1951 చివరలో విడుదలయ్యారు. వెంటనే ఎన్నికల రణరంగంలో దూకారు.

1952 మొదటి ఎన్నికల్లో ఆలేరు నుండి అత్యధిక ఓట్ల మెజారిటీతో శాసనసభకు ఎన్నికయ్యారు. 1952 నుంచి 1971 వరకు ఆలేరు నియోజకవర్గం నుంచి మూడుసార్లు వరుసగా ఎమ్మెల్యేగా గెలిచారు. 1962లో శాసనసభలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న కమ్యూనిస్టు పార్టీకి పుచ్చలపల్లి సుందరయ్య నాయకుడిగా, ఆరుట్ల కమలాదేవి ఉప నాయకురాలిగా ఎన్నికయ్యారు. 1964లో కమ్యూనిస్టు పార్టీ చీలిక తర్వాత కమలాదేవి శాసనసభలో ప్రతిపక్ష నాయకురాలిగా బాధ్యతలు నిర్వహించారు. అవిభక్త ఆంధ్రప్రదేశ్ శాసనసభ చరిత్రలో ఏకైక మహిళా ప్రతిపక్ష నాయకురాలు కమలాదేవి అని చరిత్ర స్పష్టం చేసింది. మూర్తీభవించిన మానవత, నిర్మల మూర్తి, అన్యాయాన్ని దహించే అగ్నిశిఖ కమలాదేవి. సాహస వనిత ఉన్నతాశయాలతో, ఉత్తమ వ్యక్తిత్వంతో పరిపూర్ణమైన జీవితాన్ని గడిపిన ఆరుట్ల కమలాదేవి 2001, జనవరి 1న తుదిశ్వాస విడిచారు. నిర్బంధంపై తిరగబడే ప్రతి పిడికిలిలో ధైర్యంలా కమలాదేవి నిలిచే ఉంటారు. బ్రతికినన్ని రోజులు ఒక మహిళగాకాక ఒక వ్యవస్థగా బతికారు.

• డా. సోమేశ్వర్ బోనకుర్తి
'పునాది' సెంటర్ ఫర్ రిసెర్చ్

కొన్ని ప్రశ్నలతో కొత్త ఏడాదిలోకి..!





■ ఎ. కృష్ణారావు
ఇండియాగేట్

'ఈ దేశం ఎటు పోతుందో అని భయమేస్తోంది. ఎవర్నీ నమ్మడానికి వీల్లేదు. ప్రతి ఒక్కరూ అవినీతికి పాల్పడుతున్నారు. మనుషులకు డబ్బే ప్రధానమైంది. ఎవరి గురించి ఏ ఆరోపణ వస్తుందో చెప్పలేకుండా ఉన్నాం. చాలా బాధ కలుగుతోంది. ఈ దుస్థితి చూసి నాకు మనశ్శాంతి కరువైంది. మా పిల్లలైతే ఈ వయస్సులో విశ్రాంతి తీసుకొమ్మని కోరుతున్నారు' అని 2013 మే 8న అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ నిర్వేదం వ్యక్తపరిచారు. మాజీ ఎంపీ, అంతకు ముందు రాజ్యసభలో తనకు సహచరుడుగా ఉన్న యలమంచిలి శివాజీ తనను పార్లమెంట్‌లో కలుసుకున్నప్పుడు మన్మోహన్ తన ఆవేదన వెళ్లగక్కారు. బొగ్గు బ్లాకుల కేటాయింపులు, 2జీపై జేపీసీ ముసాయిదా నివేదిక, తెలంగాణ తదితర అంశాలపై పార్లమెంట్ అట్టుడికి పోతున్న రోజులవి. 'మీరు విశ్రాంతి తీసుకుంటే మీకంటే నిజాయితీ గల నాయకుడు దేశానికి మరెవరు దొరుకుతారు?' శివాజీ ఆయనతో అన్నారు. 'మనం నిజాయితీగా ఉన్నామన్నా నమ్మేదెవరు?' అని మన్మోహన్ వ్యాఖ్యానించారు. 'కార్పొరేట్ సంస్థలే అన్నీ నిర్ణయిస్తున్నాయి' అని ఆయన వాపోయారు. యూపీఏ ప్రభుత్వం పదవీకాలం మరో ఏడాది ఉందనగా మన్మోహన్ సింగ్ చేసిన వ్యాఖ్యలవి. దేశంలో ఏడాది తర్వాత జరిగే పరిణామాలను మన్మోహన్ అప్పటికే ఊహించారనడానికి ఈ వ్యాఖ్యలే నిదర్శనం. మన్మోహన్‌తో మాట్లాడి వచ్చిన తర్వాత శివాజీ సెంట్రల్ హాలులో ఆంధ్రజ్యోతి ప్రతినిధికి ప్రధానితో తన సంభాషణను పంచుకున్నారు. మరునాడు 'దేశం ఎటుపోతోంది?' అన్న శీర్షికతో ఆంధ్రజ్యోతి మొదటి పేజీలో వార్త వచ్చింది. ఇది సంచలనం సృష్టించడంతో ప్రధానమంత్రి కార్యాలయం ఆంధ్రజ్యోతి ప్రతులను తెప్పించుకున్నది. నిజానికి అప్పుడున్న పరిస్థితుల్లో ఆయన చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీకి నష్టం కలిగించేవే. కాని మన్మోహన్ సింగ్ కానీ, ఆయన కార్యాలయం కానీ ఈ వార్తను ఖండించలేదు. మన్మోహన్ సింగ్ ప్రజాస్వామిక దృక్పథానికి, ఆయనలో కూడా పీవీ మాదిరి 'లోపలి మనిషి' ఉన్నాడని చెప్పేందుకు ఇది నిదర్శనం.

'కాంగ్రెస్ పార్టీలో రెండు అధికార కేంద్రాలు ఉండడానికి వీలు లేదు. నేను ఒక ప్రభుత్వాధినేతగా పార్టీకి అనుగుణంగా నడుచుకోవాలి' అని భావించిన మన్మోహన్ సింగ్ ప్రధానిగా తనకిష్టం లేని పనులు ఎన్ని జరిగినా పెదవి విప్పలేదు. పార్టీ విస్తృత ప్రయోజనాల కోసం ఆయన మౌనం పాటించేవారు. అయితే అదే సమయంలో తనను ఆర్థిక మంత్రిగా నియమించిన తన రాజకీయ గురువు పీవీ నరసింహారావును ఆయన తరుచూ కలుసుకునేవారు. పీవీ లేకపోతే తాను రాజకీయాల్లోకి వచ్చే వాడిని కానని ఆయన పలు సందర్భాల్లో అంగీకరించారు. పీవీ మరణానంతరం ఏపీ భవన్‌లో ప్రతి ఏడాది నిర్వహించే సంస్మరణ సభకు ఎవరు హాజరు కాకపోయినా ఆయన మాత్రం వచ్చి వెళ్లేవారు. తన హయాంలో కేంద్రమంత్రిగా ఉన్న జైపాల్ రెడ్డితో ఆయన సత్సంబంధాలు కొనసాగించేవారు. మన్మోహన్ సింగ్ ఆర్థిక మంత్రిగా ఉన్నప్పుడు 1993లో జరిగిన స్టాక్ మార్కెట్ కుంభకోణంపై నియమించిన జేపీసీలో తనపై వ్యాఖ్యలు చేసేందుకు జైపాల్ కారకుడని తెలిసినప్పటికీ ఆయన జైపాల్‌తో సన్నిహితంగా కొనసాగుతూ తన ఆలోచనలు పంచుకునేవారు. రాంనివాస్ మీర్ధా చైర్మన్‌గా ఉన్న ఈ జేపీసీ మన్మోహన్ సింగ్‌కు క్లీన్‌చిట్ ఇచ్చినప్పటికీ స్టాక్ మార్కెట్‌లో ఉత్థాన పతనాలను పట్టించుకోకుండా ఆర్థిక మంత్రి మొద్దు నిద్రలో ఉండడం సరైంది కాదనే వ్యాఖ్యను జైపాల్ చేర్చారు. జైపాల్ వాడిన 'స్లంబర్' (మొద్దు నిద్ర) అనే పదం మన్మోహన్ సింగ్‌కు బాధ కలిగించడంతో తన పదవికి రాజీనామా చేశారు. కాని పీవీ ఆయనకు నచ్చచెప్పి రాజీనామాను తిరస్కరించారు. అదే మన్మోహన్ సింగ్ కాంగ్రెస్‌పై కార్పొరేట్ సంస్థల ఒత్తిడి రీత్యా జైపాల్ రెడ్డిని పెట్రోలియం మంత్రిత్వ శాఖ నుంచి శాస్త్ర సాంకేతిక మంత్రిత్వ శాఖకు మార్చినప్పుడు స్వయంగా జైపాల్‌తో మాట్లాడి మనస్తాపం చెందవద్దని కోరారు. యూపీఏ ప్రభుత్వం గద్దె దిగిన తర్వాత జైపాల్ రచించిన 'టెన్ ఐడియాలజీస్' పుస్తకాన్ని మన్మోహన్ సింగ్ ఢిల్లీలో ఆవిష్కరించారు. సైద్ధాంతిక చర్చలు నిరంతరం జరుగుతున్నప్పుడే ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుందని ఆయన చెప్పారు. ఈ పుస్తకం చదువుతుంటే తనకు కేంబ్రిడ్జిలో రోజులు గుర్తుకు వస్తున్నాయని, వృత్తిపరంగా రాజకీయ నాయకుడు అయినప్పటికీ ప్రస్తుత సంక్షోభాలకు కొత్త పరిష్కారాలను అన్వేషించిన మేధావిగా జైపాల్ గుర్తింపు పొందారని మన్మోహన్ సింగ్ అన్నారు.

పాత సంవత్సరం గడిచి కొత్త సంవత్సరం ప్రవేశిస్తున్న వేళ కొత్త ఏడాదిలో మన్మోహన్ సింగ్ లాంటి వ్యక్తులు లేరన్న విషయం గుర్తుకు వచ్చి ఎంతో బాధ కలుగుతుంది. ప్రతి ఏడాదీ వ్యక్తులనే కాదు, చరిత్రల్నీ, సంప్రదాయాల్నీ, విలువల్నీ కూడా తుడిచిపెడుతుంటుంది. మన్మోహన్ సింగ్ ఏనాడూ మీడియాతో మాట్లాడేందుకు వెనుకాడేవారు కాదు. ఆయనతో రెండు మూడు సార్లు విదేశీ పర్యటనలకు వెళ్లినప్పుడు ఆయన ప్రత్యేక విమానంలో ప్రతి ఒక్కరినీ పేరుపేరునా పరిచయం చేసుకుని పలకరించడమే కాదు. అడిగిన ప్రశ్నలన్నిటికీ సమాధానం ఇచ్చిన సందర్భాలు మరిచిపోలేనివి.

ఆధునిక భారతదేశ నిర్మాణంలో మన్మోహన్ సింగ్ పాత్ర విస్మరించలేనిది. కాంగ్రెస్‌లో తన కంటే సీనియర్లైన పీవీ నరసింహారావు, ప్రణబ్ ముఖర్జీ, చిదంబరం, ఎకె ఆంటోనీ లాంటి మేధావులు ఎందరో ఉన్నప్పటికీ మన్మోహన్ సింగ్ ఆ పార్టీలో ప్రవేశించిన కొద్ది రోజులకే వారితో పాటు ఇమిడిపోయారు. జైపాల్ మాదిరే ఆయన కాంగ్రెస్ మేధావిగా గుర్తింపు పొందారు. మన్మోహన్ సింగ్ మరణించిన తర్వాత ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలోనే కాదు, దేశంలోనే భావదారిద్ర్యం ఏర్పడిందా అన్న అనుమానాలు కలుగుతున్నాయి. మేధావులను, ఆలోచనాపరులను ప్రోత్సహించి వారి ద్వారా ఎంతో కొంత ప్రయోజనం పొందే సంస్కృతిని పార్టీలు కోల్పోతున్నాయి. వారికి బదులు వేల కోట్ల డబ్బులు ఖర్చులు పెట్టి ఎమ్మెల్యేలను గెలిపించే నేతలు, వ్యూహకర్తలు ఉంటే సరిపోతుందన్న భావన ఇప్పుడు పెరిగిపోతోంది. రాజకీయ పార్టీలు ఇప్పుడు సిద్ధాంతాల ఆధారంగా ప్రజల ముందుకు వెళ్లనప్పుడు, కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలు, ధనబలం ప్రధానమైనప్పుడు, పార్టీలకు మేధావులు, సిద్ధాంతకర్తల అవసరం ఏముంటుంది?

> మేధావులు, ఆలోచనాపరులను ప్రోత్సహించి వారి ద్వారా ఎంతో కొంత ప్రయోజనం పొందే సంస్కృతిని పార్టీలు కోల్పోతున్నాయి. వారికి బదులు వేల కోట్ల డబ్బులు ఖర్చులు పెట్టి ఎమ్మెల్యేలను గెలిపించే నేతలు, వ్యూహకర్తలు ఉంటే సరిపోతుందన్న భావన ఇప్పుడు పెరిగిపోతోంది. సిద్ధాంతాల ఆధారంగా ప్రజల ముందుకు వెళ్లనప్పుడు, కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలు, ధనబలం ప్రధానమైనప్పుడు రాజకీయ పక్షాలకు మేధావులు, సిద్ధాంతకర్తల అవసరం ఏముంటుంది?

దేశ రాజకీయాలకు సంబంధించినంత వరకు 2024 ఒక చారిత్రక ఘట్టం. రాజకీయాలకు సంబంధించి మలుపుగా భావించవచ్చు. అయోధ్యలో రామమందిర నిర్మాణం జరిగి శ్రీరాముడి ప్రాణ ప్రతిష్ఠ జరగడంతో ప్రారంభమైన ఈ సంవత్సరం భారతీయ జనతా పార్టీకి సంబంధించి అత్యంత కీలకమైనది. రామమందిర నిర్మాణం జరిగిన వెంటనే మోదీ ఎన్నికలకు వెళ్లి ఉంటే ఏమి జరిగేదో కాని, ఆయన ఉన్నట్లుండి వ్యూహం మార్చి పూర్తిగా మోదీ పేరుతోనే ఎన్నికలకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. దేశమంతటా మోదీ అనే వ్యక్తి ఆధారంగానే బీజేపీ ఎన్నికల బరిలోకి దిగింది. తన పేరు చెబితే దేశం దేశం ఏకమై ఉవ్వెత్తున జనం ముందుకు వచ్చి ఓటు వేస్తారని ఊహించుకున్న మోదీ 400 సీట్లు సాధిస్తామని చెప్పుకున్నారు. కాని ఈ ప్రయోగం అంతగా సఫలీకృతం కాకపోవడంతో బీజేపీ కేవలం 240 సీట్లకే పరిమితమయింది. ఈ విఘాతాన్ని అధిగమించాలంటే హరియాణా, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించడం తప్పదని మోదీ గ్రహించారు. అందుకే అన్నిశక్తులూ ఒడ్డి, అన్ని రకాల వ్యూహాలు పన్ని ఈ రెండు రాష్ట్రాల్లో బీజేపీ గెలుపొందేలా చేయడంతో దేశ రాజకీయ చిత్రపటంపై తనకు మించిన బలమైన నేత ఎవరూ లేరని నిరూపించుకున్నారు. ఈ క్రమంలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ తెర వెనుక బలమైన శక్తిగా పనిచేసిందనడంలో సందేహం లేదు. తమకు ఆర్‌ఎస్‌ఎస్ అవసరం లేదని, బీజేపీ తన పార్టీ వ్యవహారాలు తానే నిర్ణయించుకోగలదని లోక్‌సభ ఎన్నికలకు ముందు పార్టీ అధ్యక్షుడు జగత్ ప్రకాశ్ నడ్డా చేసిన వ్యాఖ్యల పరిణామాలు ఎన్నికల ఫలితాలలో ప్రతిఫలించాయి. ఆ తర్వాత హరియాణా, మహారాష్ట్రలో గెలుపుకు సంఘ్‌పై బీజేపీ పూర్తిగా ఆధారపడవలసి వచ్చింది. 2024లోనే వందో సంవత్సరంలో అడుగుపెట్టిన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ గత పదేళ్లలో అన్ని వ్యవస్థల్లోనూ చొచ్చుకుపోయింది. అనేక మంత్రిత్వశాఖల్లో, ప్రభుత్వ సంస్థల్లో సంఘ్ ప్రతినిధులు కీలక బాధ్యతల్ని నిర్వహిస్తున్నారు. ఒక దేవాలయం నిర్మించో, కొన్ని పదవులు కట్టబెట్టో సంఘ్‌ను సంతృప్తిపరిచి తమ పని తాము చేసుకోవచ్చనుకునే రోజులు పోయాయి. ఎన్నికలు జరుగుతున్న తీరుపై, అబద్ధాలు ప్రచారం చేయడంపై, మణిపూర్‌లో జరుగుతున్న హింసాకాండపై ఆర్‌ఎస్‌ఎస్ అధినేత మోహన్ భాగవత్ ప్రకటనలు చేసిన తర్వాత అంతా బీజేపీ ఇష్టారాజ్య ప్రకారం సాగదనే అభిప్రాయం క్రమంగా ఏర్పడుతోంది. ఈ క్రమంలో 2025 ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, బీజేపీకి సంబంధించి కీలక సంవత్సరం. రాజ్యాంగం, కులగణన, అదానీ కుంభకోణం వంటి అంశాలను లేవనెత్తుతున్న కాంగ్రెస్‌ను ఎదుర్కోవడం కూడా అంత సులభం కాదు. పార్లమెంట్ చర్చలకు వేదిక కాకుండా కుమ్ములాటలకు రంగస్థలం కావడంపై ప్రతిపక్షాల కంటే మోదీయే జవాబుదారీ కావల్సి ఉంటుంది.

2024లో దేశంలో దాదాపు పది సంవత్సరాల తర్వాత జాతీయ స్థాయిలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడడం, ఈ ప్రభుత్వంలో తెలుగుదేశం వంటి దక్షిణాది పార్టీ ప్రధాన భాగస్వామి కావడం, ప్రధాన రాజకీయ పార్టీలు రెండు ప్రధాన కూటములుగా ఏర్పడడం మరో ముఖ్యమైన పరిణామం అని చెప్పక తప్పదు. బీజేపీ, కాంగ్రెస్ కూటములకు చెందని ప్రాంతీయ పార్టీలు అస్తిత్వ పరీక్షను ఎదుర్కొంటున్నాయి. బీఆర్‌ఎస్, బీజేడి, వైసీపీ, ఆమ్ ఆద్మీ పార్టీ మనుగడకోసం కష్టిస్తున్నాయి. 2025 ఈ విషయంలో మరింత స్పష్టత నిస్తుందనడంలో సందేహం లేదు. 2025 కూడా ముగిసేలోపు కాలం మరెందరి అధ్యాయాలకు తెర వేస్తుందో చెప్పలేము.

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

నిలబెట్టేది ఆత్మస్థైర్యమే!

అంకెలను వెంటేసుకుని
దొరకకుండా తిరిగే కాలాన్ని
గుప్పిట పట్టుకోలేము,
మనసుతో ముడేసుకున్న
కాలంతోనే అడుగులు వేస్తాము,
లెక్కలను తేల్చి చెప్పేది కాదు
లెక్కకు అందని ఆనందాన్ని
మిగిల్చేదే అసలైన కాలం!

కాలం నీటిలా ఆవిరయ్యేకొద్ది
చివరికి మిగిలేదేమిటో
తేటతెల్లం చేస్తుంది,
అనుభవాలు చినుకులై రాలి
కొత్తగా చిగురించడానికి
ఊతమై ఊపిరి పోస్తుంది!

కాలప్రవాహం
ప్రపంచాన్ని ఒక్కసారిగా
సంతోషంలో ముంచేస్తుంది,
ఎన్నో కొత్తదారులను
మన కళ్ళ ముందు పరుస్తుంది,
మనసులో దాగున్న లక్ష్యాన్ని
గుండెధైర్యంతో చేరుకోవాలి!

పొగిడేవాళ్ళు, తెగిడేవాళ్ళు
నీ చుట్టూ ఎందరున్నా
ఎప్పటికీ నిమిత్తమాత్రులే,
నిన్ను నిలబెట్టేది నీ ఆత్మస్థైర్యమే
నిన్ను చూపించేది నీ విజయమే!

– పుట్టి గిరిధర్

కొత్త సమరం

కేలండర్ బ్లాక్ బోర్డు మీద
కొత్త పాఠం రాయడం
మళ్ళీ మొదలుపెట్టింది కాలం

పూసల్లా జారిపోతున్న తేదీలను
మరో సంవత్సరపు దారంలోకి ఒడుపుగా ఎక్కిస్తుంది

నిన్నటి పాఠాల్ని అర్థం చేసుకునే పనిలో
కూడికల్నీ తీసివేతల్నీ భాగిస్తూ
జీవిత లెక్కల్ని పరిష్కరించే
కాలిక్యులేటర్ సిద్ధం చేసుకోవాలి

నిచ్చెనల్నీ పాముల్నీ గుర్తిస్తూ
ఆటలో విజయాన్ని చేరుకోవాలి

365

ఇప్పుడు సంవత్సరమంటే
కేవలం కాలం మాత్రమే కాదు
365 శత్రువులతో
ప్రతి క్షణం విశ్రమించక చేసే మహత్తర యుద్ధం కూడా...

ఈ గెలిచి తీరాల్సిన కొత్త సమరానికి
స్వాగత సత్కారాలు చేద్దాం.

– ర్యాలి ప్రసాద్

మంచిని ఆహ్వానించు

ఓ నేస్తం!
నూతనవత్సరం విచ్చేస్తున్న సందర్భంగా
చిన్న మాట.



గతం పునాది,
వర్తమానం ఇల్లు,
భవిష్యత్ ఆ ఇంటిలో
నువ్వు వేసే అడుగులు.

గతాన్ని తెరిచి చూడలేకపోవచ్చు.
కాని ఆ పేజీల సారాంశం
అవపోసన పట్టినప్పుడే,
రేపనే తెల్లకాగితంపై
విలువైన సమాచారం
రాయగలవని గుర్తెరుగు.

నీ ప్రవర్తనే నీ ఉనికి,
దానిని పలువురు హర్షించేలా నిలుపుకో,
మంచిని ఆహ్వానించు.

ఈ సదాశయసంకల్పంతో
నూతన సంవత్సరాన్ని ప్రారంభిద్దాం. సరేనా!

– వేమూరి శ్రీనివాస్



నవ్యజీవనగతుల సంధానమిదియె

మంచుముత్యాలు దండలై మరులు చిలుక
సుప్రభాత గీతమ్ములు సుప్రసన్న
భావమకరంద ధారలై పల్లవింప
వచ్చెభువికి నూత్నాంగ్లసంవత్సరంబు

పేదసాదల కండ్లలో మోదకళిక
మొగ్గతొడగంగ పసిపాప బుగ్గలందు
నిగ్గులెల్ల గంతులు వేయ నియతితోడ
వచ్చె భువికి నూత్నాంగ్లసంవత్సరంబు

కర్షకస్వామి కనులలో కౌతుకంబు
పలుకరించుచు నేడునంబరమునంటి
తాండవంబాడుచుండంగ ధైర్యగరిమ
వచ్చె భువికినూత్నాంగ్లసంవత్సరంబు

పల్లెపల్లెలో నవశోభ వల్లెవేసి
దారులెల్లనద్దంబులై తనియుచుండ
పచ్చదనముతో బ్రతుకులు పరిఢవిల్ల
వచ్చెభువికి నూత్నాంగ్లసంవత్సరంబు

తెలుగుజాతి తేజమ్మిట వెలుగులీన
జిలుగుజెండాలనెత్తి రాజిల్లునటుల
సరససాంకేతికజ్ఞాన సరణిమెరయ
వచ్చె భువికి నూత్నాంగ్లసంవత్సరంబు

ప్రజలు స్వాగతంబును పల్కరండురండు
నవ్యజీవనగతులసంధానమిదియె
స్వప్న సాఫల్య సౌందర్య జాణ యిదియె
ప్రగతిశీల విశాల విపంచి యిదియె

– మంకుశ్రీను

కొత్తగా మొదలవ్వాలి

కొత్తగా సరికొత్తగా జీవితం మొదలవ్వాలి
చిగురులు తొడుగుతూ రెక్కలు మొలిచినట్టు
స్వేచ్ఛగా విహరించాలి



బతుకును దుక్కులు దున్ని చదును చేసుకోవాలి
మెట్ట, మాగాణి రంగులేసుకుని
పచ్చని పంటలు పండాలి
బీదాబిక్కి జనం గొంతులో
గుక్కెడు గంజి ఒంపుకోవాలి
ఆత్మగౌరవంగా బతకాలి

పిల్లపెద్ద, ముసలి ముతక స్త్రీల బతుకుల్లో
ధైర్యం కాగడాల్లా దేశానికి వెలుగులు జిమ్మాలి
తాడిత పీడిత కులాలపై దాడులు లేకుండా
ఆధిపత్యం నశించి అగ్రకులాల సమాన భావన కలగాలి

ముగ్గుల్లో రంగులు కలిసినట్టు
మనుషుల్లో సోదర భావం కలవాలి
జాతులంతా వేరైనా మానవత్వం ఒకటై పండగసేయాలి

నూతనోత్సవం కొరకు
నూతన జీవితం మొదలెట్టాలి
ఎప్పుడూ నిత్యనూతనంగా మనుషులు బతకాలి
దేశమంతా వెలుగుల వేడుకలు చేయాలి.

– తంగిరాల సోని

మజిలీ దాటి మరో మజిలీ!



రెండు చక్రాలు
దూరం భారం మోసినట్టు
రెండు ముళ్ళు
అనంత కాలాంబుధి ఈదుతాయి
సజీవ హృదయాలపై
భూత భవిష్యత్ వర్తమానాలు
ప్రదర్శించే చలనమే కాలచక్రం
అంతం లేని కాలంలో
ఏ ఒక్క మజిలీలో
నిరాశతో మనిషి ఆగడు
ఆశల శ్వాసలు ఆశయాల హెూషలు

మళ్ళీ మూటలు కట్టుకొని
లెక్కలు బేరీజు వేసుకొని
రేపటి మజిలీకి ఉవ్విళ్లూరతాడు
నిన్న మొన్నకి నేడు నిన్నకిలానే
రేపు నేటికి..
రేపన్న ఆశే మనిషి శ్వాస

వచ్చే కాలాన్ని పోయే కాలం
దైవంలా భావిస్తుంది అందుకే!
గతం నుండి నేర్చుకుంటూ
వర్తమానంలో జీవిస్తూ
భవిత దిద్దుకోడమే ప్రగతి లక్షణం!

– భీమవరపు పురుషోత్తమ్

విశ్వమానవుడిగా వికసించాలి

ఎన్నో మిఠాయి పొట్లాలను ఎదలపై
వదిలేసి వయ్యారంగా వెళ్ళిపోతుంది
ఎన్నో కన్నీళ్లను చెక్కిళ్ళపై జారవిడిచి
గుండెకు లోతైన గాయాలను చేసి
క్యాలెండర్ మార్చుకొని కాలగర్భంలో
కలిసిపోతుంది 2024 సంవత్సరం.



పోతూ పోతూ కొన్ని జీవిత పాఠాలను
నేర్పింది, కొన్నింటిని అలవాటు చేసింది
మనం కొన్నింటికి కామా పెట్టాలి
మరికొన్నింటికి ఫుల్‌స్టాప్ చుట్టాలి
మదిలో కొత్తదనానికి అంటు కట్టాలి

కొత్త సంవత్సరానికి స్వాగతం అంటే
చాటింగ్‌లు, గ్రీటింగ్‌లు, కేక్ కటింగ్‌లు కాదు
బీరు పొంగిచ్చుడు, బొక్క కొరుకుడు అంతకన్నా కాదు
భవిత కోసం బెర్తు భద్రంగా మలచుకోవాలి.
కులాల కంపు, మతాల మత్తును,
మనసులోని మలినాలను కడిగేసుకొని
మల్లెపువ్వులా మానవతా పరిమళాలను వెదజల్లుతూ
కొత్త సంవత్సరంలో విశ్వమానవుడిగా వికసించాలి.

– తాటిపాముల రమేశ్ (తార)

శుభ'ఆకాంక్షలు'



కొత్త సీసాలో పాత సారాను
పోసేసుకునీ
సంబరాలను అంబరంగా
జరిపేసుకునీ
క్యాలెండర్లో తారీఖును
చింపేసుకునీ
మొఖానికి నవ్వుల్ని
పూసేసుకునీ
అదే నూతనత్వం అంటే
నేన్నమ్మను కాక నమ్మను

కల్మషాలను కడిగేసుకొని
కళ్లల్లో కాంతులు పోగేసుకుని
గతాన్ని నెమరేసుకొని
బాధల్లో తడుస్తున్న
వర్తమానాన్ని మానాన్ని
ఓ కొత్త వలువతో చుట్టుకోవాలి
భవిష్యత్తును అందంగా
ముస్తాబు చేసుకోవాలి...

సమతను పెంచి మమతను పంచి
ఈ నూతన వత్సరాన
కొత్తగా.. కొంగ్రొత్తగా..
అభ్యుదయ భావాల చిగుళ్ళు
తొడుక్కోవాలి
ఉషస్సులా.. తపస్సులా..
నూతనత్వం వెల్లివిరియాలి..!

– కటుకోఝ్వల రమేష్

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY హనుమకొండ HANUMAKONDA
బుధవారం 1 జనవరి 2025

వరంగల్‌లో ఆహార పరీక్ష ప్రయోగశాల
రూ.5కోట్లతో కేఎంసీలో ఏర్పాటుకు సన్నాహాలు 6
ఉమ్మడి జిల్లాలకు ఈ రీజనల్ ల్యాబ్ సేవలు



ఆఫీసర్స్ క్లబ్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు



ఆఫీసర్స్ క్లబ్‌లో చిన్నారుల న్యూ ఇయర్ కేరింతలు

హ్యాపీ.. న్యూ ఇయర్..

- అర్ధరాత్రి వేళ గ్రాండ్ వెల్‌కమ్ చెప్పిన జనం
- మందు, విందులతో యువత చిందులు
- మ్యూజిక్ అండ్ డ్యాన్స్
- నైట్ ఈవెంట్స్‌తో హోరెత్తిన ఓరుగల్లు
- వరంగల్ నగరంలో పార్టీ కల్చర్ సందడి

నయా సాల్ జోష్‌తో వరంగల్ నగరం హోరెత్తింది..
ఆటపాటలతో కొత్త సంవత్సరానికి స్వాగతం పలికింది..
2024కు బై బై.. 2025కు వెల్‌కమ్ చెప్పింది..

7

నూతన సంవత్సరం - 2025కు ఘన స్వాగతం

కొత్త సంవత్సరం వచ్చేసింది. కొత్త ఆశలతో.. సరికొత్త ఆశయాలతో నూతన సంవత్సరాన్ని జనం ఉత్సాహంగా స్వాగతించారు. చిన్నారులు, యువత, పెద్దలు, మహిళలు.. వారి వారి ప్రత్యేక పార్టీలతో హుషారుగా న్యూ ఇయర్ వేడుకల్లో పాల్గొన్నారు. వరంగల్ నగరంలో కొన్ని ప్రత్యేక సంస్థలు న్యూ ఇయర్ ఈవెంట్లు నిర్వహించాయి. బార్‌లు, క్లబ్‌లు, హోటళ్లు, రెస్టారెంట్‌లు, రిసార్ట్‌ల్లో వినోదాత్మక ఈవెంట్లు అలరించాయి. మంగళవారం రాత్రి 12గంటల దాటగానే యువత 'హ్యాపీ న్యూఇయర్' అంటూ కేరింతలు కొట్టారు. కేక్‌లు కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. నగరంలో ఎటుచూసినా నూతన సంవత్సర వేడుకల సంబరమే కనిపించింది. మిరిమిట్లుగొలిపే విద్యుత్ కాంతులు, సంగీతపు హోరు.. నోరూరించే విందులకు హోటళ్లు, రెస్టారెంట్లు వేదికలయ్యాయి. గేటెడ్ కమ్యూనిటీల్లో, అపార్ట్‌మెంట్‌లలో పిల్లలు, పెద్దలు, యువత సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. కుటుంబ సమేతంగా కొత్త సంవత్సరాన్ని స్వాగతించారు. హరిత హోటల్‌తో పాటు సుబేదారి, కడిపికొండ, హంటర్‌రోడ్డులోని పలు ప్రాంతాల్లో న్యూఇయర్ ఈవెంట్లు ఉర్రూతలూగించాయి. నగర శివారు పల్లెల్లో సైతం న్యూఇయర్ జోష్ సందడి కనిపించింది.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

హనుమకొండ జరిగిన నూతన సంవత్సర వేడుకల్లో డ్యాన్స్ చేస్తున్న యువతులు



ఆఫీసర్స్ క్లబ్‌లో నూతన సంవత్సర వేడుకల దృశ్యం

పార్కుల పునరుద్ధరణ పనులు చేపట్టండి

- బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే
- హార్టికల్చర్ అధికారులతో సమావేశం

వరంగల్ కార్పొరేషన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ పరిధిలోని పార్కులలో పునరుద్ధరణ పనులు చేపట్టాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఉద్యానవన అధికారులను ఆదేశించారు. మంగళవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో హార్టికల్చర్ అధికారుల సమావేశంలో పలు సూచనలు చేశారు. నగర వ్యాప్తంగా 27 పార్కులలో దెబ్బతిన్న వివిధ అభివృద్ధి పనులను చేపట్టవలసిన అవసరం ఉందని, ఇందుకోసం ఉద్యానవన అధికారులతో పాటు ఇంజనీరింగ్ అధికారులు దృష్టి సారించాలన్నారు. పార్కులలో దెబ్బతిన్న ఓపెన్‌జిమ్ పరికరాలు, పిల్లలు ఆడుకునే ఆట పరికరాలు గుర్తించి వాటిని వెంటనే మరమ్మతు చేయాలని అన్నారు. దెబ్బతిన్న లైటింగ్‌ను తిరిగి ఏర్పాటు చేయాలన్నారు. ఇందుకోసం అంచనాలు తయారు చేయాలన్నారు. పార్కులలో నీటి సరఫరా సమస్యలు ఉంటే ఇంజనీరింగ్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి అభివృద్ధి చేయాలన్నారు. పార్కులలో గ్యాప్ ప్లాంటేషన్ చేపట్టాలని అన్నారు. కొత్తగా నిర్మించిన పార్కులలో ఓపెన్‌జిమ్ పరికరాల ఏర్పాటు వాకర్స్ అసోసియేషన్ సహకారంతో చేయాలన్నారు. వివిధ రకాల కారణాలతో పార్కులలో పడిపోయిన, దెబ్బతిన్న గోడలు, తదితర సివిల్ పనులను గుర్తించి వాటి పునరుద్ధరణకు అంచనాలు సిద్ధం చేయాలన్నారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ వారి ఆదేశం మేరకు కోట చెరువు ప్రాంతంలో గ్రీనరీ ఏర్పాటు చేయడానికి మొక్కలను నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఉద్యానవన శాఖ చీఫ్ అధికారి పలాస రమేష్, అధికారి లక్ష్మారెడ్డితో పాటు ఈఈ మహేందర్, హార్టికల్చర్ అసిస్టెంట్లు ప్రిన్సి, అశ్విని, అనూహ్య, ప్రియాంక పాల్గొన్నారు.



ఉద్యానవన శాఖ అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్

సమర్థవంతంగా శానిటేషన్ నిర్వహణ జరగాలి

సమర్థవంతంగా శానిటేషన్ నిర్వహణ జరగాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. మంగళవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో శానిటేషన్ విభాగం అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కమిషనర్ సూచనలు చేశారు. 6వ డివిజన్‌ను మోడల్ శానిటేషన్ డివిజన్‌ను ఎంపిక చేశామన్ని, ఈ డివిజన్‌లో సమగ్ర శానిటేషన్ నిర్వహణ చేపట్టడానికి ప్రతీ ఇంటి నుంచి వందశాతం చెత్త సేకరణ జరగాలని కోరారు. తడిచెత్తను వేరుగా అందించడానికి వీలుగా డివిజన్‌లోని కుటుంబాలకు బల్దియా తరుపన రెండు చెత్త డబ్బాలను అందించాలన్నారు. స్వచ్ఛ ఆటోలకు రోడ్డు మ్యాప్ రూపొందించాలని అన్నారు. ఇంకా బయో కంపోస్ట్ యూనిట్ ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేసి టెండర్లు పిలవాలన్నారు. స్వచ్ఛ ఆటోలలో తడి, పొడి చెత్తను వేరుగా ఉంచడానికి వీలుగా అనుకూలంగా ఉండేలా చూడా లన్నారు. శానిటేషన్ చేపట్టే క్రమంలో స్వయం సహాయక బృందాలు, ఆర్పీల సహకారంతో వారం ముందు నుంచే కరపత్రాలు, బ్యానర్ల ద్వారా ప్రజల్లో శాని టేషన్ ప్రాధాన్యతపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఎం హెచ్‌ఓ డాక్టర్ రాజారెడ్డి, ఎంహెచ్‌వో డాక్టర్ రాజేశ్, ఈఈ మహేందర్, శానిటరీ సూపర్‌వైజర్లు నరేందర్‌వర్మ, భాస్కర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

డ్రోన్ సర్వే నిర్వహించాలి

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ) ఏర్పాటు కోసం పకడ్బందీగా డ్రోన్ సర్వే నిర్వహించాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులను సూచించారు. మంగళవారం బల్దియా కార్యాలయంలో ఏకే బిల్డ్ కాన్ శుభ్ కన్సల్టెన్సీ ప్రతినిధులు, వివిధ విభాగాల వింగ్ అధికారులతో మాట్లాడారు. యూజీడీడీపీఆర్ కోసం సర్వేపై జరుగుతుందని చెప్పారు. వరంగల్‌లోని రెండు, హనుమకొండలో ఐదు ప్రాంతాల్లో సర్వే పూర్తి చేయాల్సి ఉందని అన్నారు. మూడు జోన్లలో సర్వే పూర్తి అయ్యిందని వెల్లడించారు. టౌన్‌ప్లానింగ్ అధికారులు ప్రభుత్వ ప్రైవేటు భూములను గుర్తించి సర్వేకు పూర్తి సహకారం అందించాలన్నారు. మార్చిలోగా టెండరు ప్రక్రియ పూర్తి చేయాలని ఇన్‌చార్జి మంత్రి ఆదేశించారని, సర్వే పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి సిటీ ప్లానర్ రవీంద్ర రాడేకర్, ఈఈ మహేందర్, డీఈ సంతోష్‌బాబు, ఏసీపీలు ఇర్షాద్‌బాషా, రజిత, డీఈలు కార్తీక్‌రెడ్డి, రవికిరణ్, శ్యాంమోహన్‌లు ఉన్నారు.

పంట మార్పిడితో అధిక దిగుబడి

వరంగల్ కలెక్టర్ సత్య శారద

వరంగల్ కలెక్టరేట్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): నిత్యం ఒకే రకమైన పంటలు కాకుండా ఎప్పటికప్పుడు పంట మార్పిడి చేసుకుంటే అధిక దిగుబడి వస్తుందని కలెక్టర్ సత్య శారద సూచించారు. మంగళవారం ఆమె కలెక్టరేట్‌లో హార్టికల్చర్, అగ్రికల్చర్ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ధాన్యం, మొక్కజొన్న, పప్పు ధాన్యాలు, మిరప, కూరగాయలు, పండ్ల తోటల పెంపకం, పచ్చిరొట్ట, పూల తోటలు పెంచేందుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందన్నారు. ఈ విషయంపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో వరంగల్, నర్సంపేట ఆర్డీవోలు సత్యపాల్‌రెడ్డి, ఉమారాణి, వ్యవసాయశాఖ అధికారి అనురాధ, ఉద్యనవన శాఖ అధికారి సంగీతలక్ష్మీ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్య శారద

ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో అర్హులను గుర్తించాలి

ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద అర్హులను గుర్తించాలని, మొబైల్ యాప్ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఇందిరమ్మ ఇళ్ల సర్వే పురోగతిపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సర్వేలో పొరపాట్లకు తావులేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో ఇప్పటివరకు సేకరించిన వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. వివరాలను పీఎం ఆవాస్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. గడువులోగా సర్వే పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్‌వో విజయలక్ష్మీ, డీఆర్‌డీవో కౌసల్యాదేవి, జడ్పీ సీఈవో రామిరెడ్డి, ఆర్డీవోలు సత్యపాల్‌రెడ్డి, ఉమారాణి, తహసీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో సీనియర్ జర్నలిస్టు మృతి



తిలక్‌బాబు (ఫైల్)

శాయంపేట, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన సీనియర్ జర్నలిస్టు బాల్నె తిలక్‌బాబు మంగళవారం తెల్లవారుజామున గుండెపోటుతో మృతి చెందారు. పాతికేళ్లుగా రిపోర్టర్‌గా సేవలందించిన తిలక్ బాబు ఆకస్మికంగా మృతి చెందడంతో మండల ప్రజలు, తోటి పాత్రి కేయులు శోకసంద్రంలో మునిగిపోయారు. తిలక్‌బాబుతో ఉన్న బంధాన్ని గుర్తుచేసుకుని కన్నీరుమున్నీ రయ్యారు. వరంగల్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, జర్నలిస్టుల సంఘం రాష్ట్ర నాయకుడు లెనిన్, శాయంపేట సీఐ రంజిత్ రావు, ఎస్సైలు జక్కుల పరమేశ్వర్, అకినపెల్లి ప్రవీణ్, తహసీల్దార్ కాల్వల సత్యనారాయణ, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి, వేజ్ బోర్డు మెంబర్ చంద్రప్రకాష్, మాజీ జడ్పీటీసీ చక్రపాణి, ఏఎంసీ వైస్ చైర్మన్ బుజ్జన్న, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గంగుల మనోహర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ వంగాల నారాయణ రెడ్డి, మాజీ ఎంపీపీ తిరుపతిరెడ్డి, వివిధ సంఘాల నాయకులు తిలక్‌బాబు భౌతిక కాయానికి నివాళులర్పించి, ఆయన కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా, మండల వర్కింగ్ జర్న లిస్టులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

కేయూ ఉద్యోగ సంఘం నేత అయిలయ్య హఠాన్మరణం



అయిలయ్య(ఫైల్)

కేయూ క్యాంపస్ డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) కాకతీ య యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఉద్యోగి నర్మెట్ట అయిలయ్య (45) హఠాన్మరణం చెందారు. మంగళ వారం ఉదయం తెల్లవారుజామున గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు, ఇతర ఉద్యోగులు హుటాహుటిన ఆస్ప త్రికి తరలిస్తుండగానే తుదిశ్వాస విడిచారు. అయిలయ్య సుబేదారిలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో స్టోర్స్ కీపర్‌గా ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ అసోషియేషన్ కమిటీ సభ్యుడిగా, మాదిగ ఉద్యోగుల సంఘం వైస్ ప్రెసిడెంట్‌గానూ క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. అయిలయ్యకు భార్య, కుమారుడు, కూతురులున్నారు. అయిలయ్య అత్యక్రియలు ఆయన స్వగ్రామం దుగ్గొండి మండలం పొనకల్‌లో మంగళవారం సాయంత్రం నిర్వహిం చారు. అయిలయ్య మృతిపై కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుంకరి జ్యోతి, కేయూ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం జనరల్ సెక్రటరీ డాక్టర్ పుల్లా శ్రీనివాస్, వర్సిటీ మాదిగ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు ప్రొఫెసర్ పోడేటి శ్రీనివాస్, వైస్ ప్రెసిడెంట్ బొక్క మొగిలి, ఇతర బాధ్యులు వై.రవికుమార్, మహర్షి, భూక్య రాజు, సేవియా, రవికుమార్, మొట్టు రవి, కచ్చకాయల చిరంజీవి సంతాపం వ్యక్తం చేశారు. మృతదేహాన్ని సందర్శించి పుష్పగుచ్ఛాలతో నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించి ఓదార్చారు.

సివిల్ సర్వీసెస్ కబడ్డీ క్రీడా పోటీలకు అక్రమ్‌ఖాన్



అక్రమ్‌ఖాన్

వరంగల్ స్పోర్ట్స్, డిసెంబరు 31: (ఆంధ్రజ్యోతి) : జనవరి 3వ నుంచి 8వ తేదీ వరకు ఢిల్లీలో నిర్వహించనున్న ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ కబడ్డీ టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు హనుమ కొండ బొక్కలగడ్డకు చెందిన సీనియర్ కబడ్డీ క్రీడాకారుడు ఎం.డి. అక్రమ్‌ఖాన్ ఎంపికయ్యారు. ప్రస్తుతం అక్రమ్‌ఖాన్ హనుమకొం డ అంబేద్కర్ సర్కిల్ లోని ప్రధాన తపాలా కార్యాలయంలో పోస్టల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహించడమే కాకుండా జిల్లా కబడ్డీ అసోసియేషన్‌లో సంయుక్త కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్నాడు. ఈ మేరకు ప్రధాన తపాలా కార్యాలయ సూపరిండెంట్ హనుమంత్‌నాయక్, పోస్ట్ మాస్టర్ పవన్, కబడ్డీ కోచ్ వెంకటేశ్‌గౌడ్‌లు అక్రమ్‌ఖాన్‌ను మంగళవారం అభినందించారు.

కామర్స్‌లో సునీతకు డాక్టరేట్



సునీత

కేయూ క్యాంపస్, డిసెంబరు 31, (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ కామర్స్ విభాగం పరిశోధకురాలు మాలోత్ సునీత డాక్టరేట్ సాధించారు. ఈ మేరకు మంగళవారం వర్సిటీ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్ సునీతకు డాక్టరేట్ ప్రకటించారు. ఉమెన్ ఎంపవర్‌మెంట్ త్రో మైక్రో ఫైనాన్స్ - ఏ కేస్ స్టడీ ఆఫ్ వరంగల్ డిస్ట్రిక్ట్ అనే అంశంపై పరిశోధన చేసినందుకు గాను సునీత డాక్టరేట్ పొందారు. కేయూ కామర్స్ విభాగం రిటైర్డు ప్రొఫెసర్ డి.సక్రియా పర్యవేక్షణలో సునీత పరిశోధన పూర్తి చేశారు. ఖమ్మం జిల్లా రాఘునాథపాలెం మండలం లచ్చిరాంతండాకు చెందిన సునీత తల్లిదండ్రులు లీలా, బాబునాయక్‌లు. సునీత నేషనల్ ఎస్టీ రాజీవ్‌గాంధీ ఫెల్లోషిప్ సాధించారు. పలు విలువైన పరిశోధన పత్రాలను ప్రచురించారు. డాక్టరేట్ సాధించిన సునీతను పలువురు అభినందించారు.

రాష్ట్ర స్థాయి సీఎం కప్ క్రీడా పోటీలు షురూ

ప్రారంభించిన పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

అథ్లెటిక్స్, రెజ్లింగ్ క్రీడల్లో 2వేల మంది క్రీడాకారులు హాజరు



రెజ్లింగ్ క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



లాంగ్‌జంప్ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారిణి

వరంగల్ స్పోర్ట్స్, డిసెంబరు 31 : (ఆంధ్రజ్యోతి): సీఎం కప్ క్రీడా పోటీల్లో భాగంగా హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం (జేఎన్ఎస్)లో రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్, రెజ్లింగ్ క్రీడాపోటీలు జోరుగా ప్రారంభమయ్యాయి. మంగళవారం హనుమకొండ జేఎన్ఎస్‌లో పండుగ వాతావరణంలో నిర్వహిస్తున్న క్రీడా పోటీల ప్రారంభ కార్యక్రమానికి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై క్రీడా పోటీలను ప్రారంభించారు. అనంతరం వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారుల మధ్య హోరాహోరీగా జరుగుతున్న పోటీతత్వాన్ని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తిలకించారు. ఈ సందర్భంగా డీవైఎస్‌వో గుగులోత్ అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. సీఎం కప్ క్రీడా పోటీల్లో భాగంగా చివరిగా రాష్ట్ర స్థాయిలో అథ్లెటిక్స్, రెజ్లింగ్ రెండు క్రీడాంశాల్లో పోటీలు మూడు రోజుల పాటు నిర్వహిస్తామన్నారు. రాష్ట్రస్థాయిలో నిర్వహిస్తున్న పోటీల్లో వివిధ జిల్లాల నుంచి 2వేల మంది క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. జూనియర్స్ సబ్ జూనియర్స్ బాలబాలికల 40కేజీల బరువు నుంచి 74కేజీల బరువు విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామని, క్రీడా పోటీల తొలి రోజు సబ్ జూనియర్స్ బాలికలకు 40, 46, 49, కేజీల బరువు విభాగంలో, బాలుర కు 45, 51, 60 కేజీల బరువు విభాగంలో రాత్రి సైతం ఫ్లడ్ లైట్ల మధ్య రెజ్లింగ్ క్రీడా పోటీలు నిర్వ హించేందుకు ఏర్పా ట్లను చేశామన్నారు. అదే విధంగా అథ్లెటి క్స్‌లో తొలి రోజు అండర్-14, 16, 18, 20, మెన్ అండ్ ఉమెన్ విభాగాల్లో లాం గ్ జంప్. 200, 1000, 1500, మీటర్ల పరుగు పందెం, కిడ్స్ జావెలిన్‌త్రో, 100, 110మీటర్ల హార్డిల్స్, 4ఇంటు 400మిక్స్‌డ్ రిలేలో పోటీలు నిర్వహిస్తామన్నారు. కాగా, వివిధ జిల్లాల నుంచి క్రీడా పోటీల్లో పాల్గొనడానికి వచ్చిన అథ్లెట్లు తమదైన శైలిలో గెలుపే లక్ష్యంగా చిరుతల్లా దూసుకుపోతూ పతకం సాధించడమే ధ్యేయంగా పోటీ తత్వాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు, గ్రంథా లయ సంస్థ జిల్లా అధ్యక్షుడు మహ్మద్ అజీజ్‌ఖాన్, కార్పొరేటర్ జక్కుల రవీందర్, అథ్లెటిక్స్ అసోసి యేషన్ చైర్మన్ ఎర్రబెల్లి వరదరాజేశ్వర్‌రావు, రాష్ట్ర కార్యదర్శి సారంగపాణి, కాంగ్రెస్ నాయకులు నాయి ని లక్ష్మారెడ్డి, బిన్ని లక్ష్మణ్, సంపత్, అథ్లెటిక్స్ అసోసి యేషన్ బాధ్యులు రమణ, వెంకటేశ్వర్‌రెడ్డి, మనోజ్ కుమార్, నాగరాజు, పీడీలు రజనీకాంత్, వాసు డీఎస్ఏ కోచ్‌లు శ్రీమన్నారాయణ, నరేందర్, రాజు, వివిధ జిల్లాలకు చెందిన టెక్నికల్ అఫీషియల్స్ పీఈటీలు, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

బాలికపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తికి 20 ఏళ్ల జైలు

వరంగల్ లీగల్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): ఒంటరిగా ఉన్న ఎనిమిదేళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.27 వేల జరిమానా విధిస్తూ హనుమకొండ జిల్లా మొదటి అదనపు సెషన్స్ జడ్జి కం పోక్సో కోర్టు న్యాయమూర్తి బి.అపర్ణాదేవి మంగళవారం తీర్పు చెప్పారు. బాధితురాలికి రూ.2లక్షల పారితోషికం చెల్లించాలని ఈసందర్భంగా ప్రభుత్వాన్ని ఆదేశించింది. కేసు వివరాలు ఇలా ఉన్నాయి. 2018 సెప్టెంబరు 12న సిద్ధిపేట జిల్లా హుస్నాబాద్ మండలం అక్కన్నపేట గ్రామానికి చెందిన దాసరి సంపత్ అనే వ్యక్తి హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం గూడూరు గ్రామంలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన ఎమిదేళ్ల బాలిక తన నానమ్మ తాత దగ్గర ఉండి 3వ తరగతి చదువుతోంది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఒంటరిగా ఉన్న బాలికను తన ఇంట్లోకి పిలిచి అత్యాచారం చేశాడు. ఈ విషయం ఎవరికైనా చెప్పితే చంపేస్తానని బెదిరించాడు.

ఈ విషయం తెలుసుకున్న బాలిక నానమ్మ నిందితుడిపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు పోక్సో చట్టం, బీఎన్ఎస్ చట్ట ప్రకారం కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. కేసు విచారణలో నిందితుడిపై నేరం రుజువైనందున 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.27వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. కోర్టు పీసీ హరీష్ విక్రమ్ సాక్షులను ప్రవేశపెట్టగా లైజన్ అధికారిగా ఏఎస్‌ఐ కె.పరమేశ్వరి, దర్యాప్తు అధికారులుగా ఇన్‌స్పెక్టర్ ఇ.హరికృష్ణ, ఏసీపీ కె.సత్యనారాయణ వ్యవహరించారు. భరోసా లీగల్ అధికారి సీహెచ్.నీరజ కేసు విచారణలో సహకరించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజమల్లారెడ్డి కేసు వాదించారు.

బాలికను లైంగికంగా వేధించిన వ్యక్తికి మూడేళ్ల జైలు

మైనర్ బాలికను లైంగికంగా వేధించిన వ్యక్తికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ హనుమకొండ జిల్లా మొదటి అదనపు సెషన్స్ జడ్జి కం పోక్సో కోర్టు న్యాయమూర్తి బి.అపర్ణాదేవి మంగళవారం తీర్పు చెప్పారు. బాధితురాలికి రూ.50వేలు పారితోషికం చెల్లించాలని ఆదేశించారు. కేసు వివరాలు ఇలా ఉన్నాయి. 2021 ఆగస్టు 6న కాజీపేటకు చెందిన బానాల విజయరావు కూతురిపై లైంగిక వేధింపులకు పాల్పడిన గొడిచర్ల మండలం పెద్ద గోపతి గ్రామానికి చెందిన ఆంథోని పవన్‌ను శిక్షించాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. మైనర్ అయిన తన పెద్ద కూతురిని ఇచ్చి వివాహం చేయాలని నిందితుడు పట్టుపట్టడంతో నిశ్చితార్థం చేశానన్నారు. అయితే మేజర్ అయ్యే వరకు తన కూతురికి పెళ్లి చేయనని చెప్పడంతో కొన్నాళ్లు నిందితుడి కుటుంబం వివాహాన్ని వాయిదా వేసింది. అయితే ఆపై నిందితుడికి మరో వివాహం చేశారు. ఇదిలా ఉండగా, నిశ్చితార్థానికి సంబంధించిన ఫొటోలు వాట్సాప్ గ్రూపుల్లో పెట్టి అసభ్యకరమైన పదజాలంతో తన కూతురిని లైంగికంగా వేధించాడు. దీంతో బాధితురాలి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు పోక్సో చట్టం, ప్రకారం కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. కేసు విచారణలో నిందితుడిపై నేరం రుజువైనందున 3 ఏళ్ల జైలు శిక్ష, రూ.5వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. కోర్టు పీసీ ఎ.సుధాకర్, సాక్షులను ప్రవేశపెట్టగా లైజన్ అధికారిగా ఏఎస్‌ఐ కె. పరమేశ్వరి, దర్యాప్తు అధికారులుగా ఇన్‌స్పెక్టర్లు జి.మహేందర్‌రెడ్డి, వై.సుధాకర్‌రెడ్డి వ్యవహరించారు. భరోసా లీగల్ అధికారి సీహెచ్. నీరజ కేసు విచారణలో సహకరించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజమల్లారెడ్డి కేసు వాదించారు.



స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకుడు

మల్లెపూల అలంకరణలో నాగేంద్రుడు

గీసుగొండ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాస పుష్యమి సందర్భంగా ఊకల్ నాగసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం అభిషేకాలను నిర్వహించారు. స్వామివారిని మల్లెపూలతో అలంకరించి భక్తులు పూజలు చేశారు. మహిళలు పుట్టలో పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు. 'ఆంధ్రజ్యోతి' వరంగల్ బ్రాంచ్ మేనేజర్ రఘుపతిరావు - అమరావతి దంపతులు స్వామివారిని దర్శించుకొని పూజలు చేశారు. వారికి ఆలయ మర్యాదలతో అర్చకులు స్వాగతం పలికి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకుడు సముద్రాల సుదర్శనాచార్యులు, శ్రీహర్షాచార్యులు, ఆలయ చైర్మన్ మాచినపల్లి బాబురావు, కొత్తగట్టు రాజేందర్, రమేష్, భక్తులు పాల్గొన్నారు.

పోలీసు గుప్పిట్లో నగరం

- రాత్రి 9 గంటల నుంచే రోడ్లపై తనిఖీలు
- గల్లీలు, ప్రధాన రోడ్లపై సైరన్‌లు కొడుతూ ముందస్తు హెచ్చరికలు
- ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో 12 డ్రంక్ అండ్ డ్రైవ్



వరంగల్‌లో తనిఖీలు చేస్తున్న సీపీ



హనుమకొండ బస్టాండ్ ఆవరణలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

వరంగల్ క్రైం, డిసెంబర్ 31 (ఆంధ్రజ్యోతి): న్యూఇయర్ వేడుక లు విషాదం కాకుండా ఉండేందుకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ పోలీసులు పకడ్బందీగా తనిఖీలు నిర్వహించారు. వేడుకల పేరిట యువత మద్యం మత్తులో రోడ్లపైకి వచ్చి ప్రాణాలు కోల్పోవద్దని పోలీ సులు అప్రమత్తమై ముందస్తుగానే రంగంలోకి దిగారు. రాత్రి 9 గంటలకే పోలీసులు రోడ్లపైకి చేరి పెట్రోలింగ్ వాహనాల్లో గల్లీలు, ప్రధాన రోడ్లపై తిరుగుతూ సైరన్‌లు కొడుతూ ముందుస్తు హెచ్చరికలు జారీచేశా రు. మద్యం తాగి వాహనాలు నడపకుండా నిలువరిం చేందుకు ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ట్రైసిటీలో 12 బృందాలను రంగంలోకి దింపారు. హనుమకొండ, కాజీపేట, వరంగల్ ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీసులు, లా అండ్ ఆర్డర్, ప్రత్యేక విభాగాలు అడుగడు గునా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించి వంద లాది వాహనాలను సీజ్ చేశా రు. ఎలాంటి అనుమతులు లే కుండా ప్రజలను ఇబ్బందులకు గురి చేసే వ్యక్తులను హెచ్చరించి వదిలేశారు. గుంపులు, గుంపులుగా ఉండనీయకుండా చెదరగొట్టారు. కొత్త సంవత్సరం విషాద మయం కాకుండా, జీరో ప్రమాదాలు ఉండాలనే ఓ లక్ష్యంలో కమిషనరేట్ పోలీసులు ముందస్తు చర్యలతో చాలా మంది ఇళ్లలలోనే కుటుంబసభ్యుల మధ్య వేడుకలను జరుపుకున్నారు. అనుమతులు ఉన్న ఈవెంట్స్ వద్ద మఫ్టీలో పోలీ సుల పహారా కాశారు. ప్రభుత్వ, ప్రైవేట్ వసతిగృహాల వద్ద షీటీమ్ పోలీసులు నజర్ పెట్టారు. అర్ధరాత్రి 12.30 తర్వాత రోడ్లపై ఎవరినీ తిరగకుండా పకడ్బందీగా కట్టడి చేశారు. పోలీసుల ఆదేశాలను ధిక్కరించినవారిని ఠాణాలకు తరలించారు.

జోరుగా మద్యం విక్రయాలు

వైన్స్, బార్‌షాపుల్లో ఎక్కడ చూసినా ఇసుక పోస్తే రాలనంతగా మద్యం బాబులు కనిపించారు. కొంతమంది ముందే ప్లాన్ చేసుకొని అడ్వాన్స్‌గా తెచ్చుకొని ఇంట్లో పెట్టుకోగా చాలామంది 31 రాత్రి షాపులకు వెళ్లి కొనుగోలు చేశారు. ప్రతీనెల ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రూ.300కోట్ల మద్యం సేల్ అవుతుండగా డిసెంబర్ 31కు అదనం 10 నుంచి 20 శాతం ఎక్కువ సేల్ అవుతుందని మద్యం షాపుల నిర్వాహకులతో పాటు ఎక్సైజ్ అధికారులు వెల్లడించారు. మామూలు రోజుల్లో వైన్స్ 10 వరకు, బార్ 12 గంటల వరకు ఉండేది. న్యూ ఇయర్ వేడుకల పురస్కరించుకొని అర్ధరాత్రి 1గంట వరకు అనుమతులు ఉండటంతో రోజువారీ కన్నా న్యూ ఇయర్ వేడుకలకు మద్యం ప్రియులు బాగా ఎంజాయ్ చేశారు.

విధుల్లో ప్రతిభ చాటిన పోలీసులకు సేవా పతకాలు

వరంగల్ క్రైం, డిసెంబర్ 31 (ఆంధ్రజ్యోతి): వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో పలు విభాగాల్లో ప్రతిభ చూపిన పోలీస్ సిబ్బందికి నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం వివిధ పతకాలకు ఎంపిక చేసింది. ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వరిస్తున్న పి.వి.ఎస్.కుమార్ గుప్తాకు మహోన్నత సేవా పతకం, ఏఆర్ ఎస్సై ఎం.డి. గౌస్ పాషాకు ఉత్తమ సేవా పతకం, టాస్క్‌ఫోర్స్‌లో పనిచేసే హెడ్‌కానిస్టేబుల్ మాధవరెడ్డితో పాటు ఏఆర్‌లోని ఎస్సై, ఆర్ఎస్సై, కానిస్టేబుల్‌ను సేవా పతకాన్ని ప్రభుత్వం ఎంపిక చేసింది.

వరంగల్‌లో ఆహార పరీక్ష ప్రయోగశాల

రూ.5కోట్లతో కేఎంసీలో ఏర్పాటుకు సన్నాహాలు

హనుమకొండ, డిసెంబర్ 31 (ఆంధ్రజ్యోతి): ఆహార పదార్థాల్లో కల్తీని మరింత సమర్థంగా అరికట్టేందుకు, వాటిని ఎప్పటికప్పుడు పరీక్షించి సత్వ రం తగిన చర్యలు తీసుకునేందుకు వీలుగా వరంగల్ కాకతీయ మెడికల్ కళాశాల ఆవరణలో అన్ని హంగులతో అత్యాధునిక ప్రాంతీయ ఆహార పరీక్ష ప్రయోగశాలను ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. గురుకులాల్లోని విద్యార్థులు తరుచూ అస్వస్థతకు గరవుతున్న సంఘటనలు చోటు చేసుకోవడానికి కల్తీ ఆహారాన్ని తినడం వల్లనేనని తేలింది. దీంతో ప్రభుత్వం ఆహార పదార్థాల కల్తీ విషయంలో సీరియస్‌గా ఉంది.

ముమ్మరంగా తనిఖీలు

కల్తీ ఆహారాన్ని తీసుకొని అస్వస్థతకు గురవుతున్న సంఘటనలను అరికట్టేందుకు ప్రభుత్వం ఆదేశం మేరకు అన్ని జిల్లాల్లో ఆహార భద్రతా అధికారులు కొద్దిరోజులుగా ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నారు. అనుమానం కలిగిన ఆహారపదార్థాల నమూనాలను సేకరించి పరీక్షల కోసం హైదరాబాద్‌లోని ప్రయోగశాలకు పంపుతున్నారు. అక్కడ వాటిని పరీక్షించి ఫలితాలను విశ్లేషిస్తారు. ఇటీవల రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ ఆహార కల్తీని అరికట్టేందుకు ఆహార భద్రతా విభాగాన్ని ప్రక్షాళన చేసింది. టాస్క్‌ఫోర్సు బృందాలతోపాటు, కొత్తగా 24మంది ఫుడ్ ఇన్‌స్పెక్టర్లను నియమించింది. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో అధికారులు విస్తృతంగా తనఖీలు చేసి గతంలో కన్నా ఎక్కువ నమూనాలను సేకరించి పరీక్షల కోసం హైదరాబాద్‌కు పంపిస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా మిగతా అన్ని జిల్లాల నుంచి పెద్దఎత్తున ఆహార నమూనాలను హైదరాబాద్‌లోని ఆహార ప్రయోగశాలకు పెద్దఎత్తున వచ్చి చేరుతున్నాయి. వీటిని పరీక్షించి విశ్లేషించడానికి హైదరాబాద్ ప్రయోగశాలలో తగినన్ని ఏర్పాట్లు లేవు. దీనితో రాష్ట్ర ఆహార ప్రయోగశాల (స్టేట్ ఫుడ్ ల్యాబోరేటరీ)ని కొత్త హంగులతో తీర్చిదిద్దుతున్నారు.

కేఎంసీ ఆవరణలో..

హైదరాబాద్ ఆహార ప్రయోగశాలపై భారం తగ్గించేందుకు ఈ ప్రయో గ శాల తరహాలోనే వరంగల్‌తో పాటు నిజామాబాద్, మహబూబ్ నగర్‌లలో శాశ్వత ప్రాతిపదికన మూడు ప్రాంతీయ ప్రయోగశాలలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఒక్కొక్కదానిని రూ.5కోట్ల వ్యయంతో నిర్మిస్తారు. వరంగల్‌లో ప్రయోగశాల ఏర్పాటుకు అనువైన భవనాన్ని ఎంపిక చేయాల్సిందిగా ఇటీవల రాష్ట్ర ఆహార భద్రతా కమిషనర్ హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్యకు లేఖ రాశారు. ఈ మేరకు జిల్లా ఆహార భద్రతా అధికారులు కాకతీయ వైద్యశాలలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న రెండు భవనాలను పరిశీలించారు. కానీ అవి సరిపోవని భావించి ఇదే కళాశాల ఆవరణలో అందుబాటులో ఉన్న మరో విశాలమైన భవనం కోసం అన్వేషిస్తున్నారు. భవనం ఎంపిక పూర్తికాగానే దానికి తగిన విధంగా మరమ్మతులు చేసి ప్రయోగశాల ఏర్పాటు పనులను చేపడతారు. ఇందులో ఆహార కల్తీని విశ్లేషించే అత్యాధునిక పరికరాలను వివిధ పదార్థాలకు సంబంధించిన పరీక్షా విభాగాలను ఏర్పాటు చేస్తారు. ఆహార పదార్థాల నమూనాలను అందిన 24 గంటల్లో వాటిని పరీక్షించి, విశ్లేషించి నివేదికలు అందించే స్థాయిలో ల్యాబ్‌ను ఏర్పాటు చేస్తారు. పప్పులు, నూనెలు, మసాలా దినుసులు, పాలు, పాలపదార్థాలు, పానీయాలు (బేవరేజస్), మిఠాయిలు, రెస్టారెంట్లలో వండిన పదార్థాలు, చాక్లెట్ల వంటి తినుబండారాలను ఈ ప్రయోగశాలలో ప్రధానంగా పరీక్షిస్తారు. మైక్రోబయాలజీ విభాగానికి ప్రత్యేకంగా ల్యాబ్‌ను ఏర్పాటు చేస్తారు. దీనితోపాటు నీటిలోని బార లోహాలను పరీక్షించేందుకు ఐసీఎంఎస్‌సీ ల్యాబ్, ఆహార పదార్థాల్లో క్రిమిసంహారకాలను గుర్తించేందుకు జీసీఎంఎస్ ల్యాబ్‌ను కూడా ఏర్పాటు చేస్తారు. వరంగల్ జిల్లాతో పాటు కరీంనగర్, ఖమ్మం, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో సేకరించిన నమూనాలను ఈ ల్యాబ్‌లో పరీక్షిస్తారు.

గతంలో ఇక్కడ ప్రయోగశాల

గతంలో కేఎంసీ ఆవరణలో ఆహార పదార్థాల కల్తీని నిర్ధారించేందుకు ప్రాంతీయ ప్రయోగశాల ఉండేది. ఇందులోనే నీటి నమూనాలను కూడా పరీక్షించే ఏర్పాట్లు కూడా ఉండేవి. అయితే ఈ ప్రయోగశాల కేఎంసీ ఆవ రణలో ఓ మూల పాత భవనంలో చాలా ఏళ్లపాటు నడిచింది. భవనానికి మరమ్మతులు లేకపోవడంతో అది క్రమంగా శిథిలావస్థకు చేరుకున్నది. దీంతో ఈ ప్రయోగశాలను హైదరాబాద్ నాచారంలోని ప్రస్తుత రాష్ట్ర ఆహా ర ప్రయోగశాలకు తరలించారు. అప్పటి నుంచి ఉమ్మడి జిల్లాలోని ఆహార భద్రతా అధికారులు తాము తనఖీల సందర్భంగా సేకరించిన నమూనాల ను హైదరాబాద్ ల్యాబ్‌కు పంపుతున్నారు. ఈ నమూనాల ఫలితాలు రావడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ప్రజలు తాము కొనుగోలు చేసిన ఆహారాన్ని పరీక్షించుకోవాలంటే వారు కూడా తమ నమూనాలను హైదరాబాద్‌కే పంపుకోవలసి వస్తున్నది. ప్రజలు తమ ఆహారపదార్థాల నమూనాల పరీక్షకు రూ.200 చెల్లించాలి. వీటి ఫలితాలు వాస్తవానికి వారం అందాలి. కానీ నెల అంతకుపైనా పడుతోంది. ఆహార భద్రతా అధికారులు కేసుల కోసం సేకరించిన నమూనాల ఫలితాలు 14 రోజుల్లో ఇవ్వాల్సి ఉండగా నెలలు పడుతోంది. ఈ క్రమంలోనే సత్వర ఫలితాల కోసం వరంగల్‌లో ఆహార ప్రయోగశాలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..

ఘనంగా కొత్త సంవత్సరం వేడుకలు





హనుమకొండ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): 2025 సంవత్సరానికి ప్రజలు కోటి ఆశలతో స్వాగతం పలికారు. 12గంటలకు పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ నూతన సంవత్సరాన్ని సాదరంగా ఆహ్వానించారు. కొత్త సంవత్సరంలో అన్ని శుభాలే జరగాలని, అందరూ సంతోషంగా, సుఖంగా ఉండాలని ఆకాంక్షిస్తూ వ్యాట్సాప్ సందేశాలు వెల్లువెత్తాయి. హ్యాపీ న్యూయర్ అంటూ జనం ఆనందోత్సాహాలతో కేరింతలు కొట్టారు. 2025 ప్రవేశానికి శుభసూచనగా పెద్దఎత్తున బాణాసంచాను పేల్చారు. కేకులు కట్ చేశారు. స్వీట్లను పంచుకున్నారు. పరస్పరం ఆలింగనం చేసుకున్నారు. సంతోషంతో నృత్యాలు చేశారు. కొత్త సంవత్సరాన్ని స్వాగతిస్తూ పాటలు పాడారు. అపార్టుమెంట్ల సెల్లార్లు, ప్రభుత్వ, ప్రైవేటు హాస్టళ్లు, పేరున్న స్టార్‌హోటళ్లు న్యూ ఇయర్ వేడుకలతో సందరడిని సంతరించుకున్నాయి.

ముస్తాబు

2025కు స్వాగతం పలుకుతూ నగరంలోని వివిధ వ్యాపార సంస్థలను రంగు రంగుల విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. చర్చీలు, కొన్ని దేవాలయాలను కూడా ముస్తాబు చేశారు. నగరంలోని ప్రధాన కూడళ్లను, కొన్ని ప్రభుత్వ ప్రధాన కార్యాలయాలను కూడా విద్యుత్‌దీపాలతో అలంకరించారు. పలు చోట్ల కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ కార్యకర్తలు తమ నేతల ఫోటోలతో 2025 సంవత్సరానికి స్వాగతం పలుకుతూ బ్యానర్లు, ఫ్లెక్సీలు కట్టారు.

కిటకిటలాడిన మార్కెట్లు

కొత్త సంవత్సరం ప్రవేశం సందర్భంగా కొనుగోలుదారులతో మార్కెట్లు కిటకిటలాడాయి. 2025 సంవత్సరానికి స్వాగతం పలుకుతూ తెల్లవారుజుమునే ఇళ్ల ముందు ముగ్గులు వేయడానికి మహిళలు వివిధ రకాల రంగులను, అలాగే కొత్త సంవత్సరం సందర్భంగా ఆలయాల్లో పూజలు చేయడానికి ఒక రోజు ముందే ప్రజలు పూలు, ఇతర పూజాద్రవ్యాలను కొనుగోలు చేయడం కనిపించింది. స్నేహితులకు, బంధుమిత్రులకు బహుమతులు ఇవ్వడానికి యువతీ యువకులు రకరకాల గిఫ్టులను కొనుగోలు చేశారు.



మంత్రి సురేఖ శుభాకాంక్షలు

వరంగల్ సిటీ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అటవీ, దేవాదాయ, పర్యావరణశాఖ మంత్రి కొండా సురేఖ రాష్ట్ర ప్రజలకు ఆంగ్ల నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. లక్ష్య సాధనలో ప్రయత్న లోపం లేకుండా కృషి చేస్తూ ఆనందంగా ఉండడమే అర్థవంతమైన జీవితమని పేర్కొన్నారు. యువత లక్ష్యాలను నిర్ధారించుకుని ముందుకు సాగాలని సూచించారు. ఈ నూతన సంవ్సతరంలో ప్రతీ ఒక్కరి ఆశలు, ఆకాంక్షలు నెరవేరాలని, అందరి జీవితాల్లో వెలుగులు నిండాలని మంత్రి ఆకాంక్షించారు.

హనుమకొండ కలెక్టర్..

హనుమకొండ కలెక్టరేట్: జిల్లా ప్రజలకు హనుమకొండ కలెక్టర్ పి. ప్రావీణ్య నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరంలో జిల్లా ప్రజలు మరిన్ని విజయాలు సాధించాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. అన్ని తరగతుల విద్యార్థులు బాగా చదు వుకుని మంచి ఫలితాలు సాధించాలన్నారు. కొత్త సంవత్సరం 2025లో హనుమకొండ జల్లాను ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు అందరి సహ కారంతో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు. అభివృద్ధికి జిల్లా ప్రజలందరు సహకరించాలని కలెక్టర్ ప్రావీణ్య కోరారు.



కేక్‌ల అమ్మకాలతో బేకరీల సందడి

కొత్త సంవత్సర వేళ ముస్తాబైన ఆలయాలు

వరంగల్ కల్చరల్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని మంగళవారం సాయంత్రం నుంచే వేడుకలు ప్రారంభమయ్యాయి. ముంగిళ్లలో రంగురంగుల ముగ్గులు వేసేందుకు భారీగా రంగులు కొనుగోలు చేశారు. యువత పెద్ద ఎత్తున కేక్‌లు కొనుగోలు చేస్తారని ముందస్తుగా బేకరీల్లో ప్రత్యేక కేక్‌లు తయారు చేసి అందుబాటులో ఉంచారు. ఇక అర్ధరాత్రి 12 గంటలకు బాణసంచా కాల్చే విషయంలో పోలీసులు ఆంక్షలు విధించడంతో యువత అందుకు దూరంగానే ఉన్నారు.

ఆలయాల ముస్తాబు

ఆంగ్ల సంవత్సరాన్ని పురస్కరించుకొని నగరంలో దేవాలయాలను ముస్తాబు చేశారు. చారిత్రక భద్రకాళి దేవాలయం అమ్మవారిని అందంగా అలంకరించి ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేశారు.

వేలాది సంఖ్యలో భక్తులు తరలి వస్తారని ముందస్తుగా ఆలయ అధికా రులు లడ్డూలు తయారు చేసి అందుబాటులో ఉంచారు. ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు.

వాహనాల తనిఖీలు

ఆంగ్ల సంవత్సరాన్ని పురస్కరించుకొని నగరంలోని స్టేషన్‌రోడ్డు, చౌరస్తా, పోచమ్మ మైదాన్, కాశిబుగ్గ, ఇతర ప్రాంతాల్లో అడుగడుగునా పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. డ్రంకెన్ డ్రైవ్ టెస్టులు నిర్వహించారు. మోటారు సైకిళ్లపై స్పీడ్‌గా వెళ్లవద్దని, బహిరంగ ప్రదేశాల్లో డీజేలు, సౌండ్ సిస్టంలను నిషేధించారు. రాత్రి వేళల్లో రోడ్లపై గొడవలు సృష్టించినా, మద్యం సేవించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఇంతెజార్‌గంజ్ సీఐ షుకూర్ హెచ్చరించారు.



వరంగల్ చౌరస్తాలో రంగులు విక్రయిస్తున్న దృశ్యం



నూతన సంవత్సరం సందర్భంగా భక్తుల కోసం విక్రయానికి లడ్డూలు సిద్ధం

కోటి ఆశల కొత్త యేడు!

2025లో పెండింగ్ సమస్యలకు పరిష్కారం లభించేనా?



హనుమకొండ, డిసెంబర్ 31 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలు, ప్రజాప్రతి నిధులు, రాజకీయ నాయకులు, ఉద్యోగులు కోటి ఆశలు, కొత్త లక్ష్యాలతో కొత్త సంవత్సరం-2025లోకి అడుగు పెడుతున్నారు. కనీసం 2025 లోనైనా తమ సమస్యలు పరిష్కారం కాగలవన్న ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు.

రేషన్ కార్డులకు మోక్షం లభించేనా?

సంక్రాంతి తర్వాత రేషన్‌కార్డులు లేనివారందరికీ ఇస్తామని ప్రభుత్వం నమ్మకంగా చెబుతోంది. దీంతో ప్రజలు ఈ కొత్త సంవత్సరంలో తమ రేషన్‌కార్డుల పరేషాన్ తొలగిపోయినట్లేనని భావిస్తు న్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత గత సంవత్సరం డిసెంబ ర్ 28 నుంచి జనవరి 6 వరకు ప్రభుత్వం నిర్వహించిన ప్రజా పాలనలో తెల్లరేషన్ కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరించింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 48వేలకుపైగా దరఖాస్తుల చేసుకున్న ట్లు అంచనా. ఉమ్మడి జిల్లాలో 1.80లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రస్తుతం ఉమ్మడి మొత్తం 8.9 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయి. అర్హులైన వారు మరో 3 లక్షల మంది వరకు ఉండవచ్చునని అంచనా.



నీడ దొరికేనా?

2025 సంవత్సరంలో కనీసం ఇందిరమ్మ ఇళ్లయినా దక్కాలని గూడులేని ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు. బీఆర్ఎస్ హయాంలో పదేళ్లుగా డబుల్ బెడ్‌రూమ్ ఇంటి కోసం కళ్లుకాయలు కాసేలా ఎదురు చూసి చివరికి నిరాశకు లోనయ్యారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇందిరమ్మ పథకం కింద ఇళ్లులేని నిరుపేదలకు ఇళ్లు ఇవ్వనున్నట్లు ప్రకటించింది. దరఖాస్తులను స్వీకరించింది. ప్రస్తుతం లబ్ధిదారుల ఎంపికకు ఇందిరమ్మ ఇళ్ల సర్వే జరుగుతోంది. సంక్రాంతి తర్వాత ఇళ్ల మంజూరు ఉంటుందని ప్రభుత్వం చెబుతోంది. దీంతో నిలువనీడలేని నిరుపేదలు ఇందిరమ్మ ఇళ్లపై ఆశలు పెట్టుకున్నారు. ఈ యేడైనా తమకు ఇల్లు ఇస్తుందన్న నమ్మకంతో ఉన్నారు.



నగరంలో అభివృద్ధి పనులు

వరంగల్ అభివృద్ధి దిశగా ఈ ఏడు అడుగులు పడగలవన్న ఆశతో నగర ప్రజలు ఉన్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వం గత సంవత్సరమే రూ.6,115 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించింది. రింగ్ రోడ్డు, మామునూరు ఎయిర్‌పోర్టుకు భూసేకరణ, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీకి డీపీఆర్ సిద్ధం చేయడం మొదలైంది. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న మాస్టర్‌ప్లాన్ ఆమోదం పొందింది. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మంజూరైంది. మామునూరు ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు అదనంగా స్థల సేకరణకు జీవో జారీ అయింది. ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్ల ప్రతిపాదనలకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. దీనితో ఈ ఏడు నగరాభివృద్ధి శరవేగంగా జరుగగలదని, మౌలిక సుదుపాయాలు మరిన్ని అందుబాటులో రాగలవన్న విశ్వాసంతో నగర ప్రజలు ఉన్నారు.

అసంపూర్తి పనులు పూర్తి

ఉమ్మడి జిల్లాలో అసంపూర్తిగా మిగిలిపోయిన పనులకు 2025లో మోక్షం లభించగలదన్న విశ్వాసంతో ప్రజలు ఉన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల్లో చాలావరకు పూర్తికాలేదు. వరంగల్‌లోని పాత సెంట్రల్ జైలు స్థలంలో రూ.1100 కోట్లతో చేపట్టిన సూపర్ స్పెషాలిటీ భవనం, కాజీపేటలోని ఫాతిమానగర్ బ్రిడ్జి, వరంగల్ నగరం చుట్టూరా చేపట్టిన ఔటర్ రింగ్ రోడ్డు , వరంగల్ బస్టాండ్, స్మార్ట్ రోడ్డు పనులు, గీసుగొండ సమీపంలో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇంటగ్రేటెడ్ టెక్స్‌టైల్ పార్క్, సీపీ కార్యాలయం ఆవరణలో కమాండ్ కంట్రోల్ భవనం, వడ్డెపెల్లి బండ్ సుందరీకరణ, వరంగల్‌లో కలెక్టర్ కార్యాలయం భవనం పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. కొత్త సంవత్సరంలో ఈ పనులకు మోక్షం లభించగలదన్న ఆశతో ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులూ ఉన్నారు. జనగామ జిల్లాలో ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న టెక్స్‌టైల్ పార్క్, అలాగే స్టేషన్‌ఘన్‌పూర్‌లో లెదర్ పార్క్, కొడకండ్లలో టెక్స్‌టైల్ పార్క్‌ల ఏర్పాటుకు 2025లో అయినా మోక్షం కలగాలని ప్రజలు కోరుకుంటున్నారు. నత్తనడకన సాగుతున్న చెన్నూరు రిజర్వాయర్ పనులు కనీసం ఈ ఏడైనా వేగం పుంజుకోవాలని అభిలషిస్తున్నారు.



గ్రీటింగ్ కార్డు యాదిలో..

- ఒకప్పుడు న్యూ ఇయర్ తెలిపే మాధ్యమం
- ఇప్పుడంతా సోషల్ మీడియా ట్రెండే..
- జ్ఞాపకాలను నెమరువేసుకుంటున్న పాత తరం

హనుమకొండ సిటీ, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): న్యూ ఇయర్ వస్తోందనగానే మదిలో తొలుత మెదిలేది అందరికీ గ్రీటింగ్స్ చెప్పాలనే ఆలోచనే. వారం నుంచే ఈ సందడి నెలకొంటుంది. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియచేయడంలో కలిసి ఉన్న బంధాలు మరింత బలపడతాయి. విడిపోయిన బంధాలు మళ్లీ వికసించడానికి దోహదపడతాయి. ఇందుకు గడిచిన కాలంలో అయినా.. ప్రస్తుత తరుణంలో అయినా వారిధిగా నిలిచేది గ్రీటింగ్ కార్డ్. అయితే కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలియచేయడంలో ఒకప్పుడు గ్రీటింగ్ కార్డు వేదికగా ఉంటే.. నేటి హైటెక్ యుగంలో సోషల్ మీడియా నిలిచింది. శుభాకాంక్షలు తెలిపే మార్గం మారిన నేపథ్యంలో పాత తరం వారి కాలం నాటి గ్రీటింగ్ కార్డు జ్ఞాపకాలను కొత్త సంవత్సర వేళ నెమరేసుకుంటుండగా.. నేటి యువత సోషల్ మీడియా వేదిక ద్వారా న్యూ ఇయర్ గ్రీటింగ్ తెలిపే ఫీలింగ్స్‌ను ఎంజాయ్ చేస్తున్నారు.

గ్రీటింగ్ కార్డ్ యాదిలో..

2020కి ముందు న్యూ ఇయర్ ట్రెండ్‌ను పాత తరం నెమరేసుకుంటూ నూతన సంవత్సర సెలబ్రేషన్స్‌లో పాల్గొంటోంది. ఎక్కడ నలుగురు ఒక్క చోటకు చేరినా.. ఈ విషయాన్ని చర్చిస్తున్నారు. మన రోజుల్లో ఎలా ఉండేది.. అంటూ సాగే సంభాషణ కళ్లకు కట్టినట్లు ఆవిష్కరించుకుంటూ ఆ జ్ఞాపకాల లోతుల్లోకి వెళుతున్నారు. గ్రీటింగ్ కార్డు అందుబాటులో లేకుంటే పోస్టు కార్డు.. లేదా ఇన్ లాండ్ లేటర్ ద్వారా కూడా పెద్ద పెద్ద అక్షరాలతో హ్యాపీ న్యూ ఇయన్ అని మాత్రమే రాసి తెలిపే వాళ్లం.. అంటూ పెద్దలు జ్ఞాపకం చేసుకుంటున్నారు. గ్రీటింగ్‌కార్డు కొనాలంటే డిసెంబరు 15వ తేదీ నుంచే సిద్ధపడే వాళ్లమంటున్నారు. ఎందుకంటే దూర ప్రాంతాలకు పోస్టు చేమడానికి ముందే తీసేసుకునే వాళ్లమంటున్నారు. కార్డు సెలక్షన్ కోసం బుక్ స్టాల్స్ గ్రీటింగ్ కార్డు విక్రయించే గిఫ్ట్ సెంటర్లకు వెళ్లి అరగంటకు పైగా సమయం తీసుకొని సెలక్షన్ చేసుకునే వాళ్లమంటున్నారు. ఇక ప్రేమికులకు అయితే గ్రీటింగ్ కార్డు వెరీ వెరీ స్పెషల్ అంటున్నారు. గ్రీటింగ్ కార్డు ఇవ్వడం ప్రేమను వ్యక్తం చేయడానికి ఒక మార్గంగా ఉండేదంటున్నారు. అప్పటికే ప్రేమికులు అయితే.. కార్డు స్పెషల్‌గా ఉండే సెలక్షన్స్‌లో పోటీ పడే వాళ్లమంటూ ఓల్డ్ జనరేషన్ గుర్తు చేస్తూ.. నూతన సంవత్సర వేళ గ్రీటింగ్ కార్డు జ్ఞాపకాలను వ్యక్తం చేస్తూ కొత్త సంవత్సరంలోకి అడుగిడుతున్నారు. మారిన ట్రెండ్‌ను ఫాలో అవుతూ ఇక మేము కూడా సోషల్ మీడియాను ఫాలో కావాల్సిందే కదా.. అంటూ న్యూ ఇయర్‌కు వెల్‌కం చెబుతున్నారు.





సోషల్ మీడియా వేదికగా నేటి తరం

ఇప్పుడంతా సోషల్ మీడియా ప్రపంచం. కొత్త సంవత్సర వేళ వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ ఇతరత్రా సోషల్ మీడియా ద్వారా న్యూ ఇయర్ గ్రీటింగ్స్ తెలియచేస్తున్నారు. ఇంట్లో పెద్దలు ఉంటే వారి జ్ఞాపకాలను వింటూ.. ఇప్పుడంతా సోషల్‌మీడియా ట్రెండ్.. అంటూ ఆ మార్గంలో గ్రీటింగ్స్ చెబుతున్నారు. పాత, నేటి తరం గ్రీట్సింగ్స్ జ్ఞాపకాలు, అనుభవాలతో కొత్త సంవత్సరంలోకి సందడిగా ప్రవేశిస్తున్నారు.





హనుమకొండలో ఎగ్జిబిషన్ ప్రారంభం

హనుమకొండ టౌన్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): హనుమకొండ బాలసముద్రం లోని కుడా మైదానం(హయగ్రీవచారి మైదానం) లో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను మంగళవారం పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భ ంగా ఆయన మాట్లాడుతూ.. నూతన సంవత్సరం, సంక్రాంతి సెలవుల్లో విద్యార్థులు, తల్లిదండ్రులు, పిల్లలు, పెద్దలు అందరూ సాయంత్రం వేళ ఎగ్జిబిషన్‌ను సందర్శించి ఉల్లాసంగా, ఉత్సాహంగా గడపాలని కోరారు. ఎగ్జిబిషన్ యజమాని అస్లాం మాట్లాడుతూ.. వరంగల్ నగర ప్రజల కోసం ఎగ్జిబిషన్‌ను మైసూర్ ప్యాలెస్ సెట్ ముఖ ద్వారంతో వేశామన్నారు. ఇందులో మ్యూజికల్ ఫౌంటేన్‌ను ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో ఇటాలియన్ టైప్ అమ్యూజ్మెంట్ పార్క్, దేశంలోని భిన్న సంస్కృతు లను ప్రతిబింబించే రాజస్థాన్, లక్నో, హరియా నా.. మరెన్నో రాష్ట్రాలకు చెందిన కలంకారీ, చేనేత, ఫ్యాన్సీ బ్యాంగిల్స్, ఇమిటేషన్ జ్యూవెలరీ, లెదర్ గూడ్స్ రుచికరమైన కలకత్తా చాట్‌బండార్ వంటివి 100కు పైగా స్టాల్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో 'కుడా' చైర్మన్ ఇనగాల వెంకట్రామ్‌రెడ్డి, మైనారిటీ కాంగ్రెస్ నాయకులు అజీజ్ మీర్జా, మేనేజర్లు డి.రాజేం ద్రప్రసాద్, ఫిరోజ్, 30వ డివిజన్ కార్పొరేటర్ రావుల కోమలకిషన్, 5వ డివిజన్ కార్పొరేటర్ శ్రీమన్నారాయణ, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు బొమ్మనపెల్లి అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

అంత్యక్రియలకు ఆర్థిక సహాయం

హ సన్ పర్తి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ 55వ డివిజన్ పరిధి భీమారంలో సోమవారం అనారోగ్యంతో పసులాటి విజయ్ మృతిచెందారు. మృతి విషయం తెలిపిన ఇదే గ్రామానికి చెందిన తోట రమేష్ మృతుడి అంత్యక్రియలకు తక్షణ సహాయం కింద రూ.30 వేల నగదు ఆర్థిక సహాయం చేసి మానవత్వం చాటుకున్నారు. అనంతరం మృతుడి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా దాత రమేష్ వెంట ఇంద్రాక్షి బార్గవ్, మార్క రాజు, ఇంద్రాక్షి పున్నం, అల్లం రాకేష్, నిరంజన్ తదితరులున్నారు.


అంత్యక్రియలకు ఆర్థిక సహాయం చేస్తున్న తోట రమేష్

రక్షణ రంగంలో యువతకు విస్తృతంగా ఉద్యోగాలు

కేయూ క్యాంపస్ డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): దేశ రక్షణ రంగంలో యువత విస్తృతమైన ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలంగాణ 10వ కంపెనీ ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కల్నర్ ఎస్ఎస్ రామదురై చెప్పారు. మంగళవారం కేయూ గణితశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ఆర్.భారవిశర్మ నేతృత్వంలో రక్షణ రంగంలో ఉద్యోగ అవకాశాలపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రామదురై ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దేశ సైన్యంతోపాటు సైనిక సేవల రంగంలో ఉన్న అవకాశాలు, వాటిని సాధించుకునే విధానాలు, ఉన్న పోటీ పరీక్షలు, మిలిటరీలో ఉద్యోగాలు సంపాదించుకున్న ఉద్యోగార్థులకు అందే సదుపాయాలను వివరించారు. అలాగే రక్షణ రంగంలో అవకాశాలు, అధికారాలను విశదీకరించారు. ఎన్‌డీఏ, సీడీఎస్ పరీక్షలు ఉత్తీర్ణత సాధించినట్లయితే రక్షణ రంగంలో ఉద్యోగాలు వస్తాయని తెలిపారు. పరీక్షల విధానాన్ని తెలియజేశారు. ఈ సమావేశంలో మేజర్ సుబేదార్ రవీ, కేయూ హాస్టల్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు డాక్టర్ ఎం.తిరుమలదేవి, డాక్టర్ బీఎస్ఎల్ సౌజన్య డాక్టర్ సోమయ్య, రిటైర్డు ప్రొఫెసర్ డాక్టర్ టి.సుమతి ఉమామహేశ్వరితోపాటు విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు లేవనెత్తిన పలు సందేహాలను నివృత్తి చేశారు.


మాట్లాడుతున్న రామదురై , విభాగాధిపతి భారవిశర్మ

వేడుక ఆనందాన్ని పంచేదిగా ఉండాలి

బాలసముద్రం, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ఏదైనా వేడుక అంటే పది మందికి ఆనందాన్ని పంచేదిగా ఉండాలని కన్జూమర్ రైట్స్ అండ్ ప్రొటెక్షన్ నేషనల్ వైస్‌చైర్మన్ డాక్టర్ కరకాల అనితారెడ్డి అన్నారు. మంగళవారం హనుమకొండలోని స్పందన మానసిక దివ్యాంగులు, బదిరుల ఆశ్రమంలో పిల్లలతో కలిసి ఆమె నూతన సంవత్సర వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లల తో పాటు ఆమె కేక్‌ను కట్ చేశారు. పిల్లలతో పాటలు పాడించి నృత్యాలు చేయించారు. కార్యక్రమంలో అనితారెడ్డి మాట్లాడుతూ.. నూతన సంవత్సర వేడుకల సంబరాల పేరిట ఎంతో మంది ఎంతో ఖర్చు చేస్తుంటారని ఇలాంటి పిల్లల మధ్య సంబరాలు జరుపుకుంటే వారుకూడా ఆనందిస్తారని అన్నారు. వేడుకల్లో ఆశ్రమ నిర్వాహకురాలు సుచరిత, హరిత, వసుధ, రాజేందర్‌రెడ్డి, పిల్లలు పాల్గొన్నారు.


న్యూ ఇయర్ కేక్ కట్ చేస్తున్న డాక్టర్ అనితారెడ్డి

బల్దియా కార్మికులకు పర్మినెంట్ చేయాలి

కమిషనర్, మేయర్‌ను కలిసిన సీఐటీయూ నాయకులు

వరంగల్ కార్పొరేషన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీలలో పని చేస్తున్న కార్మికులకు నెలకు రూ.26వేల జీతంలో పాటు ఉద్యోగం పర్మినెంట్ చేయాలని ఈనెల 4, 5 తేదీలలో సీఐటీయూ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు దీక్షలు చేపడుతున్నట్లు సీఐటీయూ జిల్లా నాయకులు తెలిపారు. వరంగల్ జిల్లా సీఐటీయూ నాయకులు మంగళవారం బల్దియా కార్యాలయంలో బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, మేయర్ గుండు సుధారాణిని కలిసి వినితిపత్రాలను అందించారు. దీక్షలు చేపట్టేందుకు అనుమతులు ఇవ్వాలని కోరారు. రెండు రోజుల పాటు కార్మికులు విధులు మానేస్తారని తెలిపారు. కమిషనర్, మేయర్‌ను కలిసిన వారిలో సీఐటీయూ నాయకులు జన్ను ప్రకాశ్, సింగారాపు బాబురావు, బరుపట్ల మహేశ్, యాస బాబు, జీవన్ ఉన్నారు.


మేయర్‌కు వినతి పత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు

కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరాలి


గెట్ టు గెదర్‌లో పాల్గొన్న కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు

న్యూశాయంపేట, డిసెంబరు 31(ఆంధ్ర జ్యోతి): హనుమకొండలోని తేజస్ జూనియర్ కళాశాల గెట్ టు గెదర్ పార్టీ న్యూశాయం పేటలోని టీవీఆర్ గార్డెన్‌లో బుధవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులు డాన్స్‌లు చేస్తూ పాటలు పాడుతూ ఉత్సాహంగా గడిపారు. అనంతరం కళాశాల డైరెక్టర్లు మహేందర్ రెడ్డి, అశోక్‌రెడ్డి, సురేందర్ రెడ్డి, రాంబాబు మాట్లాడుతూ.. తేజస్ కళాశాల స్థాపించిన 15 ఏళ్లలో అనేక మంది విద్యార్థులు ఐఐటీ, నీట్ లాంటి పోటీ పరీక్షలలో రాణిం చారన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి భవిష్యత్‌లో ఉన్నతస్థాయిలో ఉండాలని ఆకాక్షించారు. కళాశాల సెక్రెటరీ, ప్రిన్సిపల్ పసునూరి మహేందర్ రెడ్డి, చైర్మన్ పెంతల అశోక్‌రెడ్డితోపాటు కళాశాల అధ్యాప కులు సతీష్, విద్యాసాగర్, శ్రీపాల్, స్వప్న, మా నస, శిరీష విద్యార్థినీ, విద్యార్థులు పాలొన్నారు.

పదిలో అత్యుత్తమ ఫలితాలు సాధించాలి

వరంగల్ ఎడ్యుకేషన్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): పదో తరగతిలో అత్యుత్తమ ఫలితాలు సాధించి హనుమకొండ జిల్లాను రాష్ట్రంలోనే ముందుంచాలని డీఈవో వాసంతి సూచించారు. మంగళవారం హనుమకొండ డైట్‌లో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో అన్ని యాజమాన్య పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వాసంతి మాట్లాడుతూ.. పదిలో అత్యుత్తమ ఫలితాల సాధనలో ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఈ ఏడాది పది ఫలితాల్లో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. జిల్లాలో పదో తరగతి విద్యార్థులకోసం 40 రోజులు ప్రణాళికను రూపొందించి అమలు చేస్తున్నామన్నారు. 40 రోజుల ప్రణాళికను పక్కాగా అమలు చేస్తే 100 శాతం ఫలితాలు సాధిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఈబీ సెక్రెటరీ డాక్టర్ బి.రాంధన్, ఏఎంవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఈవో వాసంతి

ప్రభుత్వ పాఠశాలకు 'లయన్స్' చేయూత


విద్యార్థులకు పండ్లు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

హసన్‌పర్తి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలకు లయన్స్ క్లబ్ ఆఫ్ హసన్‌పర్తి అధ్యక్షుడు మినుముల కృపాకర్ ఆధ్వర్యంలో ఫ్యాన్లు, కుర్చీలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నెలరోజులుగా ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి విద్యార్థుల ప్రత్యేక తరగతుల నిర్వహణలో ఆకలికి ఇబ్బంది పడకుండా పండ్లు పంపిణీ చేస్తున్నామన్నారు. అంతేకాకుండా 17 ఏళ్లుగా పాఠశాలను దత్తత తీసుకొని వారికి మౌళిక వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయుల కోసం కుర్చీలు, ఫ్యాన్లను కూడా అందించామని తెలిపారు. భవిష్యత్‌లో అవసరమైన మౌళిక వసతుల కల్పనకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు నాగమల్ల సుధీర్, చిలగాని మోహన్, తోట సంపత్, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తేనే గుర్తింపు

హసన్‌పర్తి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తేనే సమా జంలో ప్రభుత్వ ఉద్యోగులకు మంచి గుర్తింపు ఉంటుందని 'కుడా' మాజీ చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజుయాదవ్ అన్నారు. మండల కేంద్రంలోని సంస్కృతి విహార్ హసన్‌పర్తి ఈటీసీ సెంటర్‌లో జూనియర్ ఫ్యాకల్టీ ఎంపీడీవో వి.సాయిచరణ్ ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 34 ఏళ్లుగా పంచాయతీ రాజ్ శాఖలో వివిధ హోదాల్లో పనిచేసిన సాయిచరణ్ ప్రజలకు అత్యంత సన్నిహితంగా ఉంటూ మెరుగైన సేవలు అందించి మంచి గుర్తింపు తెచ్చుకోవడం హర్షణీయమన్నారు.


పదవి విరమణ పొందిన సాయిచరణ్‌ని సన్మానిస్తున్న కుడా మాజీ చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజుయాదవ్

ఉద్యోగ విరమణ పొందిన
పోలీసులకు సన్మానం


సిబ్బందిని సన్మానిస్తున్న సీపీ

వరంగల్ క్రైం, డిసెంబర్ 31 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో సుదీర్ఘకాలంగా విధులు నిర్వర్తించి ఉద్యోగ విరమణ చేసిన పోలీసు సిబ్బందిని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మంగళవారం కమిషనరేట్ కార్యాలయంలో సన్మానించారు. ఉద్యోగ విరమణ పొందిన వారిలో ఎస్సైలు ఉమాకాంత్, ఐలయ్య, ఏఆర్ ఎస్సై శ్రీనువాస్, కానిస్టేబుల్ పద్మారావులు ఉన్నారు. ఉద్యోగ నిర్వహణలో బాధ్యతగా విధులు నిర్వర్తించినందుకు గాను వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీలు రవి, సురేశ్‌కుమార్, ఏసీపీ అనంతయ్య, ఆర్ఐలు సతీష్, స్పర్జన్‌రాజు, శ్రీనువాస్, శ్రీధర్, ఆర్ఎస్సై శ్రావణ్, పదవి విరమణ చేసిన పోలీ సు అధికారుల కుటుంబసభ్యులు, బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్, రైల్వేస్టేషన్‌లో యాంటీ డ్రగ్స్ టీమ్ సోదాలు



హనుమకొండ బస్టాండ్‌లో తనిఖీ చేస్తోన్న పోలీసులు

వరంగల్ క్రైం, డిసెంబర్ 31 (ఆంధ్రజ్యోతి): న్యూఇయర్ వేడుకలను పురస్కరించుకొని వరంగల్ పోలీస్ కమిషనరేట్ యాంటీ డ్రగ్స్ టీం బృందం, డాగ్ స్క్వాడ్ బృందాలు స్థానిక పోలీసులతో కలిసి మంగళవారం హనుమకొండ బస్టాండ్‌తో పాటు కాజీపేట రైల్వేస్టేషన్‌లో సోదాలు నిర్వహించారు. అనుమానితులుగా కనిపించిన ప్రయాణికుల బ్యాగుల్లో తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో యాంటీ డ్రగ్ టీమ్ ఆర్ఐ శివకేశవులు, కాజీపేట, హనుమకొండ ఇన్స్‌పెక్టర్లు సుధాకర్ రెడ్డి, సతీష్, యాంటీ డ్రగ్స్ బృందం, డాగ్ స్క్వాడ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ స్మైల్‌ను విజయవంతం చేద్దాం

అదనపు డీసీపీ ఎం.రవి

హనుమకొండ కలెక్టరేట్, డిసెంబరు31(ఆంధ్రజ్యోతి): అన్ని శాఖల సమన్వయంతో ఆపరేషన్ స్మైల్ ను విజయవంతం చేద్దామని అదనపు డీసీపీ ఎం.రవి కోరారు. సుబేదారిలోని అనంత భవన్‌లో మంగళవారం పోలీసు కమిషనరేట్, ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో జనగామ, వరంగల్, హనుమకొండ జిల్లాలోని వివిధ శాఖల అధికారులతో, ఎన్జీవోలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అడిషినల్ డీసీపీ మాట్లాడుతూ.. 10 ఏళ్లుగా తప్పిపోయిన బాలలు వివిధ రకాల పిల్లలను చేరదీయడానికి ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమం దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్నామన్నారు. దానిలో భాగంగానే జనవరి 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో నిర్వహిస్తున్నామన్నారు. సీఐడీ డీఎస్పీ జితేందర్ మాట్లాడుతూ.. వివిధ ప్రభుత్వ శాఖలు వారి వారి విధులకు అనుగుణంగా సమన్వయంతో పూర్తి అంకితభావంతో పని చేయాలన్నారు. ఈ సమావేశంలో వరంగల్ చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ కె.వసుధ, హనుమకొండ చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మెంబర్ కె.దామోదర్, బాలల సంరక్షణ అధికారులు శ్రీదేవి, ప్రవీణ్‌కుమార్, రవికాంత్, ఎఫ్ఎంఎం సాంఘిక సేవా సంస్థ డైరెక్టర్ సిస్టర్ సహాయ, ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఎర్ర శ్రీకాంత్, చైల్డ్ అడ్వకసీ ఫోరం చైర్మన్ ఫాదర్ కోసి, వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాల్లోని తొమ్మిది పోలీసు డివిజన్‌ల నుంచి ఎస్సైలు, కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న అదనపు డీసీపీ రవి

కుల బహిష్కరణ చేసిన వారిపై చర్యలు తీసుకోండి

వరంగల్ క్రైం, డిసెంబర్ 31 (ఆంధ్రజ్యోతి) : కులబహిష్కరణ చేసి తమ ఇంటికి వచ్చే బంధువులను రానివ్వకుండా వేధింపులకు గురిచేస్తున్న పెద్ద మనుషులపై చర్యలు తీసుకోవాలని నెక్కొండ మండలం నాగారానికి చెందిన దారపు వెంకటేశ్ మంగళవారం వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝాకు ఫిర్యాదు చేశాడు. తమ ఇంటికి వచ్చే బంధువులకు జరిమానాలు విధిస్తూ గ్రామానికి చెందిన 14 మంది వ్యక్తులు భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

వడ్డెపల్లి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : దళిత ప్రధానోపాధ్యాయుడిపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలని దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్ డిమాండ్ చేశారు. మంగళవారం హనుమకొండలోని పబ్లిక్ గార్డెన్‌లో డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజక వర్గంలోని తుక్కుగూడ ప్రభుత్వ పాఠశాలలో దళిత ప్రధానోపాధ్యాయుడు రాములు పాఠాలు బోధిస్తున్న క్రమంలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి అయ్యప్ప మాలధారణలో ఉన్నాడని పేర్కొన్నారు. ఆ విద్యార్థికి ప్రధానోపాధ్యాయుడి కాలు తగిలిందనే సాకుతో అయ్యప్ప స్వాములు పాఠశాలలో ప్రవేశించి విద్యార్థి కాళ్లు మొక్కించడం హేయమైన చర్య అని అన్నారు. అయ్యప్ప స్వాముల ముసుగులో పథకం ప్రకారం దాడి చేసిన వారిపై చట్ట పరంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని చుంచు రాజేందర్ డిమాండ్ చేశారు. సమావేశంలో డీబీఎఫ్ జిల్లా కార్యదర్శి చుంచు నరేష్, నాయకులు రాము, మల్లేషం, రవి, రమేష్, సిద్ధార్థ , రాజు, కృష్ణ, శివ పాల్గొన్నారు.

బంగారం చోరీపై జీరో కేసు నమోదు

కాజీపేట, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ నుంచి దానాపూర్ వెళ్తున్న దానాపూర్ ఎక్స్‌ప్రెస్‌లో బంగారం చోరీ కేసులో కాజీపేట రైల్వే పోలీసులు జీరో కేసు నమోదు చేశారు. కాజీపేట రైల్వే సీఐ రామ్మూర్తి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నగరంలోని నయీంనగర్‌కు చెందిన పగాల ప్రశాంతి డిసెంబరు 26న దానాపూర్ వెళ్లేందుకు కాజీపేటలో రైల్వే స్టేషన్‌లో దానాపూర్ ఎక్స్‌ప్రెస్ రైలెక్కింది. రైలు వారణాసి స్టేషన్‌కు చేరుకున్నాక ప్రశాంతి మెడలో మూడు తులాల గోలుసు చోరీ జరిగింది. ప్రశాంతి తిరిగి డిసెంబరు 31న కాజీపేటకు చేరుకుని కాజీపేట రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు జీరో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే పోలీసులు తెలిపారు.

ప్లాటు కబ్జా చేస్తున్నవారిపై చర్య తీసుకోవాలి

హనుమకొండ కలెక్టరేట్, డిసెంబరు31(ఆంధ్రజ్యోతి): కానిస్టేబుల్ దేవర బక్కయ్య నుంచి తనకు ప్రాణహాని ఉందని, జిల్లా అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని బాధితుడు అనంతుల వెంకటేశ్వర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు 31వ డివిజన్ దీన్‌దయాల్‌నగర్‌కు చెందిన అనంతుల వెంకటేశ్వర్లు మంగళవారం తన ప్లాటు వద్ద మాట్లాడుతూ.. దీన్‌దయాల్‌నగర్‌కే చెందిన దేవర బక్కయ్య అనే కానిస్టేబుల్ ప్లాటు పక్కనే ఉన్న తన 203 గజాల ప్లాటును కబ్జా చేసేందుకు తనను బెదిరిస్తూ అక్రమ కేసులు పెట్టిస్తున్నాడన్నారు. బక్కయ్య అనుచరుడైన రాందాసు సంపత్ అనే వ్యక్తి పేరు మీద తప్పుడు దస్తావేజులు సృష్టించి తనను ప్లాటు మీదకు రాకుండా కొన్నేళ్లుగా వేధిస్తూ తప్పుడు కేసులు బనాయిస్తున్నాడన్నారు. ఈ క్రమంలో డిసెంబర్ 10న తన ప్లాటులో అక్రమంగా రాందాసు సంపత్ అనే వ్యక్తి చిన్న రేకుల షెడ్డు వేయగా తాను అడ్డుకుని తొలగించగా అక్రమ కేసు పెట్టారన్నారు. ఈ విషయంపై త్వరలో కలెక్టర్‌ను, పోలీస్ కమిషనర్‌ని కలిసి ఫిర్యాదు చేస్తానని వెంకటేశ్వర్లు తెలిపారు.

నాటకోత్సవాల ప్రోత్సాహకులకు కృతజ్ఞతలు

హసన్‌పర్తి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): పందిళ్ల శేఖర్‌బాబు స్మారక నాటకోత్సవాల నిర్వహణకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన ప్రతీ ఒక్కరికి రాష్ట్ర నాటక సమాజాల సమాఖ్య అధ్యక్షుడు ఆకుల సదానందం కృతజ్ఞతలు తెలిపారు. గ్రేటర్ 55వ డివిజన్ భీమారం వెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పౌరాణిక పద్య నాటక ప్రదర్శనలో తనదైన ము ద్ర వేసిన మహనీయుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి, తెలంగాణ, ఆంధ్ర ప్రాంతాలలో తన నటన వైవిధ్యంతో వేనోళ్ల పేరుగాంచిన పందిళ్ల శేఖర్‌బాబు స్మారక నాటకోత్సవాలు ప్రతీ సంవత్సరం నాటక సప్తాహ కమిటీ వారు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాలుగు రోజుల పాటు విజయవంతంగా నిర్వహించిన నాటకోత్సవాలకు విశేష ఆదరణ కనబర్చిన ప్రేక్షకులకు, నవచైతన్యానికి నాందిగా నిలిచిన కళాకారులకు సహకరించిన నిర్వాహకులకు, ఆలయ ప్రాంగణ కమిటీకి, కళాపోషకులకు, దాతలకు, ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

రైళ్లలో ఎక్సైజ్ పోలీసుల విస్తృత తనిఖీలు

వరంగల్ క్రైం, డిసెంబర్ 31 (ఆంధ్రజ్యోతి) : న్యూ ఇయర్ వేడుకలను పురస్కరించుకొని మంగళవారం పలు రైళ్లలో ఎక్సైజ్ పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఇతర రాష్ట్రాల నుంచే రైళ్లలో తరలించే ఎన్‌డీపీఎల్ మద్యంను పట్టుకునేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా తెలంగాణ ఎక్స్‌ప్రెస్, దక్షిణ్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు, వరంగల్, కాజీపేట రైల్వే స్టేష న్లల్లో అనుమానితులను, బ్యాగు లను క్షుణ్ణంగా తనిఖీ చేసినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ చంద్ర శేఖర్ తెలిపారు. ఈ సోదాల్లో ఎలాంటి మద్యం లభ్యం కాలేదన్నారు.


రైలులో తనిఖీ చేస్తోన్న ఎక్సైజ్ సిబ్బంది

విద్యతోనే జీవన వికాసం

హసన్‌పర్తి, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు విద్యతోనే జీవన వికాసం సాధ్యమని సీడబ్ల్యూసీ సభ్యుడు కజాంపురం దామోదర్ అన్నారు. గ్రేటర్ 65వ డివిజన్ పరిధి దేవన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన సంస్కార వికాస శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతీ విద్యార్థి చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ పూర్తిగా విద్యపైనే దృష్టి సారించి చదువులో రాణించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించే విద్యార్థులు చదువుతో పాటు వినయం, విధేయత, క్రమశిక్షణ, సంస్కారం అలవర్చుకుని సామాజిక అంశాలపై పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి తేరాల యుగంధర్ మాట్లాడుతూ.. చదువుకునే ప్రతీ విద్యార్థి సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలన్నారు. ముఖ్యంగా సైబర్ నేరాలకు బలికాకుండా అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు మహ్మద్ అజీముద్దీన్, విజయలక్ష్మీ, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కజాంపురం దామోదర్

ఆరంభం హుషారుగా..

కొత్త ఆశలతో.. కొత్త ఊహలతో మళ్లీ కొత్త సంవత్సరం వచ్చేస్తోంది. 2025 హుషారుగా సాగాలంటే ఈ కింది పనులన్నీ మీరు చేయాల్సిందే!

ఎక్కువ చదవండి..

ప్రస్తుతం మొబైల్స్ మన జీవితాలను శాసిస్తున్నాయి. ఒక సారి మొబైల్ చూడటం మొదలుపెడితే ఆగటమే ఉండదు. సోషల్ మీడియా మన ఆలోచనలను కమ్మేస్తుంది. అసలు ఆలోచించికుండా చేసేస్తుంది. అందుకే మొబైల్స్ చూసే సమయాన్ని తగ్గించి.. ఆ సమయంలో నచ్చిన పుస్తకాలను చదవమని మానసిక నిపుణులు సలహా ఇస్తున్నారు. పుస్తకాలు చదవటం వల్ల మన ఆలోచనలలో స్పష్టత వస్తుంది. ఒక వేళ పుస్తకాలు చదివే అలవాటు లేకపోతే - ఆడియో పుస్తకాలు అందుబాటులో ఉంటున్నాయి. వాటిని శ్రద్ధగా విన్నా బావుంటుంది.



చిన్న పొదుపు

వారానికి వంద రూపాయలు దాచగలిగితే- ఏడాదికి 5200 రూపాయలు అవుతుంది. దానిని మంచి రిటర్న్స్ ఇచ్చే మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబడి పెడితే? అతి తక్కువ సమయంలో రెండు రెట్లు అవుతుంది. ఇది ఒక చిన్న ఉదాహరణే కావచ్చు.. చిన్నగా పొదుపు చేయటం మొదలుపెడితే - దీర్ఘకాలంలో మంచి ఫలితాలు ఇస్తాయి. చాలా మంది పొదుపు చేయటమంటే ఒకే సారి వేలో, లక్షలో జమపరుచుకోవటం అనుకుంటారు. అలా కాకుండా చిన్న చిన్న మొత్తాలను పొదుపు చేస్తే చాలా మంది ఫలితాలు ఉంటాయి. మనం చేసే పొదుపును ట్రాక్ చేసే అప్లికేషన్లు కూడా అనేకం వచ్చేసాయి. ఆర్థిక వ్యవహారాలపై కొద్దిగా అవగాహన పెంచుకుంటే భవిష్యత్తులో ఎంతో ప్రయోజనం ఉంటుంది.

ధ్యానం..

రోజుకు ఒక అరగంట ధ్యానం చేయగలిగితే అద్భుతమైన ఫలితాలు లభిస్తాయి. యోగా, ధ్యానం ఒకటే అనుకొనేవారు ఇంకా ఉన్నారు. వారందరూ తెలుసుకోవాల్సినది ఒకటే. యోగా శరీరానికి సంబంధించినది. ధ్యానం మన మనసుకు సంబంధించినది. ఈ రెండు కలిపి చేయటం వల్ల ఇటు శరీరం అటు మనసు చురుకుగా పనిచేస్తాయి. ఆలోచనా విధానం కూడా మారుతుంది.

వ్యసనాలు మానండి..

ప్రపంచంలో అత్యంత సులభంగా చెప్పగలిగినది.. ఆచరణలో అత్యంత కఠినమైనది ఇదే! ఒకసారి అలవాటు అయిన తర్వాత సిగరెట్లు, ఆల్కాహాల్ వంటివి మానటం కష్టం. కానీ ఆ అలవాటును నెమ్మదిగా నియంత్రించుకోవచ్చు. ఉదాహరణకు ఒక నెల రోజులు పూర్తిగా సిగరెట్లు మానేస్తానని పెట్టుకుంటే- పెద్దగా ఇబ్బంది అనిపించదు. అదే విధంగా ప్రతి వారం తాగే మద్యం కోటాను సగానికి తగ్గించుకోవచ్చు. ఇలా చేయటం వల్ల అనుకూల ఫలితాలు వస్తున్న కొలది.. వ్యవసనాలు పూర్తిగా మానేందుకు అవకాశం చిక్కుతుంది.

కొత్త భాష నేర్చుకోండి..

కొత్త భాషలను నేర్చుకోవటం వల్ల మన ఆలోచనా పరిధి పెరుగుతుంది. కొత్త ప్రాంతాలకు వెళ్లినప్పుడు వారితో సంభాషించగలుగుతాం.. వారి సంస్కృతి సంప్రదాయాలు తెలుసుకోగలుగుతాం.. అంతకు మంచి.. ఆ భాషలో ఉన్న సాహిత్యాన్ని చదవగలుగుతాం. ఇదంతా మన మేధో విస్తృతిని పెంచుతుంది. అంతే కాకుండా ఈ ఆధునిక యుగంలో భాషలు నేర్చుకోవటం చాలా సులభం కూడా. ప్రస్తుతం ఇంటర్నెట్‌లో అనేక యాప్‌లు అందుబాటులో ఉన్నాయి. వాటి ద్వారా కొత్త భాషలు నేర్చుకోవటం సులభమనే చెప్పాలి.

విజన్ బోర్డు

2025లో ఏం చేయాలనుకుంటున్నామో ఆలోచించి.. వాటన్నింటిని ఒక చోట పెడితే దానిని విజన్ బోర్డు అంటారు. దీనిలో మనం చేయాలనుకుంటున్న ప్రయాణాలు కావచ్చు.. చేరుకోవాలనుకుంటున్న లక్ష్యాలు కావచ్చు.. ఊహలు కావచ్చు.. ఇలా మనకు సంబంధించిన వాటన్నింటినీ కలిపినదే ఈ విజన్ బోర్డు.



వెనీలా కేక్... మీ కోసం

కొత్త సంవత్సరం మొదటి రోజున కేక్ కావాలని పిల్లలు అడుగుతూ ఉంటారు. బేకరీల్లో కొని తెచ్చే కేక్ పిల్లల ఆరోగ్యాన్ని పాడు చేసే ప్రమాదం ఉంది. అలాకాకుండా పిల్లలు ఇష్టపడే కేక్‌ని ఇంట్లోనే తయారుచేస్తే వారి ఆనందానికి అవధులు ఉండవు. ఓవెన్ అందుబాటులో లేకపోయినా కుక్కర్‌లోనే రుచికరమైన వెనీలా కేక్ తయారు చేసుకోవచ్చు.

తయారీ విధానం

- ముందుగా ఒక గిన్నెలో రెండు కప్పుల చక్కెర పొడి, ఒక కప్పు వెన్న, రెండు చెంచాల బేకింగ్ సోడా, అర చెంచా ఉప్పు, రెండు గుడ్లు పగులగొట్టి వేసి బాగా కలపాలి. తరవాత ఇందులో మూడు కప్పుల మైదా పిండి, రెండు చెంచాల వెనీలా ఎసెన్స్ వేసి కలపాలి. రెండు కప్పుల పాలను కొద్ది కొద్దిగా వేస్తూ పిండి మిశ్రమాన్ని వేగంగా కలపాలి. పిండిలో ఉండలు రాకుండా చూసుకోవాలి.
- కుక్కర్‌లో పెట్టడానికి అనువుగా ఉన్న మందపాటి గుండ్రని గిన్నెను తీసుకుని అందులో ఒక చెంచా మైదా పిండి వేసి గిన్నె అంతా అంటుకునేలా తిప్పాలి. పిండి మిగిలితే గిన్నె వంచేయాలి. ఈ గిన్నెలో ముందుగా తయారుచేసుకున్న కేక్ పిండి మిశ్రమాన్ని వేయాలి. గిన్నెని కుక్కర్‌లో పెట్టి సన్నని మంట మీద 45 నిమిషాలు ఉడికించాలి. కుక్కర్‌కు విజిల్ పెట్టకూడదు.
- సమయం పూర్తయిన తరవాత కుక్కర్‌లో నుంచి గిన్నెను బయటికి తీసి పది నిమిషాలు చల్లారనివ్వాలి. గిన్నె గోడల నుంచి కేక్ విడిపోయేలా చాకును గిన్నె చుట్టూ ఒకసారి తిప్పాలి. ఒక పళ్లెంలోకి గిన్నెను బోర్లించి పైన తడితే కేక్ గిన్నె నుంచి వచ్చేస్తుంది.
- కేక్ పైన చెర్రీలు అలంకరించి చాక్లెట్ క్రీమ్ లేదా బట్టర్ క్రీమ్‌తో హ్యాపీ న్యూ ఇయర్ 2025 అని రాసేస్తే వెనీలా కేక్ సిద్ధం అయిపోతుంది.

ఇంటిని అందంగా అలంకరిద్దాం!

నూతన సంవత్సరం వచ్చేసింది. శుభాకాంక్షలు చెప్పడానికి స్నేహితులు, బంధువులు మన ఇంటికి వస్తుంటారు. ఇంటిని అందంగా శోభాయమానంగా అమర్చుకుంటే అందరితో కలిసి సంతోషంగా గడిపేయవచ్చు. కొత్త ఏడాదిని స్వాగతిస్తూ ఇంటిని ఎలా ముస్తాబు చేసుకోవాలో తెలుసుకుందాం!



ఇల్లు శుభ్రం: ఇల్లు పరిశుభ్రంగా ఉంటేనే ఏ అలంకరణ చేసినా ఇంటి అందం ఇనుమడిస్తుంది. రోజూ చేసేదానికంటే కొంచెం ఎక్కువ శ్రద్ధ పెట్టి ఇంటిని శుభ్రం చేయండి. పాత కర్టెన్లు, బెడ్‌షీట్లు, సోఫా కవర్లు మార్చి కొత్తవి వేయండి. అలాగే పనికి రాని వస్తువులను తీసివేయండి. మీ అభిరుచిని తెలిపే పుస్తకాలను చక్కగా సర్దండి. అందమైన గాజు వస్తువులను పొందికగా అమర్చండి. వంటిల్లు, బెడ్ రూమ్, స్టడీరూమ్, లివింగ్ రూమ్, హాల్ అన్నింటిని దుమ్ము, ధూళి లేకుండా శుభ్రం చేసి అక్కడి వస్తువులను అందంగా అమర్చండి. జలపాతాల సవ్వడి, పక్షుల అరుపులు వినిపిస్తూ అందమైన చేపలు తిరుగాడే అక్వేరియాన్ని హాల్లో అమర్చండి. ఇది పిల్లలను, పెద్దలను ఆకర్షిస్తుంది. మనీ ప్లాంట్, స్నేక్ ప్లాంట్ లాంటి మొక్కల కుండీలను కూడా గది మూలల్లో ఉంచండి.

ముగ్గులు: రంగురంగుల ముగ్గులు ఇంటి శోభని పెంచుతాయి. రంగులతోనే కాకుండా రకరకాల పూల రెక్కలతో చిన్న చిన్న ముగ్గులను అక్కడక్కడా పెడితే ఇంటికి మంచి కళ వస్తుంది. ఇంటి గుమ్మం, దేవుని గది. బెడ్ రూమ్‌ల ముందు ముగ్గులు వేస్తే బాగుంటుంది. హాల్లో సోఫా ఎదుట కొంచెం పెద్ద ముగ్గు ఉండేలా చూసుకోవాలి.

బెలూన్స్: హాల్, లివింగ్ రూమ్, స్టడీ రూమ్‌లలో రంగురంగుల బెలూన్లను అమర్చండి. వాటి మీద 0, 2, 5 అంకెలు ఉండేలా చూడండి. ఇవి ఇంటిని ప్రత్యేకంగా కనిపించేలా చేస్తాయి.

ఫెయిరీ లైట్స్: బాల్కనీ, గార్డెన్ ఏరియాలను ఫెయిరీ లైట్లతో అలంకరించండి. ఇవి సాయంత్రం వేళ అందంగా అహ్లాదకరంగా కనిపిస్తాయి. గార్డెన్ మధ్యలో టేబుల్.... చుట్టూ కుర్చీలు వేస్తే అతిథులు కూర్చోవడానికి ఆసక్తి చూపిస్తారు. ఇంటి ముందు, బాల్కనీలో కూడా కుర్చీలు వేసి ఉంచండి. ఇంటి పరిసరాల్లో నియాన్ లైట్లు ఏర్పాటు చేస్తే అహ్లాదకరంగా ఉంటుంది.

గోడల అలంకరణ: గోడల మీద అందమైన ఫొటో ఫ్రేమ్‌లు, చక్కని పెయింటింగ్‌లు, పిల్లలు-స్నేహితులతో కలిసి దిగిన ఫొటోలు ఏర్పాటు చేస్తే చూడడానికి ఆకర్షణీయంగా ఉంటుంది. చిన్న కథలు, సరదా వాక్యాలు రాసిన రంగుల కాగితాలు అక్కడక్కడా అంటిస్తే అతిథులను కట్టిపడేస్తాయి.

కొవ్వొత్తులు: రకరకాల కొవ్వొత్తులు ప్రస్తుతం అందుబాటులో ఉంటున్నాయి. కొవ్వొత్తుల వెలుతురులో ఇల్లు మెరిసిపోతుంది. మంచి సువాసనలు వెదజల్లే కొవ్వొత్తులు కూడా లభ్యమవుతున్నాయి. వీటిని టీవీకి ఇరుపక్కలా, టీపాయ్ మీద, సోఫా పక్కన ఏర్పాటు చేస్తే ఇల్లు సువాసన భరితంగా కళకళలాడుతుంది. వేలాడే లాంతర్లు, చిన్న దీపాలతో కూడా ఇల్లు అలంకరించుకోవచ్చు.

ప్రేరణ

సంకల్ప బలం... సేవా పథం

కలెక్టరు హోదాలో వీలైనంత సమాజ సేవ చేయొచ్చనే సంకల్పంతో సివిల్స్‌కు సిద్ధపడిన ఒకమ్మాయి, ఆ ప్రయత్నాలు విఫలమవడంతో అక్కడితో ఆగిపోలేదు. 'ఎర్త్ హీరోస్ ఫౌండేషన్'ను స్థాపించి, ప్రత్యామ్నాయ మార్గంలో సమాజానికి సాయపడుతోంది. వినూత్నమైన ప్రాజెక్టుల ద్వారా తన సేవా సంకల్పాన్ని నెరవేర్చుకుంటున్న హాసినిరెడ్డి రావులతో 'నవ్య' మాటామంతీ.



చిన్నప్పటి నుంచే సమాజ సేవ పట్ల ఆసక్తి ఏర్పడింది. కానీ ఎలా చేయాలో, ఎక్కడి నుంచి మొదలుపెట్టాలో తెలియని అయోమయం. ఊహ తెలిశాక, ఉన్నతమైన హోదాలో ఉన్నప్పుడే సమాజానికి ఉపయోగకరమైన పనులు చేయగలుగుతామనే ఆలోచన స్ఫురించింది. అందుకోసం కలెక్టరుగా ఎదగాలనే పట్టుదలను పెంచుకుని, బిటెక్ పూర్తి చేసి, సివిల్స్‌కు సిద్ధపడడం మొదలుపెట్టాను. అందుకోసం ఢిల్లీ వెళ్లి కోచింగ్ తీసుకుని, పరీక్షలు రాసి మెయిన్స్ వరకూ చేరుకోగలిగినా, అక్కడ విఫలమవుతూ వచ్చాను. అలాగని నేను కుంగిపోలేదు. సమాజసేవే లక్ష్యమైనప్పుడు యుపిఎస్సీ ద్వారా కాకపోయినా, బదులుగా ప్రత్యామ్నాయ మార్గాల్లో కూడా అదే లక్ష్యాన్ని అందుకోవచ్చనే ఆలోచనతో 2019లో ఎర్త్ హీరోస్‌ను స్థాపించాను. కానీ దురదృష్టవశాత్తూ కొవిడ్ వల్ల సంస్థ కార్యకలాపాలన్నిటికీ అవాంతరం ఏర్పడింది. దాంతో కాస్త ఆలస్యంగా, సుస్థిరమైన అభివృద్ధి లక్ష్యంగా, 2024 ప్రారంభంలో, విస్తృతమైన పది లక్ష్యాలతో సంస్థ కార్యకలాపాలను చేపట్టడం మొదలుపెట్టాను. వీటిలో విద్య, పేదరికం, మహిళా సాధికారత, మాదకద్రవ్యాలు... ఇలా పది భిన్నమైన లక్ష్యాలను ఏర్పరుచుకుని భిన్నమైన అవగాహనా కార్యక్రమాలను మొదలుపెట్టాను.

> "మాది మహబూబ్‌నగర్, వనపర్తి దగ్గరి కానేపల్లి. నేను అక్కడే పుట్టి, పెరిగాను. చదువు కోసం మొదట వనపర్తికీ, తర్వాత హైదరాబాద్‌కూ మారిపోయాను. అమ్మ విజయలక్ష్మి ప్రభుత్వ టీచర్. నాన్న చంద్రశేఖర రెడ్డి, వ్యవసాయ పనులు చూసుకుంటూ ఉంటారు. అమ్మా, నాన్న వనపర్తిలోనే ఉంటారు. సమాజ సేవ నేను చేయడమే కాదు, సమాజానికి ఉపయోగపడే కొత్త ఆలోచనతో ఎవరు నన్ను సంప్రతించినా వాళ్లకొక వేదికను అందించి ప్రోత్సహిస్తాను. ఎర్త్ హీరోస్ సంస్థకు నేను ఛైర్ పర్సన్‌గా వ్యవహరిస్తున్నాను. నాతో పాటు నా స్నేహితులు నరేష్ కుమార్ జాజుల, అమల్ కిరణ్ కొ ఫౌండర్లుగా వ్యవహరిస్తున్నారు. మేం ముగ్గురం కలిసి ఎర్త్ హీరోస్‌ను స్థాపించాం."

వినూత్నమైన కార్యక్రమాలతో...

ఇప్పటివరకూ విజయవాడ ఇస్కాన్‌తో కలిసి మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా, వాటి వాడకం వల్ల తలెత్తే దుష్ప్రభావాలకు సంబంధించి అవగాహనా కార్యక్రమాలు, సైక్లాథాన్స్, వాకథాన్స్ ఏర్పాటు చేశాను. నారీ శక్తిలో భాగంగా బడుల్లో ఆడపిల్లల నుంచి అనుభవాలను సేకరించి, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ వ్యత్యాసాలను నేర్పించడంతో పాటు, లైంగిక దోపిడీ సంబంధిత అవగాహనా కార్యకలాపాలనూ చేపట్టాం. అలాగే అనాథ శరణాలయాలను సందర్శించి సెషన్లను ఏర్పాటు చేసి, పరీక్షలు నిర్వహించి లైంగిక దోపిడీల పట్ల అవగాహన పెంచాను. అలాగే జెనరిక్ మెడిసిన్‌కు ప్రచారం కల్పించే ప్రధానమంత్రి జనౌషధి పరియోజన పట్ల అవగాహన కల్పించడంలో భాగంగా నల్గొండ దగ్గరి గిరిజన దుకాణాలకు వెళ్లి, సర్వేలు చేపట్టాం. అక్కడి గిరిజనులకు ప్రాథమిక ఔషధాల పట్ల ఎలాంటి అవగాహన లేకపోవడం నేను గమనించాను. సర్వేలో వెల్లడైన వాస్తవాల ఆధారంగా స్థానిక ప్రభుత్వాధికారుల అనుమతితో గిరిజనులకు ఆరోగ్య పరీక్షలు చేపట్టి, ప్రాథమిక ఆరోగ్యం పట్ల అవగాహన పెంచే ఆలోచన ఉంది. అలాగే పూర్తి స్థాయిలో ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేయాలనే ఆలోచన కూడా ఉంది.




భవిష్యత్తు ప్రాజెక్టులు..

ప్రస్తుతం సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయి. ఎంతోమంది ప్రజలు, సైబర్ నేరగాళ్లకు బలవుతూ లక్షల్లో డబ్బు పోగొట్టుకుంటున్నారు. కాబట్టి ఈ నేరాల పట్ల అవగాహన కల్పించాలనే లక్ష్యంతో, తెలంగాణా ప్రభుత్వం, సైబర్ డిపార్ట్‌మెంట్‌ను సంప్రతించి, లైవ్ ఈవెంట్స్‌ను నెలకొల్పాలనే ఆలోచనలో ఉన్నాను. దీన్లో సైబర్ ముప్పు నుంచి రక్షణ పొందే మెలకువలను నేర్పే వర్క్‌షాప్స్ కూడా ఉంటాయి. అలాగే పని ప్రదేశాల్లో ఎదురయ్యే ఒత్తిడులను తట్టుకోలేక ఆత్మహత్యలకు పాల్పడే వారి సంఖ్య కూడా ఇటీవల పెరిగింది. అంతర్జాతీయ సూత్రాల ఆధారంగా ఒక మోడల్‌ను రూపొందించి, ఎమోషనల్ ఇంటెలిజెన్స్ సహాయంతో ఒత్తిడులను సమర్థంగా ఎదుర్కోగలిగే మెలకువలను పెంపొందించాలనే ఆలోచన కూడా ఉంది.

• గోగుమళ్ల కవిత

ముత్యాల ముగ్గు



11 చుక్కలు, 6 వచ్చేవరకు, సంధుచుక్క



ఎ.స్వాతి
తెనాలి

మాకు పంపండి

మీరు ముగ్గులు బాగా వేస్తారా? అయితే చక్కటి చుక్కల ముగ్గులను కాగితంపై గీసి, రంగులు వేసి మాకు పంపండి! ఎన్ని చుక్కలు, ఎన్ని వరసలు లాంటి వివరాలను కూడా రాయండి. మీ పేరు, మీ పూర్తి అడ్రస్సు, పాస్‌పోర్టు సైజు ఫొటో పంపడం తప్పనిసరి.

మా చిరునామా...
నవ్య, ముత్యాలముగ్గు, ఆంధ్రజ్యోతి కార్యాలయం, రోడ్ నెంబర్ 70, హుడా హైట్స్, జూబ్లీ హిల్స్, హైదరాబాద్-500033.

ఈ-మెయిల్: features@andhrajyothy.com

ఫ్యాషన్

కొత్త వెలుగులతో...



ధగధగలాడే జిలుగు వెలుగులతో మెరిసిపోవాలంటే షిమ్మర్ డ్రస్సులు ఎంచుకోవాలి. కొత్త సంవత్సర వేడుకల్లో మిరుమిట్లుగొలిపే లైట్లు వెలుగుల్లో, తళతళలాడే డ్రస్సులతో వెలిగిపోవడం కోసం ఈ దుస్తులను ఎంచుకోండి.

బంగారం, వెండి వర్ణాల్లో...

బంగారపు మెరుపులు విరజిమ్మే గోల్డ్, సిల్వర్ లైక్రా డ్రస్సులున్నాయి. కొత్త సంవత్సర వేడుకల కోసం సెక్విన్ వర్క్‌లు కలిగిన లైక్రా గౌన్లు బాగుంటాయి. ఎలాస్టిక్‌లా సాగుతూ, మెత్తగా, ఒంటికి హత్తుకుపోయేలా ఉండే ప్లెయిన్ లైక్రా డ్రస్‌ను మెరుపులీనే హ్యాండ్ బ్యాగ్, శాండిల్స్‌తో మ్యాచ్ చేస్తే ఆకర్షణీయంగా కనిపిస్తారు.

భిన్నమైన వస్త్రాలతో...

మెటాలిక్ దారాలు, సెక్విన్లతో పాటు లేమ్, ల్యూరెక్స్ లాంటి వేర్వేరు మెరుపులీనే షిమ్మర్ వస్త్రాలు ఇప్పుడు అందుబాటులోకొచ్చాయి. ఈ వస్త్రాలు కలిగి ఉండే వైవిధ్యం వల్ల ప్రత్యేకించి సాయంకాలపు వేడుకల్లో ధరించడానికి తగిన దుస్తుల కోసం వీటిని ఎంచుకుంటూ ఉంటారు. షిమ్మర్ బాడీకాన్ డ్రస్, మ్యాక్సీ, మిడి డ్రస్‌లతో పాటు, సెక్విన్, కాక్‌టెయిల్ డ్రస్సులు న్యూ ఇయర్ వేడుకలకు చక్కగా సూటవుతాయి.









ఆంధ్రజ్యోతి
చిత్రజ్యోతి
SINCE 1965
హైదరాబాద్ ● బుధవారం 1 జనవరి 2025

అభిమానుల సమక్షంలో...



వైవిధ్యభరితమైన చిత్రాలతో ప్రేక్షకులను అలరిస్తూ, వరుస విజయాలతో దూసుకుపోతున్న నందమూరి బాలకృష్ణ ఈ సంక్రాంతికి మరో విభిన్న కథాచిత్రం 'డాకూ మహరాజ్'తో ప్రేక్షకులను అలరించనున్నారు. ఇంతకుముందెన్నడూ చూడని సరికొత్త అవతారంతో బాలకృష్ణ కనిపించే ఈ చిత్రానికి బాబీ కొల్లి దర్శకుడు. ఇప్పటివరకూ విడుదలైన గ్లింప్స్, టైటిల్ టీజర్ సినిమా మీద అంచనాలు పెంచగా, ఇప్పుడు ట్రైలర్ కోసం అంతా ఎదురు చూస్తున్నారు. గురువారం మధ్యాహ్నం మూడు గంటలకు హైదరాబాద్‌లోని జేఆర్‌సీ ఆడిటోరియంలో అభిమానుల సమక్షంలో ట్రైలర్‌ను విడుదల చేయనున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన 'డాకూ మహరాజ్' ఈ నెల 12న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది.

మీరు నేర్పాల్సిన అవసరం లేదు



పెద్దలను ఎలా గౌరవించాలో మీరు మాకు నేర్పాల్సిన అవసరం లేదు, మీ కన్నా మేము ఎక్కువగా బోనీకపూర్‌ను గౌరవిస్తాం అని బాలీవుడ్ విశ్లేషకుడు సుమిత్ కడేల్‌కు టాలీవుడ్ నిర్మాత నాగవంశీ బదులిచ్చారు. ఓ మీడియా సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న బాలీవుడ్ నిర్మాత బోనీకపూర్, నాగవంశీ మధ్య వాడి వేడీ చర్చ నడిచింది. బాలీవుడ్ సినిమా ఇంకా బాంద్రా, జూహూ దగ్గరే ఆగిపోయిందనీ, మూస ధోరణిలో ఇరుక్కుపోయిన హిందీ పరిశ్రమకు దక్షిణాది దర్శకులే కొత్త దారులు చూపుతున్నారన్న నాగవంశీ వ్యాఖ్యలను బోనీకపూర్ అంగీకరించలేదు. కొత్తగా ప్రయోగాలు చేయడం బాలీవుడ్‌లో ఎప్పట్నుంచో ఉన్నదేననీ, ఇప్పుడు కూడా అది కొనసాగుతోందని ఆయన సమర్థించుకునే ప్రయత్నం చేశారు. హిందీ బెల్ట్‌లో 'పుష్ప 2' తొలి రోజు వసూళ్లు చూసి బాలీవుడ్‌కు నిద్రపట్టలేదేమో అంటూ నాగవంశీ ఎత్తిపొడిచారు. ఈ వీడియో వైరల్ అవడంతో బాలీవుడ్ అభిమానులు నాగవంశీని తప్పుపడుతున్నారు. బోనీకపూర్ పట్ల నాగవంశీ ప్రవర్తన అమర్యాదరకంగా ఉందంటూ సుమిత్ కడేల్ ట్వీట్ చేశారు. మీ అభిప్రాయాన్ని మరింత హుందాగా వ్యక్తం చేసి ఉండొచ్చు, విమర్శ మంచిదే కానీ, అమర్యాదకర ప్రవర్తన ఆమోదయోగ్యం కాదు, అహంకారం పతనానికి దారి తీస్తుందని సుమిత్ కడేల్ చేసిన ట్వీట్‌కు నాగవంశీ బదులిచ్చారు.



సీఎంతో భేటీ చాటుమాటు వ్యవహారం కాదు

- మీ రాజకీయాల కోసం చిత్రపరిశ్రమను వాడుకోవద్దు
- కేటీఆర్‌కు దిల్‌రాజు హితవు

అనవసర వివాదాల్లోకి తెలుగు చిత్ర పరిశ్రమను లాగి, లేనిపోని రాజకీయాలను ఆపాదించొద్దు, రాజకీయ దాడి, ప్రతి దాడులకు దయచేసి పరిశ్రమను వాడుకోవద్దు అని ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, నిర్మాత దిల్‌రాజు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు విజ్ఞప్తి చేశారు. సమస్యల నుంచి ప్రజల దృష్టి మరల్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పరిశ్రమను లక్ష్యంగా మార్చుకున్నారనీ, సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనను వాడుకొని సినిమావాళ్లతో సెటిల్‌మెంట్ చేసుకొని ఇప్పుడు సైలెంట్ అయ్యారని మీడియా చిట్‌చాట్‌లో కేటీఆర్ ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఆయన వ్యాఖ్యలను ఖండిస్తూ దిల్‌రాజు సోషల్ మీడియా ద్వారా ఒక ప్రకటన విడుదల చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో జరిగిన తెలుగు చలనచిత్ర పరిశ్రమ సమావేశంపై మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలు బాధాకరం అన్నారు. ఇదేమీ ఒకరిద్దరితో చాటుమాటున జరిగిన వ్యవహారం కాదని స్పష్టం చేశారు. తెలుగు చిత్ర పరిశ్రమ బాగోగుల గురించి, స్నేహ పూర్వక వాతావరణంలో ఎలాంటి దాపరికాలు లేకుండా జరిగిన ఈ సమావేశంతో తెలుగు చిత్ర పరిశ్రమ చాలా సంతృప్తిగా ఉందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి పయనంలో తెలుగు చిత్ర పరిశ్రమ భాగస్వామ్యాన్ని సీఎం గుర్తించారు, రాష్ట్రాభివృద్ధి, సామాజిక సంక్షేమానికి, మా వంతు బాధ్యతగా తగిన సహకారం అందజేయాలని కోరారని తెలిపారు. హైదరాబాద్‌ను గ్లోబల్ ఎంటర్‌టైన్‌మెంట్ హబ్‌గా తీర్చిదిద్దాలనే సీఎం బలమైన సంకల్పాన్ని తెలుగు చిత్ర పరిశ్రమగా ప్రతినిధులుగా మేమంతా స్వాగతించాం అని పేర్కొన్నారు. లక్షలాది మందికి జీవనోపాధి కల్పిస్తున్న తెలుగు చిత్ర పరిశ్రమకు అన్ని ప్రభుత్వాల సహకారం, ప్రజలందరి ప్రోత్సాహం ఉంటుందని ఆకాంక్షించారు.


కొత్త ఏడాది కొత్త ప్రాజెక్ట్స్

ఒకప్పుడు తెలుగు హీరోల క్రేజ్ కేవలం తెలుగు రాష్ట్రాలకే పరిమితమయ్యేది. కానీ, ఈ దశాబ్ద కాలంలో టాలీవుడ్ టాప్ హీరోల క్రేజ్ అమాంతం పెరిగిపోయి పాన్‌ఇండియా స్టార్స్‌గా ఎదిగారు. ఇప్పుడు వారి సినిమాల కోసం దేశవ్యాప్తంగా ఉన్న సినీ అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. కొత్త సంవత్సరంలో మన హీరోలు చేసే సినిమాలపై ఓ లుక్కేద్దాం.



'బాహుబలి' సిరీస్‌తో దేశవ్యాప్తంగా అభిమానుల్ని సంపాదించుకున్నారు ప్రభాస్. ఆయన తర్వాత చేసిన సినిమాలన్నీ పాన్‌ఇండియా స్థాయిలోనే విడుదలయ్యాయి. 'సలార్', 'కల్కి 2898 ఏ.డీ' చిత్రాలతో వరుస హిట్‌లు కొట్టారు ప్రభాస్. ప్రస్తుతం ఆ సినిమాల సీక్వెల్స్‌తో పాటు హారర్ థ్రిల్లర్ 'రాజాసాబ్', 'స్పిరిట్', 'ఫౌజీ' (వర్కింగ్ టైటిల్) చిత్రాలతో బిజీగా ఉన్నారాయన. కొత్త ఏడాదిలో 'రాజాసాబ్' చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా ప్రేక్షకులను భయపెట్టడం ఖాయమని మేకర్స్ తెలిపారు. 'ఫౌజీ' చిత్రీకరణ దశలో ఉంది. సందీప్‌రెడ్డి వంగా తెరకెక్కించే 'స్పిరిట్' త్వరలోనే పట్టాలెక్కనుంది.

సంక్రాంతి బరిలో



'రంగస్థలం' సినిమాతో జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నారు రామ్‌చరణ్. ఆ తర్వాత నటించిన 'ఆర్ఆర్ఆర్' ఆయనని గ్లోబల్ స్టార్‌ని చేసింది. కొత్త ఏడాదిలో సంక్రాంతి సందర్భంగా ఈ నెల 10న 'గేమ్‌ఛేంజర్' సినిమాతో వస్తున్నారు చరణ్. అలాగే, దర్శకుడు బుచ్చిబాబు సానా దర్శకత్వంలో ఆయన నటిస్తున్న 'ఆర్‌సీ 16' షూటింగ్ ఇటీవలే ప్రారంభమైంది. దర్శకుడు సుకుమార్‌తో చేయబోయే సినిమా ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ దశలో ఉంది.




యుద్ధరంగంలో దేవర

'టెంపర్' నుంచి ఇటీవలే విడుదలైన 'దేవర' వరకు వరుస హిట్స్‌తో దూసుకుపోతున్నారు ఎన్టీఆర్. 'ఆర్ఆర్ఆర్', 'దేవర' సినిమాలతో నార్త్‌బెల్ట్‌లోనూ మంచి క్రేజ్‌ను తెచ్చుకున్నారాయన. ఎన్టీఆర్ ప్రస్తుతం బాలీవుడ్‌లో 'వార్ 2' చిత్రంలో నటిస్తున్నారు. ఈ సినిమా ఆగస్టు 14న విడుదల కానుంది. ఇటీవలే ప్రశాంత్ నీల్‌తో 'ఎన్టీఆర్ 31' సినిమాను కూడా మొదలుపెట్టారు. ప్రస్తుతం అది షూటింగ్ దశలో ఉంది. ఈ సినిమాల తర్వాత 'దేవర 2' చేయనున్నట్లు టాక్.

త్రివిక్రమ్‌తో నాలుగోసారి



'అలవైకుంఠపురం', 'పుష్ప', 'పుష్ప 2' సినిమాలతో హ్యాట్రిక్ హిట్లు కొట్టారు అల్లు అర్జున్. 'పుష్ప'తో ఉత్తరాది ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకున్నారు ఆయన. ఈ సినిమాకు కొనసాగింపుగా తెరకెక్కిన 'పుష్ప 2' బాలీవుడ్‌లో ఖాన్ త్రయంకు కూడా సాధ్యం కాని రేంజ్‌లో రికార్డులు సృష్టించింది. ప్రస్తుతం త్రివిక్రమ్‌తో ఓ సినిమా చేస్తున్నారు అర్జున్. వీరిద్దరి కలయికలో వచ్చిన మూడు చిత్రాలు హిట్ కావడంతో ఈ సినిమాపై అందరి దృష్టి పడింది. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతోన్న ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ వేసవిలో మొదలుకానుంది. 2026లో సినిమాను విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.



వీరమల్లుగా...

ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ 2023లో విడుదలైన 'బ్రో' సినిమాతో ప్రేక్షకులను పలకరించారు. ఆయన ప్రస్తుతం మూడు చిత్రాల్లో నటిస్తున్నారు. చారిత్రక నేపథ్యంలో పోరాట యోధుడిగా పవన్ నటిస్తున్న చిత్రం 'హరిహర వీరమల్లు'. రెండు భాగాలుగా తెరకెక్కుతోంది. మొదటి భాగం 'స్వార్డ్ వర్సెస్ స్పిరిట్' మార్చి 28న విడుదల కానుంది. సుజీత్ దర్శకత్వంలో ఆయన గ్యాంగ్‌స్టర్‌గా పవన్ నటిస్తున్న 'ఓజీ'.. హరీశ్ శంకర్ దర్శకత్వంలో పోలీసాఫీసర్ పాత్రను పోషిస్తున్న 'ఉస్తాద్ భగత్‌సింగ్' చిత్రాలు షూటింగ్ దశలో ఉన్నాయి.

తొలి పాన్ ఇండియా చిత్రం



గతేడాది సంక్రాంతికి విడుదలైన 'గుంటూరు కారం'తో అభిమానులను పలకరించారు మహేశ్. ఆయన ప్రస్తుతం ఎస్.ఎస్.రాజమౌళి దర్శకత్వంలో ఓ చిత్రంలో నటించనున్నారు. మహేశ్‌కిదే తొలి పాన్ ఇండియా ప్రాజెక్ట్. ఈ నెలలోనే షూటింగ్‌ను ప్రారంభించనున్నట్లు తెలిసింది. దాదాపు రూ. వెయ్యి కోట్ల బడ్జెట్‌తో రెండు భాగాలుగా తెరకెక్కనుంది. 2027లో మొదటి భాగం విడుదల కానుంది.

ఆ టైటిల్‌కు ఓనర్ ఎవరు?



మహేశ్‌బాబు నటించిన 'పోకిరి' టైటిల్‌తో ఇప్పుడు మరో సినిమా వస్తోంది. వరుణ్‌రాజ్ ఈ చిత్రానికి హీరో, నిర్మాత కూడా. మమత హీరోయిన్. సినిమాలోని తొలి పాటను విడుదల చేసిన అనంతరం దర్శకుడు వికాస్ మాట్లాడుతూ 'కథ రాసుకున్నప్పుడే 'పోకిరి' టైటిల్ అనుకున్నాం. వేరే పేర్లు పరిశీలించినా ఇదే యాప్ట్ అనుకొని నిర్ణయించాం' అని చెప్పారు. వరుణ్‌రాజ్ మాట్లాడుతూ ' మహేశ్ బాబే 'పోకిరి' టైటిల్‌కు ఓనర్. మేమంతా అభిమానులం మాత్రమే' అన్నారు.

అద్భుతమైన ప్రయాణం



ఇటీవలే 'పుష్ప 2' సినిమాతో ప్రేక్షకులను పలకరించారు రష్మిక మందన్న. ఆమె నటిగా ఇండస్ట్రీలో అడుగుపెట్టి ఎనిమిదేళ్లయిన సందర్భంగా అభిమానులతో తన ఆనందాన్ని పంచుకున్నారు. "ఈ ఎనిమిదేళ్ల ప్రయాణం ఎంతో అద్భుతంగా ఉంది. ఇంతదూరం వచ్చానంటే.. దానికి మీ ఆదరాభిమానాలు.. ప్రోత్సాహమే కారణం. మనస్ఫూర్తిగా మీ అందరికీ కృతజ్ఞతలు" అని ఇన్‌స్టాగ్రామ్‌లో పేర్కొన్నారు. కాగా, 2016లో విడుదలైన కన్నడ చిత్రం 'కిరిక్ పార్టీ'తో నటిగా ఇండస్ట్రీలో అడుగుపెట్టారు రష్మిక. ఆ తర్వాత తెలుగులో 'ఛలో', 'గీత గోవిందం', 'డియర్ కామ్రేడ్', 'భీష్మ', 'సీతారామం', 'పుష్ప', 'యానిమల్', 'పుష్ప 2' చిత్రాల్లో నటించారు. 'గర్ల్‌ఫ్రెండ్', 'రెయిన్‌బో', 'ఛావా', 'కుబేర', 'సికందర్' వంటి వరుస చిత్రాలతో కొత్త ఏడాదిలో అభిమానులను పలకరించనున్నారు రష్మిక మందన్న.

గవర్నర్‌కు వెళ్లిన భూభారతి బిల్లు-2024

» మార్గదర్శకాలతో కలిపి పంపిన అధికారులు

హైదరాబాద్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): భూభారతి బిల్లు-2024 గవర్నర్ ఆమోదానికి వెళ్లింది. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ నోటిపై చేసిన అనంతరం గెజిట్ ప్రకటన విడుదల కానుంది. ఆ తరువాత భూభారతి చట్టాన్ని అమల్లోకి తీసుకొస్తూ ప్రభుత్వం ప్రకటన చేయనుంది. ఈ ప్రక్రియ అంతా జనవరి రెండో వారంలోపు ముగిసే అవకాశం ఉందని రెవెన్యూ వర్గాల సమాచారం. భూభారతి-2024 బిల్లును డిసెంబరు 18న శాసన సభలో ప్రవేశ పెట్టగా 20 వ తేదీ శాసన సభలో, 21 శాసన మండలిలో ఆమోదం పొందింది. ప్రభుత్వం మార్గదర్శకాలు రూపొందించిన అనంతరం భూభారతి బిల్లుతో కలిపి డిసెంబరు 30న గవర్నర్ ఆమోదానికి పంపారని తెలిసింది. సంతాప సమావేశాలు జనవరి 3వ తేదీ వరకు ఉన్నందున ఆ తరువాత గవర్నర్ ఆమోదం లభించే అవకాశం ఉంటుందని రెవెన్యూ అధికారుల్లో చర్చ జరుగుతోంది.

హైటెక్స్‌లో ఆప్తా గ్లోబల్ బిజినెస్ సదస్సు

» జనవరి 3 నుంచి 5వరకు నిర్వహణ

» తొలిరోజు సదస్సుకు ఏపీ సీఎం చంద్రబాబు రెండో రోజు సీఎం రేవంత్‌రెడ్డి హాజరు

» సదస్సు నిర్వాహక బృందం వెల్లడి

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): హైటెక్స్‌లో జనవరి 3 నుంచి అమెరికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్(ఆప్తా) ఆధ్వర్యంలో అంతర్జాతీయ వ్యాపార సదస్సును నిర్వహించనున్నారు. పలు దేశాల్లో నివసిస్తున్న తెలుగు ఎన్‌ఆర్‌ఐలు ఈ సదస్సులో పాల్గొననున్నారు. ఈ సదస్సును హైదరాబాద్‌లో నిర్వహించడం ఇదే మొదటిసారి. సదస్సు 5వ తేదీ వరకు జరగనుంది. 'ఆప్తా క్యాటలిస్ట్- గ్లోబల్ బిజినెస్ కాన్ఫరెన్స్-2025' పేరుతో 'అనుసంధానం, సహకారం, నిర్మాణం' అన్న ఇతివృత్తంతో ఈ సదస్సును నిర్వహించబోతున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సదస్సు విశేషాలను తెలియజేయడానికి సోమాజిగూడలోని ఓ హోటల్‌లో నిర్వాహక బృందం సమావేశం ఏర్పాటు చేసింది. పది దేశాల నుంచి నుంచి దాదాపు వెయ్యి మంది ఈ సదస్సుకు హాజరవుతారని తెలిపింది. తొలి రోజు సదస్సుకు ఏపీ సీఎం చంద్రబాబు, రెండో రోజు సీఎం రేవంత్ రెడ్డి హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు. చివరి రోజు నటుడు చిరంజీవి పాల్గొంటారన్నారు. అమెరికాలో ఉన్న తెలుగు వారి అవసరాలను తీర్చడం కోసం ఆప్తా 2008లో ప్రారంభమైందని సంస్థ అధ్యక్షుడు మధు చెప్పారు. ఈ 14 సంవత్సరాల్లో రూ.14కోట్ల స్కాలర్‌షిప్‌లను 1,600 మందికి పైగా విద్యార్థులకు అందించామన్నారు. కాగా, ఈ సదస్సుకు గౌరవాధ్యక్షుడిగా డాక్టర్ సుబు కోట వ్యవహరించనున్నారు.

రూ.409 కోట్ల అప్పు తీసుకున్న రాష్ట్రం

హైదరాబాద్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.409 కోట్ల రుణం తీసుకున్నది. మంగళవారం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిర్వహించిన ఈ-వేలం ద్వారా ఈ అప్పును సేకరించింది. 7.12 శాతం వార్షిక వడ్డీ 26 ఏళ్ల కాల పరిమితితో ఈ రుణాన్ని తీసుకుంది. రాష్ట్రం సహా దేశంలోని 10 రాష్ట్రాలు రూ.24,729 కోట్ల అప్పులు తీసుకున్నాయి.

నేటి నుంచి సచివాలయంలో 'ముఖ గుర్తింపు' హాజరు

హైదరాబాద్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): సచివాలయంలోని రెగ్యులర్ ఉద్యోగులు, అధికారులకు జనవరి 1 నుంచి 'ముఖ గుర్తింపు'(ఫేషియల్ రికగ్నిషన్) హాజరు విధానం అమలు కానుంది. ఈ మేరకు అన్ని శాఖల ముఖ్యకార్యదర్శులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మంగళవారం అంతర్గత ఉత్తర్వుల్లో ఆదేశించారు. తమ శాఖల్లోని అధికారులు, ఉద్యోగులు 'ముఖ గుర్తింపు' హాజరు విధానాన్ని పాటించేలా చూడాలని, ఏమైనా సాంకేతిక ఇబ్బందులు తలెత్తితే ప్రభుత్వం నియమించిన ఇద్దరు అధికారులు ప్రవీణ్‌కుమార్, సరితల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఇకపై ప్రభుత్వం ముఖ గుర్తింపు హాజరును మాత్రమే పరిగణలోకి తీసుకుంటుందని పేర్కొన్నారు.

సంక్రాంతికి 6432 ప్రత్యేక సర్వీసులు


» 557 సర్వీసులకు ముందస్తు రిజర్వేషన్

» ఈ సంక్రాంతికి జిల్లాల నుంచి హైదరాబాద్‌కు ఎలక్ట్రిక్ బస్సులు ప్రత్యేకం

» ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్న టీజీఎస్‌ఆర్టీసీ



హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతికి సొంతూళ్లకు వెళ్లే వారి కోసం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టీజీఎస్ ఆర్టీసీ) యాజమాన్యం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. పండగ రద్దీని దృష్టిలో పెట్టుకుని 6432 ప్రత్యేక సర్వీసులను నడపాలని నిర్ణయించింది. అందులో 557 సర్వీసులకు ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం కల్పించింది. గత సంక్రాంతి అనుభవం దృష్ట్యా ఈసారి బస్సుల సంఖ్యను పెంచింది. జనవరి 9 నుంచి 15 వరకు ప్రత్యేక సర్వీసులు ప్రయాణికులకు అందుబాటులో ఉంటాయి. హైదరాబాద్‌లో రద్దీ ప్రాంతాలైన ఎంజీబీఎస్, జేబీఎస్, ఉప్పల్ క్రాస్ రోడ్స్, ఆరాంఘర్, ఎల్బీనగర్ క్రాస్ రోడ్స్, కేపీహెచ్‌బీ, బోయిన్‌పల్లి, గచ్చిబౌలి తదితర ప్రాంతాల నుంచి ప్రత్యేక బస్సులను సంస్థ నడుపనుంది. అలాగే హైదరాబాద్ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక బస్సులను సంస్థ నడుపుతోంది. ప్రధానంగా అమలాపురం, కాకినాడ, కందుకూరు, నర్సాపురం, పోలవరం, రాజమండ్రి, రాజోలు, ఉదయగిరి, విశాఖపట్నం, నెల్లూరు, ఒంగోలు, గుంటూరు, విజయవాడ, శ్రీశైలం తిరుపతి తదితర ప్రాంతాలకు ఈ బస్సులు నడుస్తాయి. తెలంగాణతోపాటు ఆంధ్రప్రదేశ్ నుంచి తిరుగు ప్రయాణమయ్యే వారి కోసంప్రత్యేక బస్సులను సంస్థ ఏర్పాటు చేసింది. ఈ సంక్రాంతికి కరీంనగర్, నిజామాబాద్, వరంగల్ నుంచి ఎలక్ట్రిక్ బస్సులు ప్రయాణికులకు అందుబాటులో ఉంచేలా ప్లాన్ చేస్తోంది. హైదరాబాద్‌లోని రద్దీ ప్రాంతాల్లో ప్రయాణికుల సౌకర్యార్థం షామియానాలు, కుర్చీలు, తాగునీటి సదుపాయం, మొబైల్ టాయిలెట్లను ఏర్పాటు చేస్తున్నట్లు సంస్థ పేర్కొంది. రాష్ట్ర ప్రభుత్వ మహాలక్ష్మి పథకంలో భాగంగా సంక్రాంతికి నడిపే పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరి, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు రవాణా సదుపాయం అమల్లో ఉంటుందని తెలిపింది. ప్రత్యేక బస్సుల్లో ముందస్తు రిజర్వేషన్‌ను www.tgsrtcbus.in వెబ్ సైట్‌లో చేసుకోవాలని పేర్కొంది. పూర్తి సమాచారం కోసం ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 040-69440000, 040-23450033 సంప్రదించాలని ఆర్టీసీ యాజమాన్యం సూచించింది.



ఎంవోయూతో ఐఐటీ హైదరాబాద్ ప్రతినిధులు, ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్

క్యాన్సర్‌పై పరిశోధనలకు ఐఐటీ హైదరాబాద్, ఎంఎన్‌జే ఆస్పత్రి మధ్య అవగాహనా ఒప్పందం

హైదరాబాద్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్‌పై విస్తృత పరిశోధనలు చేసేందుకు ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రి, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ హైదరాబాద్ మధ్య అవగాహనా ఒప్పందం (ఎంవోయూ) కుదిరింది. మంగళవారం ఎంఎన్‌జే డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్, ఐఐటీ హైదరాబాద్ ప్రతినిధులు అవగాహనా ఒప్పందంపై సంతకాలు చేశారు. పరిశోధనల్లో భాగంగా క్యాన్సర్ రోగులు వినియోగిస్తోన్న ఔషధాలు, ఆ క్రమంలో వచ్చే సంక్లిష్టతలు, రోగ నిర్ధారణ ఖర్చులు తగ్గించడానికి అభివృద్ధి చేయాల్సిన యంత్ర పరికరాలు, తదితర అంశాలపై ఐఐటీ హైదరాబాద్, ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రికి సహకరించనుంది.

ప్రజాప్రతినిధులకు 'కాన్‌స్టిట్యూషన్ క్లబ్'!

» ఆదర్శనగర్ న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఏర్పాటు చేయాలని సర్కారు నిర్ణయం

» 4 ఎకరాల విస్తీర్ణంలో క్లబ్ నిర్మాణం

హైదరాబాద్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రస్తుత ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, మాజీల కోసం ప్రభుత్వం 'కాన్‌స్టిట్యూషన్ క్లబ్'ను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. హైదరాబాద్ ఆదర్శనగర్‌లో ఉన్న న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో 4 ఎకరాల విస్తీర్ణంలో అత్యాధునిక సౌకర్యాలతో ఈ క్లబ్‌ను ఏర్పాటు చేయనుంది. ప్రస్తుతం ఢిల్లీ, రాజస్థాన్‌లోని జైపూర్‌లో కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లు అందుబాటులో ఉన్నాయి. అదే తరహాలో ఇక్కడా ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. క్లబ్ నిర్మాణ బాధ్యతను రోడ్లు, భవనాల శాఖ పర్యవేక్షిస్తుంది. నిర్మాణ డిజైన్ సహా పలు అంశాలపై సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను అందించే బాధ్యతను ఆర్‌అండ్‌బీ శాఖ ఓ సంస్థకు అప్పగించింది. డిజైన్‌ను ఖరారు చేసే క్రమంలో ఆదర్శనగర్‌లోని న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌ను ఆ సంస్థ పరిశీలించింది. త్వరలోనే క్లబ్ నిర్మాణ డిజైన్‌ను అందించనున్నట్లు తెలిసింది. ఆదర్శనగర్‌లో 55 ఏళ్ల క్రితం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు 22 ఎకరాల విస్తీర్ణంలో ప్రజాప్రతినిధులు ఉండేందుకు వీలుగా సుమారు 185 క్వార్టర్లను నిర్మించారు. అయితే తెలంగాణ ఏర్పాటైన తర్వాత గత ప్రభుత్వం ప్రజాప్రతినిధుల కోసం మళ్లీ హైదర్‌గూడలో కొత్త క్వార్టర్లను నిర్మించింది. దాంతో ఆదర్శనగర్‌లోని న్యూ ఎమ్మెల్యే క్వార్టర్లలో చాలా వరకు మాజీ ప్రజాప్రతినిధులు ఉంటున్నారు. మరోవైపు గత ప్రభుత్వ హయాంలో కొత్త సచివాలయాన్ని నిర్మించే సమయంలో కొన్ని ప్రభుత్వ కార్యాలయాలు కూడా ఈ క్వార్టర్లలోకే వచ్చాయి. తెలంగాణ విభజన అనంతరం రాష్ట్ర వాటాగా వచ్చిన భాగంలోని పలు క్వార్టర్లను గతంలోనే కూల్చివేయడంతో ఆ ప్రాంతమంతా ప్రస్తుతం ఖాళీగానే ఉంది. దాంతో పాటు, మరికొంత స్థలం కలిపి మొత్తం 4 ఎకరాల విస్తీర్ణంలో కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది.

చర్చలకు వేదిక..

క్లబ్ అనగానే చాలామందికి వివిధ రకాల ఆలోచనలు వస్తుంటాయి. కానీ, ప్రభుత్వం ఏర్పాటు చేసే ఈ కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో పలు అంశాలపై మేధోపరమైన చర్చలు, సదస్సులను నిర్వహిస్తారు. ప్రస్తుత, మాజీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీలు అందరూ ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు, వాటి వల్ల కలిగే ప్రయోజనాలతో పాటు లాభనష్టాలపైనా చర్చించేందుకు వీలుంటుంది. ప్రెస్‌మీట్లు, సమావేశాల నిర్వహణకు అవకాశం ఉంటుంది. ఇందుకోసం అన్ని సౌకర్యాలతో కూడిన హాళ్లను ఏర్పాటు చేస్తారు. ప్రజాప్రతినిధులు సేద తీరేందుకు గెస్ట్‌హౌస్‌లతో పాటు జిమ్, క్రీడా ప్రాంగణాలను కూడా ఏర్పాటు చేయనున్నారు.



ఇందిరమ్మ ఇంటికి ఇసుక ఉచితం!

ఒక్కో ఇంటికి 37-40 టన్నులు అవసరం.. పూర్తి ఉచితంగా ఇవ్వాలని సర్కారు యోచన?

» 4.50 లక్షల ఇళ్లకు 112 లక్షల క్యూబిక్ మీటర్ల

» ఇసుక కావాల్సి ఉంటుందని అంచనా

» ఒక్కో ఇంటికి అదనంగా రూ.60 వేలు వెచ్చించనున్న ప్రభుత్వం!



హైదరాబాద్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు శుభవార్త! రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులకు కొత్త సంవత్సర కానుక ఇవ్వనుంది. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మంజూరైన ఇంటి నిర్మాణానికి ఉచితంగా ఇసుకను అందించాలని ప్రాథమికంగా నిర్ణయించినట్లు సమాచారం. ఇందిరమ్మ పథకం కింద ఇళ్లు పొందిన లబ్ధిదారులకు సిమెంటు, ఇనుమును సంబంధిత కంపెనీలతో మాట్లాడి, తక్కువ ధరకే అందించాలనే ఆలోచనలో ఉన్న ప్రభుత్వం.. తాజాగా ఇసుకను ఉచితంగా అందించాలని యోచిస్తున్నట్లు విశ్వసనీయవర్గాలు తెలిపాయి. వాస్తవానికి ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రకటించినప్పుడు కేవలం సొంత స్థలం ఉన్నవారు ఇంటిని నిర్మించుకునేందుకు రూ.5 లక్షలు, స్థలం లేని వారికి స్థలమిచ్చి రూ.5 లక్షల ఆర్థిక సాయం చేస్తామని మాత్రమే చెప్పింది. కానీ, ప్రస్తుత పరిస్థితులు, ఇంటి నిర్మాణంలో కీలకమైన ఇసుక, ఇనుము, సిమెంటు ధరలు మార్కెట్‌లో చుక్కలనంటుతున్న నేపథ్యంలో సిమెంటు, ఇనుమును తక్కువ ధరకు అందించాలనే యోచనకు వచ్చింది. ఇసుకను మాత్రం పూర్తిగా ఉచితంగా ఇవ్వాలని నిర్ణయించినట్లు సమాచారం. ఒక్కో ఇంటికి ఎంత మేర ఇసుక అవసరమనే అంశాన్ని చెబుతూ గృహ నిర్మాణ సంస్థ పంపిన ప్రతిపాదనలపై ప్రభుత్వం అంచనాలు వేస్తోంది. ఈ మేరకు ఒక్కో ఇంటికి 25 క్యూబిక్ మీటర్ల ఇసుక (దాదాపు 37-40 టన్నులు) అవసరం అవుతుందని, రాష్ట్రవ్యాప్తంగా మంజూరు చేసే మొత్తం 4.50 లక్షల ఇళ్లకు 112 లక్షల క్యూబిక్ మీటర్ల ఇసుక అవసరం అవుతుందని అధికారులు ప్రభుత్వానికి తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లకు అవసరమయ్యే ఇసుకను ఉచితంగా అందించే అంశంపై ప్రభుత్వం ఖనిజాభివృద్ధి సంస్థతో చర్చించనుంది. ప్రస్తుతం రాష్ట్రంలో ఏయే ప్రాంతాల్లో ఇసుక లభ్యమవుతోంది? ఎంత ధర ఉంది? అనే వివరాలను సేకరిస్తోంది. కాగా ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో టన్ను ఇసుక ధర రూ.1400-1500 వరకు పలుకుతోంది. ఇందులోనూ రకాలున్నాయి. ఈ ధరలు ప్రాంతాలు, డిమాండ్‌ను బట్టి మారుతుంటాయి. ఉదాహరణకు ఖమ్మంలో టన్ను ఇసుక ధర రూ.1400 పలికితే.. అదే హైదరాబాద్‌లో రూ.1600-1700 వరకు పలుకుతోంది. మార్కెట్‌లో డిమాండ్ ఉన్నప్పుడు ఇదే ఇసుకను టన్ను రూ.2200-2400 వరకు కూడా విక్రయించామని ఒక ఇసుక వ్యాపారి 'ఆంధ్రజ్యోతి'తో అన్నారు. ఒక్కో ఇంటికి దాదాపు 37-40 టన్నుల ఇసుక అవసరమవుతుంది. దీని ప్రకారం టన్ను ధర సగటున రూ.1500 అనుకుంటే.. ఒక్కో ఇంటికి ప్రభుత్వం అదనంగా రూ.60 వేల వరకు వెచ్చించాల్సి ఉంటుందని అధికార వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం భద్రాద్రి కొత్తగూడెంలో రెండు ర్యాంపుల్లో, ములుగు జిల్లాలో ఒకట్రెండు, కాళేశ్వరం దగ్గర ఉన్న ర్యాంపుల్లో ఇసుక అందుబాటులో ఉంది.

అక్రమాలకు తావు లేకుండా..

ఇందిరమ్మ ఇళ్లకు ప్రభుత్వం ఉచితంగా అందించాలని భావిస్తున్న ఇసుక విషయంలో అక్రమాలు, అవకతవకలకు తావులేకుండా ఉండేలా పటిష్ఠ చర్యలు తీసుకోవాలనే యోచనలో ఉంది. గత ప్రభుత్వ హయాంలో అమలు చేసిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు అప్పటి ప్రభుత్వం ఇసుకను ఉచితంగా అందించింది. అయితే, డబుల్ ఇళ్ల పేరుతో ఇసుకను బ్లాక్‌లో విక్రయించడంతో పాటు ఇతర అవసరాలకు వినియోగించారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈసారి అలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా చూడాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇసుకను ఉచితంగా అందించాలనే నిర్ణయం నేపథ్యంలో రవాణా చార్జీలను కూడా ప్రభుత్వమే భరించాలా, లబ్ధిదారుడికి కొంత వాటాను చెల్లించే నిబంధన పెట్టాలా? అనే విషయంపై స్పష్టత రావాల్సి ఉంది.

రోడ్డు భద్రత మాసాన్ని విజయవంతం చేయండి

» అవగాహన కార్యక్రమాలు, కంటి పరీక్షలు నిర్వహించండి: పొన్నం



హైదరాబాద్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : ప్రతి సంవత్సరం జనవరిలో నిర్వహించే జాతీయ రోడ్డు భద్రత మాసాన్ని విజయవంతం చేయాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారుల్ని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పోలీసు, విద్యాశాఖతోపాటు ఇతర ప్రభుత్వ విభాగాలు భాగస్వామ్యం కావాలని మంత్రి సూచించారు. బుధవారం నుంచి జరిగే జాతీయ రోడ్డు భద్రత మాసంలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం జూమ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఐఏఎస్, ఐపీఎస్‌లు భాగస్వామ్యం అయ్యేలా చూడాలని రవాణా శాఖ అధికారులకు సూచించారు. డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించేందుకు శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు.

125.50 కోట్ల మంది మహిళలకు రూ. 4225 కోట్ల విలువైన ఉచిత ప్రయాణం

ప్రజా పాలనలో 2024లో రవాణా శాఖ అత్యుత్తమ పనితీరు కనబర్చిందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. 2024లో రవాణా శాఖ సాధించిన విజయాల్ని మంత్రి వెల్లడించారు. విద్యుత్ వాహన పాలసీలో జీహెచ్‌ఎంసీ పరిధిలో ఏటా సగటున 5 లక్షల వాహనాలను చేర్చడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. తమ ప్రభుత్వం ఏర్పడ్డ 48 గంటల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించామన్నారు. ఇప్పటి వరకు 125.50 కోట్లమంది మహిళలు ఉచిత ప్రయాణ సదుపాయాన్ని వినియోగించుకున్నారన్నారు. రూ. 4,225 కోట్ల ప్రయాణ ఖర్చులను మహిళలు ఆదా చేసుకున్నారన్నారు.

కార్పొరేట్ స్థాయిలో సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులు

» తొలిదశలో నాలుగు జిల్లాల్లో నిర్మాణం

» గచ్చిబౌలిలో మోడల్ రిజిస్ట్రేషన్ ఆఫీసు

» మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



హైదరాబాద్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు పారదర్శకమైన సేవలను అందించేందుకు వీలుగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను కార్పొరేట్ స్థాయిలో పునర్‌వ్యవస్థీకరణ చేయనున్నట్లు రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. సీఎస్‌ఆర్ నిధుల ద్వారా ఆధునిక హంగులతో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను నిర్మించబోతున్నట్లు చెప్పారు. ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా మెరుగైన వసతులు కల్పించడమే ధ్యేయంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను పునర్ వ్యవస్థీకరణ చేయాలని అధికారులకు సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా అత్యాధునిక వసతులతో శాశ్వత భవనాలను నిర్మించాలని, ఇందుకు అవసరమైన భూములను గుర్తించాలని రంగారెడ్డి, మెదక్, సంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలుండగా 37 మాత్రమే సొంత భవనాలు కలిగి ఉన్నాయని, మిగిలిన వన్నీ అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని, ఈ పరిస్థితిలో మార్పు తీసుకొచ్చేలా కార్పొరేట్ స్థాయిలో నూతన కార్యా లయాల నిర్మాణం చేపడతామన్నారు. తొలి దశలో సంగారెడ్డి జిల్లాలో సంగారెడ్డి, పటాన్‌చెరు, మేడ్చల్ జిల్లాలో మేడ్చల్, కుత్బుల్లాపూర్, ఉప్పల్‌లో, రంగారెడ్డి జిల్లాకు సంబంధించి కందుకూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఫోర్త్ సిటీలో నిర్మించనున్నట్లు వెల్లడించారు. అలాగే, గండిపేట, శేరిలింగంపల్లి కార్యాలయాలతో పాటు, రంగారెడ్డి జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాన్ని గచ్చిబౌలిలోని తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ్ ఇన్‌ఫర్మేషన్ అండ్ మేనేజ్‌మెంట్ (తాలిమ్) వద్ద మోడల్ ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంగా నిర్మించనున్నట్లు చెప్పారు. జనవరిలోనే దీనికి శంకుస్థాపన జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ జిల్లాకు సంబంధించి బంజారాహిల్స్, ఎస్‌ఆర్‌నగర్, గోల్కొండ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు షేక్‌పేట ప్రాంతంలో ఒకే చోట నిర్మించాలని నిర్ణయించామన్నారు.

3 ఎకరాల్లో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

తొలిదశలో నిర్మించే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఒక్కొక్కటి కనీసం మూడు ఎకరాల విస్తీర్ణంలో ఉంటాయన్నారు. పది నుంచి 15 వేల చదరపు అడుగుల్లో భవన నిర్మాణం చేపడతామని చెప్పారు. డిమాండ్ ఎక్కువ ఉండే ప్రాంతాల్లో కొత్త సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ఏర్పాటు చేయడం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయన్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అవినీతిని నిర్మూలించేందుకు వీలుగా సాంకేతిక పరిజ్ఞానాన్ని విరివిగా వినియోగించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురామరెడ్డి కూడా పాల్గొన్నారు.

ఇంటివద్దకే పహాణీ

» పేద రైతులకు ఉచిత న్యాయ సహాయం..

» భూభారతి చట్టంలో పెట్టిన ప్రభుత్వం

హైదరాబాద్, డిసెంబరు31(ఆంధ్రజ్యోతి): కొత్త సంవత్సరంలో అమల్లోకి రానున్న నూతన ఆర్వోఆర్ భూ భారతి-2024లో ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం, గిరిజన, మారుమూల ప్రజల ప్రయోజనాల కోసం పలు కొత్త విధానాలను అమల్లోకి తీసుకురానుంది. ఆర్థికంగా వెనుకబడిన వారు ఎవరూ న్యాయ సహాయాన్ని అందుకోలేక నష్టపోకూడదనే ఉద్దేశంతో కొత్త చట్టంలో ఉచిత న్యాయ సహాయాన్ని ప్రభుత్వమే అందించేందుకు అవకాశం కల్పించింది. దీంతోపాటు గ్రామ స్థాయిలో ఆర్వోఆర్/ పహాణీకి సంబంధించి ప్రతి రైతు రికార్డులను ప్రింట్ తీసి ఉచితంగా ఒక కాపీ అందించేలా ఈ చట్టంలో పొందుపరిచారు.

కలగానే మిగిలిన ఉచిత న్యాయం

రైతుకు అన్యాయం జరిగినప్పుడు న్యాయం పొందే హక్కు ఉంటుంది. అయితే దారిద్ర్యరేఖకు దిగువన ఉండే పేద రైతులు తమకు జరిగిన అన్యాయంపై న్యాయ సహాయాన్ని పొందలేక నష్టపోతున్న కేసులు అనేకం ఉన్నాయి. కోనేరు రంగారావు కమిటీ, మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన భూమి కమిటీ ఇచ్చిన నివేదికల్లోనూ పేద ప్రజలకు ఉచిత న్యాయం అందించాలని పేర్కొన్నాయి. ఇదే తరహాలో పారా లీగల్ వ్యవస్థ పని చేసేది. పదేళ్ల క్రితం వికారాబాద్ ఆర్డీవో ఎన్. ప్రభాకర్ రెడ్డి, భూ చట్టాల నిపుణుడు సునీల్ నేతృత్వంలో ఉచిత న్యాయ సహాయ శిబిరాలను ఏర్పాటు చేశారు. మీ భూమి-మీ హక్కు పేరుతో నిర్వహించిన ఆ సమావేశాల్లో పేద రైతులకు ఉచితంగానే న్యాయం అందించే ఏర్పాటు చేశారు. ఇప్పుడు ఇదే తరహాలో భూభారతి చట్టంలో పేద రైతులకు ఉచిత న్యాయం అందించే వెసులుబాటును ప్రభుత్వం కల్పిస్తోంది. చట్టంలో సెక్షన్ 15, సబ్‌సెక్షన్8లో ఈ అంశాన్ని పొందుపరిచారు. ఇప్పటికే గ్రామీణాభివృద్ధి ఆధీనంలో(సెర్ప్) 130 మంది పారా లీగల్ సిబ్బంది ఉన్నారు. వారికి పది సంవత్సరాలకు పైగా భూ సమస్యలపై అనుభవం ఉంది. చట్టం అందుబాటులోకి రాగానే వీరి సేవలను వినియోగించుకుంటే ప్రజలకు సత్వర న్యాయ సేవలు అందించే అవకాశం ఉంది.



మీ భూమి-మీ హక్కు పేరుతో రైతుల్లో అవగాహన కల్పించిన అధికారులు

ఇంటి వద్దకే ఆర్వోఆర్/ పహాణీ

భూభారతి 2024 చట్టంలో గ్రామీణ రికార్డులను భద్రపరచడంతోపాటు భూహక్కుల రికార్డును/ పహాణీ కాపీలను ప్రతి రైతుకు ఇంటి వద్దకే పంపిణీ చేసేలా ప్రభుత్వం అవకాశం కల్పిస్తోంది. ఏడాదికి ఒకసారి రూ.10 నుంచి రూ.20 దరఖాస్తు రుసుంతో మాన్యువల్ కాపీని ప్రింట్ తీసి ఇంటి దగ్గరే అందిస్తారు. కంప్యూటర్‌లో ఉండే ఆన్‌లైన్ రికార్డులో ఏవైనా పొరపాట్లు జరిగినా, దిద్దుబాటు చేసినా రైతుల వద్ద ఉండే మాన్యువల్ కాపీ ఆధారంగా వారికి జరిగిన అన్యాయాన్ని గుర్తించే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా గ్రామీణ రైతులకు, కంప్యూటర్ అవగాహన లేని రైతులకు చేతికందించే మాన్యువల్ కాపీల వల్ల ఎంతో ఉపయోగం ఉంటుంది. భూభారతిలో సెక్షన్ 4, సబ్‌సెక్షన్3లో ఈ అంశాన్ని ప్రస్తావించారు.

గోడమీద పహాణీ, ఇంటింటికి భూ కిట్లు ఇచ్చాం

భూ హక్కు రికార్డుల పత్రాలు లేదా పహాణీలను ప్రింట్ తీసి రైతులకు నేరుగా ఇంటికే పంపడం విప్లవాత్మక చర్య అవుతోంది. ఈ విధానం కర్ణాటకలో ఎప్పటి నుంచో అమల్లో ఉంది. మన దగ్గర కూడా దశాబ్దం క్రితమే వరంగల్ జిల్లాలో పుట్టల భూపతి అనే గిరిజన పల్లెలో ఇంటింటికి భూమి కిట్లు ఇవ్వడంతోపాటు, జిల్లాలో పలు చోట్ల గోడల మీద పహాణీ వివరాలు గ్రామాల్లో రాసి రైతుల్లో చైతన్యం కలిగించాం. ఉచిత న్యాయం అందించే అంశం ఆర్వోఆర్ చట్టాల్లో ఏ రాష్ట్రంలోనూ ప్రస్తావించలేదు. దేశంలో సుమారు 5 వేల చట్టాలు ఉంటే ఏ చట్టంలో కూడా ఉచిత న్యాయం గురించి చెప్పలేదు. తొలిసారి తెలంగాణ ప్రభుత్వం చెప్పడం ద్వారా విప్లవాత్మకమైన సంస్కరణలకు నాంది పలికినట్లైంది.

- సునీల్, భూ చట్టాల నిపుణుడు

రుణాల పునర్‌వ్యవస్థీకరణ

స్వల్పకాలిక రుణాలను దీర్ఘకాలిక రుణాలుగా మార్చుతాం

» కృష్ణాలో 550 టీఎంసీలను సాధించేలా వాదనలు

» 15 రోజుల్లో పదోన్నతులు, బదిలీలు

» పదేళ్లలో ఇరిగేషన్ శాఖ అస్తవ్యస్తం: మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

» కేటీఆర్ విషయంలో చట్టం తన పని తాను చేసుకుపోతుంది: కోమటిరెడ్డి

హైదరాబాద్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ప్రాజెక్టుల కోసం స్వల్పకాలిక రుణాలను అధిక వడ్డీతో తీసుకున్నారని, ఆ రుణాలను రీ స్ట్రక్చరింగ్ (పునర్‌వ్యవస్థీకరణ) చేసుకొని... దీర్ఘకాలిక రుణాలుగా మార్చుకోనున్నట్లు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటించారు. గత పదేళ్ల పాటు స్వల్పకాలిక రుణాలను అధిక వడ్డీతో తెచ్చుకున్నారని, ఈ ఏడాది నీటిపారుదల శాఖకు రూ.22 వేల కోట్లు కేటాయిస్తే, అందులో రూ.11 వేల కోట్లు అసలు/వడ్డీ కట్టడానికే సరిపోతోందన్నారు. గత పదేళ్లలో రూ.1.81 లక్షల కోట్లు ప్రాజెక్టుల నిర్మాణానికి వెచ్చించినా అందుబాటులోకి వచ్చిన ఆయకట్టు అంతంతమాత్రమేనని, పాలమూరులో రూ.27 వేల కోట్లు, సీతారామలో రూ.8 వేల కోట్లు వెచ్చించినా ఒక్క ఎకరం ఆయకట్టుకు నీరందించలేదన్నారు. లక్ష కోట్లు పెట్టినా కాళేశ్వరంలో అంతంతమాత్రంగానే ఆయకట్టు అందుబాటులోకి వచ్చిందన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని జలసౌధలో పూర్వ నల్లగొండ జిల్లాకు చెందిన ప్రాజెక్టుల పనులపై మంత్రి కోమటిరెడ్డితో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకర్ల సమావేశంలో ఉత్తమ్ మాట్లాడారు. పదేళ్లపాటు నీటి పారుదల శాఖ అస్తవ్యస్తంగా మారిందని, ఫలితంగానే మేడిగడ్డ బ్యారేజీ కుంగిందని మండిపడ్డారు. ఏడాదిగా శాఖను గాడిలో పెడుతున్నామని.. ఇందులో భాగంగానే 700 మందికి పైగా ఇంజనీర్ల నియామకం చేపట్టామని, వీరిలో 100 మంది ఐఐటీ, ఎన్‌ఐటీ పట్టభద్రులున్నారని, కాలువలపై పర్యవేక్షణ కోసం 1800 మంది లష్కర్ల నియామకం ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన చేపట్టనున్నామన్నారు. మరో 1300 పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను కోరామన్నారు. కల్వకుర్తి, బీమా, నెట్టెంపాడు, ఎస్ఎల్‌బీసీ, దేవాదుల వంటి ప్రాజెక్టుల నిర్మాణం కూడా చేపట్టలేదన్నారు. ఉమ్మడి రాష్ట్రానికి 811 టీఎంసీల కృష్ణా జలాలను కేటాయించగా తెలంగాణ రాష్ట్రం వచ్చాక ఏపీకి 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీలు చాలు అని ఒప్పుకొని, సంతకాలు చేశారని ఆక్షేపించారు. రానున్న నాలుగేళ్లలో తక్కువ వ్యయంతో అత్యధిక ఆయకట్టును సాధించే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. పదేళ్లపాటు బదిలీలు, పదోన్నతులు సరిగ్గా జరగలేదని, రానున్న 15 రోజుల్లో అన్ని స్థాయిల్లో పదోన్నతులు కల్పించి, బదిలీలు చేపడతామన్నారు.

న్యూఇయర్ వేడుకనైనా కేటీఆర్ ప్రశాంతంగా చేసుకోవాలి: కోమటిరెడ్డి

ఫార్ములా వన్ రేసు కుంభకోణంపై ఆరోపణలు ఎదుర్కొంటున్న కేటీఆర్ గురించి మంత్రి కోమటిరెడ్డిని ఆరా తీయగా... చట్టం తనపని తాను చేసుకుపోతుందని, కొత్త ఏడాది వేడుకనైనా కేటీఆర్‌ను ప్రశాంతంగా చేసుకోనియండి అని అన్నారు. ఆర్‌ఆర్‌ఆర్ కోసం బీఆర్ఎస్ హయాంలోనే 70% భూసేకరణ చేశామని మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి వ్యాఖ్యలను గుర్తు చేయగా... ఆయన ఏ రోజూ రోడ్లు భవనాలశాఖ మంత్రిగా పనిచేయలేదన్నారు. కేసీఆర్ యజ్ఞయాగాలు, పూజలు, హోమాలను చూసిన దేవాదాయ శాఖ మంత్రి అని ఎద్దేవా చేశారు. యూటిలిటీ చార్జీలు కట్టకుండా ప్రాజెక్టు ఆగిపోతే... గడ్కరీకి విజ్ఞప్తి చేసి, ప్రాజెక్టును పట్టాలెక్కించానని గుర్తు చేశారు. గత ప్రభుత్వం ఇరిగేషన్ శాఖలో చేసిన విధ్వంసాలను సరిదిద్దుతూ సాగునీటి ప్రాజెక్టులను నిర్మించే పని చేస్తున్నామన్నారు.

గురుకులంలో ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

» ప్రేమ వ్యవహారమే కారణమని అనుమానాలు

మధిర రూరల్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా మధిర మండలం కృష్ణాపురంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థి మంగళవారం ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విద్యార్థి ఆత్మహత్యకు ప్రేమ వ్యవహారమే కారణమని భావిస్తున్నారు. ఖమ్మం జిల్లా ముదిగొండకు చెందిన సాయివర్ధన్ (17) కృష్ణాపురం సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. క్రిస్మస్ సెలవులకు ఈ నెల 23న ఇంటికి వెళ్లిన సాయివర్ధన్ 30వ తేదీన తిరిగి కళాశాలకు వచ్చాడని, ఆ రోజు తోటి విద్యార్థులతో కలిసి నిద్రపోయిన అతను ఉదయం కనిపించకపోవడంతో స్నేహితులు హాస్టల్ గదులన్నీ వెతికారని కళాశాల ప్రిన్సిపాల్ చెప్పారు. ఈ క్రమంలో కళాశాల పైఅంతస్థులోని ఓ గదిలో ఫ్యాన్‌కు సాయివర్ధన్ ఉరివేసుకొని వేలాడుతూ కనిపించాడని ఆయన తెలిపారు. పోలీసులకు సమాచారం అందించడంతో వారు కళాశాలకు చేరుకొని సాయివర్ధన్ మృతదేహాన్ని కిందకు దించారని చెప్పారు. అతని జేబులో ప్రేమలేఖ లభించడంతో ఆత్మహత్యకు ప్రేమవ్యవహారమే కారణమై ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మధిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విద్యార్థి ఆత్మహత్య విషయం తెలుసుకున్న విద్యార్థి సంఘాల నాయకులు పాఠశాల ఎదుట ధర్నా నిర్వహించారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

2024లో 1,385 మంది పిల్లలను రక్షించిన రైల్వే పోలీసులు

హైదరాబాద్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే పోలీసులు 2024 సంవత్సరంలో 1,385 మంది పిల్లలను రక్షించి తల్లిదండ్రులకు అప్పగించారని దక్షిణ మధ్య రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ఐజీ, ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ అరోమా సింగ్ ఠాకూర్ తెలిపారు. ఇళ్ల నుంచి తప్పిపోయిన, పారిపోయిన పిల్లలను గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారని చెప్పారు. వారిలో 240 మంది బాలికలు ఉన్నారని తెలిపారు. అలాగే మానవ అక్రమ రవాణాకు వ్యతిరేకంగా చేపట్టిన ఆపరేషన్ ఆహ్ట్ ద్వారా 476 మంది బాలురను, 15 మంది బాలికలను రైల్వే పోలీసులు రక్షించారని పేర్కొన్నారు. 'ఆపరేషన్ రైల్ సురక్ష' ద్వారా 367 కేసుల్లో 674 మంది నుంచి రూ.83,31,184ల విలువైన రైల్వే ఆస్తులను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. అలాగే 111 కేసుల్లో 127 మంది గంజాయి స్మగ్లర్లను అరెస్టు చేసి రూ 5,02,33,060ల విలువైన 2,311.31 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. 2,576 సంఘటనల్లో అపహరణకు గురైన సుమారు రూ.6,93,48,568ల విలువైన వస్తువులను యజమానులకు అప్పగించినట్లు తెలిపారు. 2024లో రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ అంకిత భావంతో పని చేసి రైల్వే ఆస్తులను పరిరక్షించడంతో పాటు ప్రయాణికులకు విశ్వాసాన్ని పెంచేందుకు కృషి చేసిందని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ పేర్కొన్నారు.

2024 నా జీవితంలో మరువలేని సంవత్సరం

కొత్త ఏడాది అందరికీ మంచి జరగాలి: మహేశ్ కుమార్ గౌడ్

హైదరాబాద్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): తన రాజకీయ జీవితంలో 2024 సంవత్సరం మురువలేనిదని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. ఒక రాజకీయ నాయకునిగా చట్ట సభలోకి అడుగుపెట్టడం, కాంగ్రెస్ కార్యకర్తగా పీసీసీ అధ్యక్షుడిని కావడం.. తన జీవితంలో అత్యంత గొప్ప సంఘటనలని ఆయన పేర్కొన్నారు. కొత్త సంవత్సరం తెలంగాణ ప్రజలకు అంతా మంచి జరగాలని కోరుకుంటున్నానని మహేశ్ కుమార్ గౌడ్ ఆకాంక్షించారు. కాగా, మతి స్థిమితం లేని ట్వీట్లతో ప్రజల్ని కేటీఆర్ తప్పుదోవ పటిస్తున్నారని, ఆయనకు 2025లోనైనా జ్ఞానోదయం కలగాలని ఆ భగవంతుడిని కోరుకుంటున్నానని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ఏడాది పాలనపై 3 డీ పేరుతో కేటీఆర్ ఎక్స్ వేదికగా చేసిన విమర్శపై మంగళవారం చామల స్పందించారు. కాగా, పవిత్ర తిరుమల ఆలయంలో వీఐపీ దర్శనాల కోసం తెలంగాణ ప్రజాప్రతినిధులు జారీ చేసే సిఫారసు లేఖలను ఆమోదించాలని నిర్ణయం తీసుకున్నందుకు తెలంగాణ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల తరఫున ఏపీ సీఎం చంద్రబాబుకు నాగర్ కర్నూల్ ఎంపీ మల్లు రవి కృతజ్ఞతలు తెలిపారు. ఈమేరకు మంగళవారంనాడు ఏపీ సీఎం చంద్రబాబుకు లేఖ రాశారు.

మండలిపై చిన్నచూపా?: మధుసూనాచారి

హైదరాబాద్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : పెద్దల సభకు సుదీర్ఘకాలం పనిచేసిన మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు తెలంగాణ పెద్దల సభ సంతాపం తెలిపితే సముచితంగా ఉండేదని మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి పేర్కొన్నారు. ఇది తన అభిప్రాయం కాదని, శాసన మండలి హృదయ వేదన అంటూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మంగళవారం ఆయన లేఖ రాశారు. శాసన మండలిని చిన్నచూపు చూడటం తగదని, మన్మోహన్ సింగ్‌కు సంతాపం తెలిపేందుకు శాసనమండలిని సమావేశపరచక పోవడం బాధాకరమన్నారు. భవిష్యత్తులో ఇలాంటి తప్పులు పునరావృతం కాకుండా చూడాలని ఆయన తన లేఖలో పేర్కొన్నారు.

సైనిక్ స్కూళ్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టండి

హైదరాబాద్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్రంలో సైనిక్ స్కూళ్ల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టేలా కృషి చేయాలని కోరుతూ తెలంగాణ రాష్ట విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళికి మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ మంగళవారం లేఖ రాశారు. రాష్ట్రంలో సైనిక్ స్కూళ్ల ఏర్పాటుపై గత ప్రభుత్వ కార్యాచరణతోపాటు ప్రస్తుత ప్రభుత్వం చేపట్టాల్సిన చర్యలను ఆయన తన లేఖ ద్వారా సూచించారు.

రాజస్థాన్‌లో టీజీ పోలీసుల ఆపరేషన్

» సైబర్ నేరగాళ్లకు బ్యాంకు ఖాతాలను అందజేసే ఏడుగురి అరెస్టు

సైబర్ నేరగాళ్లకు అమాయకుల బ్యాంకు ఖాతాలను సరఫరా చేసే ఏడుగురు నిందితులను తెలంగాణ సైబర్ క్రైమ్ ప్రత్యేక బృందాలు రాజస్థాన్‌లో అరెస్టు చేశాయి. జైపూర్, జోధ్‌పూర్‌లో ప్రత్యేక ఆపరేషన్‌ను నిర్వహించి, వీరిని అదుపులోకి తీసుకున్నట్లు సైబర్ క్రైమ్ బ్యూరో డీజీ శిఖాగోయల్ తెలిపారు. వారిని రాజస్థాన్ కోర్టులో హాజరుపరిచి, ట్రాన్సిట్ వారెంట్‌పై హైదరాబాద్‌కు తీసుకువచ్చామన్నారు. ఈ ఏడాది సెప్టెంబరులో కూడా రాజస్థాన్‌లో ఇలా సైబర్ నేరగాళ్లకు ఇతరుల బ్యాంకు ఖాతాలను(మ్యూల్ ఖాతాలు) అందజేసే 27 మందిని అరెస్టు చేసినట్లు ఆమె గుర్తుచేశారు. ఇప్పటి వరకు అరెస్టయిన 34 మందిపై దేశవ్యాప్తంగా 2,223 కేసులు ఉన్నాయని, ఒక్క తెలంగాణలోనే వీరిపై 189 ఎఫ్ఐఆర్‌లు నమోదైనట్లు వెల్లడించారు. వీరు రూ.9 కోట్ల మేర బాధితుల సొమ్మును ఇతరుల ఖాతాలకు తరలించి, విత్‌డ్రా చేయడంలో సైబర్ నేరగాళ్లకు సహకరించినట్లు చెప్పారు.

రేపటి నుంచి టెట్ పరీక్షలు

హైదరాబాద్, డిసెంబరు 31(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జనవరి 2వ తేదీ నుంచి టెట్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 92 కేంద్రాల్లో ఈ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. జనవరి 20వ తేదీ వరకు సీబీటీ(కంప్యూటర్ బేస్డ్ టెస్ట్) పద్ధతిలో ఈ పరీక్షలు జరగనున్నాయి. రోజూ రెండు సెషన్లలో పరీక్షలు జరుగుతాయి. ఉదయం 9గం.ల నుంచి 11.30 గం.ల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 2గం.ల నుంచి సాయంత్రం 4.30 గం.ల వరకు రెండో సెషన్ పరీక్షలు నిర్వహిస్తారు. పరీక్ష ప్రారంభ సమయానికి 30 నిమిషాల లోపు అభ్యర్థులు పరీక్షాకేంద్రానికి చేరుకోవాలని, ఆ తర్వాత లోపలికి అనుమతించబోయని అధికారులు ప్రకటించారు. కాగా, టెట్‌కు మొత్తం 2,75,753 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 94,327 మంది పేపర్-1కు, 1,81,426 మంది పేపర్-2కు దరఖాస్తు చేసుకున్నారు.

సంభాల్‌లో ఏం జరిగినా మోదీదే బాధ్యత: ఒవైసీ

ఉత్తర్‌ప్రదేశ్ సంభాల్‌లోని జామా మసీదు సమీపంలో నిర్మాణాలు చేపట్టి ప్రధాని నరేంద్రమోదీ, ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి యోగీ ఆదిత్యనాథ్ మత విద్వేషాలు రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారని మజ్లిస్ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ విమర్శించారు. సంభాల్‌లోని జామా మసీదు సమీపంలో నిర్మిస్తున్న పోలీసు చౌకీ రికార్డుల ప్రకారం వక్ఫ్ భూమి అని ఆయన తెలిపారు. పురాతన స్మారక చిహ్నాల చట్టం ప్రకారం రక్షిత స్మారక కట్టడాల సమీపంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదని ఆయన తెలిపారు. అలాంటి నిషేధిత ప్రాంతంలో పోలీసు చౌకీ నిర్మిస్తున్నారని, అక్కడ ఉద్రిక్తతలు ఏర్పడితే ప్రధాని మోదీ, యూపీ ముఖ్యమంత్రి యోగీ బాధ్యత వహించాలని ఒవైసీ మంగళవారం ఎక్స్ వేదికగా పేర్కొన్నారు.

ఉమ్మడిగానా.. వర్సిటీల వారీగానా?

» ప్రొఫెసర్ పోస్టుల భర్తీపై కసరత్తు

» పలు అంశాలపై వీసీల కమిటీ చర్చ

హైదరాబాద్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి కసరత్తు ప్రారంభమైంది. ఈ అంశంపై ఏర్పాటైన వైస్ చాన్సలర్ల కమిటీ మంగళవారం ప్రత్యేకంగా సమావేశమై చర్చించింది. అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఘంటా చక్రపాణి అధ్యక్షతన జరిగిన ఈ కమిటీ సమావేశంలో పలు అంశాలపై చర్చించినట్టు సమాచారం. గత ప్రభుత్వంలో ప్రొఫెసర్ పోస్టుల భర్తీ కోసం ఉమ్మడి నియామక బోర్డు బిల్లును తెచ్చింది. అసెంబ్లీలో ఆమోదం పొందిన ఈ బిల్లు రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉంది. దాంతో ఈ బిల్లుపై అటు ముందుకు ఇటు వెనక్కి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. మరో పక్క యూనివర్సిటీల్లో ఖాళీల వల్ల బోధన నాణ్యత దెబ్బతింటోంది. ఈ నేపథ్యంలో ప్రొఫెసర్ల పోస్టుల భర్తీని ఎలా చేపట్టాలనే అంశంపై సూచనలను చేయాలని ప్రభుత్వం ఏర్పాటు చేసిన వీసీల కమిటీ తొలి సమావేశం మంగళవారం జరిగింది. ముఖ్యంగా ప్రొఫెసర్ల నియామకాలను ఉమ్మడిగా చేపట్టాలా? లేక ఆయా యూనివర్సిటీల వారీగానా? అనే అంశంపై ఈ సమావేశంలో చర్చించారు. ఉమ్మడిగా చేపట్టాలంటే రాష్ట్రపతి వద్ద ఉన్న బిల్లు ఆమోదం పొందాలి. లేదా ప్రభుత్వమే దానిని ఉపసంహరించుకుని, మరో బిల్లును అసెంబ్లీలో ఆమోదం పొందేలా చూడాలి. ఇలా కాకుండా ఆయా వర్సిటీల వారీగా నియామకాలు చేపట్టాలని భావిస్తే రాష్ట్రపతి వద్ద ఉన్న బిల్లును ఉపసంహరించుకుంటే సరిపోతుందని భావిస్తున్నారు. ఈ రెండు విధానాలపై కమిటీ చర్చించినట్టు తెలుస్తోంది. ఇంకా తుది నిర్ణయానికి రాలేదు. మరోసారి కమిటీ సమావేశమై చర్చించి, ప్రభుత్వానికి నివేదిక అందించే అవకాశం ఉంది. కాగా, వచ్చే ఏడాది నుంచి ఉన్నత విద్య ప్రవేశాల్లో అమలు చేసే స్థానికతపై మార్గదర్శకాలు రూపొందించాలని అధికారులు నిర్ణయించారు. మంగళవారం ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి ఆయా అధికారులతో చర్చించారు. రాష్ట్ర విభజన అనంతరం తెలంగాణలోని విద్యా సంస్థల్లో ఏపీ విద్యార్థులకు కూడా అవకాశం కల్పించిన విషయం తెలిసిందే. పదేళ్ల పూర్తి కావడంతో ఈ గడువు ముగిసింది. వచ్చే ఏడాది నుంచి ఏపీ విద్యార్థులకు అవకాశం ఉండదు. ఈ విషయంలో నిబంధనలు రూపొందించేందుకు అధికారులు కసరత్తు మొదలుపెట్టారు. త్వరలో ప్రభుత్వానికి నివేదిక అందించే అవకాశం ఉంది. కాగా, ఉన్నత విద్యా మండలి అధికారులు వివిధ ప్రవేశ పరీక్షల తేదీల ఫైల్‌ను ప్రభుత్వానికి అందజేశారు. ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చిన వెంటనే తేదీలను ప్రకటించనున్నారు.

తీర్పు ఇచ్చేదాక అరెస్టు వద్దు

(మొదటిపేజీ తరువాయి)





కేటీఆర్‌కు, అటు ఏసీబీకి ధర్మాసనం పలు ప్రశ్నలు వేసింది. హెచ్‌ఎండీఏ నిధులను ఇలాంటి రేసింగ్‌ల కోసం వినియోగించవచ్చా? ఏ నిబంధనల ప్రకారం ఈ -రేసింగ్‌కు ఖర్చు చేశారు? అని ప్రశ్నించింది. మిగతా ఇద్దరు నిందితులు అర్వింద్‌కుమార్, బీఎల్ఎన్ రెడ్డి పిటిషన్‌లు దాఖలు చేశారా? దర్యాప్తు ఎంతవరకు వచ్చింది? ఇప్పటివరకు ఏంచేశారు? అని ఆరా తీసింది. దర్యాప్తుపై తాము స్టే ఇవ్వలేదని గుర్తు చేసింది. విదేశీ సంస్థ అయిన ఫార్ములా ఈ-ఆపరేషన్స్ (ఎఫ్ఈఓ)కు అక్రమంగా రూ.54 కోట్లు చెల్లించారంటూ మునిసిపల్ శాఖ ముఖ్యకార్యదర్శి దానకిశోర్ చేసిన ఫిర్యాదుతో కేటీఆర్‌పై ఏసీబీ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసును కొట్టేయాలని కేటీఆర్ దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. కేటీఆర్ తరఫున సుప్రీంకోర్టు న్యాయవాది సిద్ధార్థ దవే, గండ్ర మోహన్‌రావు, ప్రభాకర్‌రావు వాదనలు వినిపించారు. "ఏసీబీ నమోదు చేసిన సెక్షన్లకు కావాల్సిన ముడిసరుకు లేదు. ఎలాంటి నేరం లేకుండానే రాజకీయ కుట్రతో కేసు నమోదు చేశారు. నిధులు సొంతానికి వాడుకున్నట్లు, దుర్వినియోగం చేసినట్లు, నా వాళ్లకు లబ్ధి కలిగేలా వ్యవహరించినట్లు ఎక్కడా నిరూపించలేకపోయారు. చట్టబద్ధమైన ఒప్పందం మేరకు బ్యాంకు ద్వారా జరిగిన లావాదేవీ ఇది" అని కేటీఆర్ పేర్కొన్న అభిప్రాయాలను ఆయన తరఫు న్యాయవాదులు వివరించారు.

ప్రతి ఉల్లంఘననూ నేరంగా పరిగణించలేం..

ఉల్లంఘనలు జరిగి ఉండొచ్చని, కానీ.. నేరం జరగలేదని కేటీఆర్ న్యాయవాదులు తెలిపారు. "ప్రతి ఉల్లంఘనకు క్రిమినాలిటీని అంటగట్టలేం. నా అధీనంలో ఉన్న ప్రభుత్వ సొమ్మును దుర్వినియోగం చేసినట్లు ఆరోపణ ఎక్కడా లేదు. అప్పటి మునిసిపల్‌శాఖ ముఖ్యకార్యదర్శి అర్వింద్‌కుమార్ రూపొందించిన ఫైల్‌కు నేను ఆమోదం తెలిపాను. అంతే తప్ప నేను ఏ ఒప్పందంపైనా సంతకాలు చేయలేదు. రెగ్యులేటరీల అనుమతి పొందాల్సిన బాధ్యత నాది కాదు. కేవలం నాపై ఈ కేసు పెట్టాలనే దురుద్దేశంతోనే గత ప్రభుత్వ వాయిదాలు ఎగవేసి ఒప్పందాన్ని ఉల్లంఘించింది. 'మహ్మద్ వాజిద్' కేసులో దురుద్దేశంతో పెట్టే కేసులను కొట్టేయాలని సుప్రీంకోర్టు చెప్పింది. దురుద్దేశం అనే ఒక్క కారణంతో ఈ కేసును కొట్టేవచ్చు. 'సతీశ్ శర్మ' కేసులో కేవలం అప్రూవల్ ఇచ్చినంత మాత్రాన మంత్రిని బాధ్యులను చేయలేమని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. విదేశీ కంపెనీతో ఒప్పందం చేసుకోవద్దని చట్టంలో ఎక్కడైనా ఉందా? అక్రమాలు జరిగినట్లు భావిస్తే.. విదేశీ కంపెనీపై ఎందుకు కేసు పెట్టలేదు? సదరు నిధులను వెనక్కి రప్పించడానికి ఏం చర్యలు తీసుకున్నారు? ఒప్పందం రద్దుకు ఏం చర్యలు తీసుకున్నారు?" అని కేటీఆర్ పేర్కొన్న విషయాన్ని న్యాయవాదులు కోర్టు దృష్టికి తెచ్చారు. కాగా, ఏసీబీ తరఫున అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, ఫిర్యాదుదారైన మునిసిపల్‌శాఖ ముఖ్యకార్యదర్శి దానకిశోర్ (రాష్ట్ర ప్రభుత్వం) తరఫున సీనియర్ న్యాయవాది సీవీ మోహన్‌రెడ్డి వాదనలు వినిపించారు. ఇలాంటి రేసింగ్‌లకు హెచ్‌ఎండీఏ నిధులు ఖర్చు చేయకూడదన్నారు. ప్రస్తుత కేసులో నగర అభివృద్ధికి ఖర్చు చేశారా? నిందితుల అభివృద్ధికి ఖర్చు చేశారా? ఇతరుల అభివృద్ధికా? అనేది తేలాల్సి ఉందన్నారు. మిగతా ఇద్దరు నిందితులను అరెస్ట్ చేయలేదని, దానకిశోర్ స్టేట్‌మెంట్‌పే రికార్డు చేశామని తెలిపారు. పిటిషనర్ (కేటీఆర్) దర్యాప్తును అడ్డుకోవాలనే ఉద్దేశంతో తొందరపడి హైకోర్టుకు వచ్చారని పేర్కొన్నారు.

కేసుకు తగిన ముడిసరుకు ఉంది..!

"గవర్నర్ ఆమోదం తీసుకున్న తర్వాతే కేసు నమోదు చేశాం. ఏసీబీ పెట్టిన సెక్షన్లకు కావాల్సిన ముడిసరుకు ఈ కేసులో పుష్కలంగా ఉంది. తన ఆదేశాలతోనే చెల్లింపులు జరిగినట్లు కేటీఆరే స్వయంగా అంగీకరించారు. పబ్లిక్ సర్వెంట్లు నిబంధనలకు అనుగుణంగా పనిచేయాలి. చెల్లింపులు చేసే ముందు మంత్రిమండలి, ఆర్థికశాఖ అనుమతి పొందలేదు. హెచ్‌ఎండీఏ రూ.10 కోట్ల కంటే ఎక్కువ ఖర్చు చేస్తే తీసుకోవాల్సిన పరిపాలనా అనుమతి తీసుకోలేదు. సెక్రటేరియట్ బిజినెస్ రూల్స్ ఉల్లంఘించారు. విదేశీ మారకంలో చెల్లింపుల ద్వారా ఆర్బీఐ నిబంధనలు, ఎన్నికల కోడ్ ఉల్లంఘించారు. మొత్తమ్మీద గంపగుత్తగా నిబంధనల్ని తుంగలో తొక్కారు. విదేశీ సంస్థతో ఒప్పందానికి ముందు అంత పెద్ద మొత్తం ఎలా చెల్లిస్తారు? ఎఫ్ఐఆర్‌లో అన్ని వివరాలూ ఉండాలని లేదు. దర్యాప్తు జరుగుతున్న కొద్దీ నిందితుల తొలగింపు, కొత్త నిందితులను చేర్చడం జరుగుతుంటాయి. చార్జిషీట్‌లో సంపూర్ణంగా ఉంటాయి. పిటిషనర్ వాదనలన్నీ ట్రయల్ కోర్టులో చెప్పుకోవచ్చు. డబ్బు ఎవరి జేబుకు చేరిందనేది దర్యాప్తులో తేలుతుంది. ఈ దశలో జోక్యం చేసుకోరాదు" అని పేర్కొన్నారు. వాదనల సందర్భంగా పలు సుప్రీంకోర్టు తీర్పులతోపాటు 'చంద్రబాబునాయుడు' కేసు సైతం చర్చకు వచ్చింది. వాదనలు విన్న ధర్మాసనం.. తీర్పును రిజర్వు చేస్తున్నట్లు ప్రకటించింది.

రేవంత్‌రెడ్డి ఏడాది పాలన విఫలం

» ఇక్కడ ఎనుముల రాజ్యాంగం అమలవుతోంది

» పేదరిక నిర్మూలనా సంస్థ ఉద్యోగులకే జీతాల్లేవు: హరీశ్ రావు



హైదరాబాద్/సిద్దిపేట అర్బన్/సిద్దిపేట కల్చరల్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): "కాంగ్రెస్ సర్కార్ వంద రోజుల్లో అమలు చేస్తామన్న గ్యారెంటీలు 390 రోజులయినా మొదలుపెట్టలేదు. 2024లో ప్రభుత్వ పరంగా వైఫల్యాలు తప్ప విజయాల్లేవు. రేవంత్‌రెడ్డి ఏడాది పాలనపై పలు సర్వే ఏజెన్సీలు ప్రజల అభిప్రాయాన్ని తెలుసుకునే ప్రయత్నంచేస్తే.. ఏ సర్వేలోనూ ఆయనకు పాస్ మార్కులు రాలేదు. ప్రజల దృష్టిలో ఆయన ఫెయిల్ అయ్యారు" అని మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. రేవంత్ పాలన గురించి ఎవరిని అడిగినా ఆయన్ను తిడుతున్నారనే సమాధానం వస్తోందని తమదృష్టికి వచ్చిందని మంగళవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలో, దేశవిదేశాల్లో ఉన్న తెలంగాణ ప్రజలకు హరీశ్ రావు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. 2024లో రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన విఫలమయిందని విమర్శలు చేశారు. లక్షలకోట్ల అప్పులంటూ.. అసెంబ్లీలో కూడా అడ్డూ అదుపులేకుండా అబద్ధాలు చెబుతున్నారన్నారు. రేవంత్ బ్రదర్స్ రాజ్యాంగేతర పనులు శృతి మించుతున్నా యని పేర్కొన్నారు. అంబేద్కర్ రాజ్యాంగం పోయి తెలంగాణలో ఎనుముల రాజ్యాంగం అమలవుతోందని వ్యాఖ్యానించారు. పేదరిక నిర్మూల నా సంస్థ (సెర్ప్)లో పనిచేస్తున్న 6వేల మంది (ఆర్పీలు) ఉద్యోగులకు జీతాలు కూడా ఇవ్వడంలేదని హరీశ్‌రావు ఎక్స్ వేదికగా ఆయన విమర్శించారు. ప్రభుత్వ హాస్టళ్లపై రాష్ట్ర ప్రభుత్వం చెప్పేమాటలు చేసే పనులలో పొంతన లేకుండా ఉందని హాస్టళ్లపై ప్రభుత్వ పనితీరు ఏమాత్రం బాగాలేదని హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట అర్బన్ మండలం తడకపల్లి బీసీ హాస్టల్‌ను ఆయన మంగళవారం సందర్శించారు. విద్యార్థులకు దుప్పట్లు, టీషర్టులు పంపిణీ చేసి కేక్ కట్ చేసి వారితో కలిసి భోజనం చేశారు. సిద్దిపేట పీజీ హాస్టల్ విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ కార్యక్రమంలోనూ ఆయన పాల్గొన్నారు.

నాయకులను అవమానపర్చడం కాంగ్రెస్ డీఎన్‌లోనే ఉంది: కేటీఆర్

హైదరాబాద్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): దేశం కోసం, పార్టీ కోసం తమ జీవితకాలం సర్వస్వం ధారపోసిన నాయకులను అవమానపర్చడం కాంగ్రెస్ డీఎన్ఏలోనే ఉందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మరణంపట్ల దేశంమొత్తం విషాదంలో ఉన్నప్పుడు రాహుల్‌గాంధీ వియత్నాం పర్యటన చేయడంలో ఆశ్చర్యం ఏమీలేదని మంగళవారం ఎక్స్ వేదికగా ఆయన విమర్శించారు. కాంగ్రెస్ అంటేనే మహనీయులను అవమానపరచడమని, స్వర్గీయ పీవీ నరసింహారావుకు ఆపార్టీ చేసిన అవమానాన్ని తెలంగాణ ప్రజలు ఎప్పటికీ మర్చిపోరన్నారు. ఇదిలా ఉండగా.. తెలంగాణలో 1.53కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం పండినా పట్టెడన్నం కోసం పసిబిడ్డల ఆర్తనాదాలు, ఆకలికేకలు వినిపిస్తున్నాయని కేటీఆర్ ఆరోపించారు.

తల్లి పక్కన నిద్రించిన బాలుడి అపహరణ

» రూ.60 వేలకు విక్రయం

» ఒక్క రోజులో కేసును ఛేదించిన పోలీసులు

» తల్లిదండ్రులకు అప్పగింత..

వికారాబాద్ జిల్లాలో ఘటన

తాండూరు రూరల్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): తల్లి పక్కన నిద్రించిన ఏడాది వయసున్న పసికందును అపహరించి రూ. 60 వేలకు విక్రయించిన దుండగులను వికారాబాద్ జిల్లా పోలీసులు ఒక్క రోజులోనే పట్టుకున్నారు. వారి వద్ద నుంచి బాలుడిని తీసుకొచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. వికారాబాద్ జిల్లా తాండూరు మండలం గౌతాపూర్ గ్రామంలో సంచారజాతికి చెందిన హుస్సేన్ బాషా, గోరీబీ దంపతుల కుమారుడు హుస్సేన్ (1)ను ఆదివారం రాత్రి తల్లి పక్కలో నుంచి గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. తల్లిదండ్రుల ఫిర్యాదుతో కేసు విచారణ చేపట్టిన పోలీసులు సీసీ ఫుటేజీ ఆధారంగా కేసును ఛేదించారు. తాండూరులోని ఇందిరానగర్‌కు చెందిన శంకర్, పద్మమ్మ, హన్మంతు, లక్ష్మి, సాయమ్మ, పద్మ కలిసి బాలుడిని కిడ్నాప్ చేసేందుకు ముందుగానే పథకం పన్ని ఆదివారం రాత్రి హుస్సేన్, గోరీబీ నిద్రించే వరకు వేచి ఉండి బాలుడు హుస్సేన్‌ను ఎత్తుకెళ్లారు. అనంతరం తెల్లవారు జామున తాండూరులోని మధ్యవర్తి చెన్నప్పను ఆశ్రయించి కృష్ణా అనే వ్యక్తికి బాలుడిని రూ.60 వేలకు విక్రయించారు. తలా రూ. పది వేలు పంచుకుని అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని ఐదు బృందాలుగా రంగంలోకి దిగి నిందితులను పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. వారి దగ్గర నుంచి బాలుడిని తీసుకొచ్చి తల్లిదండ్రులకు అప్పగించినట్లు చెప్పారు. నిందితులు గతంలో ఎవరైనా చిన్నారులను అపహరించి విక్రయించారా? అనేది కూడా విచారిస్తున్నట్లు తెలిపారు. తక్కువ సమయంలో కేసు ఛేదించిన పోలీసులకు రివార్డులు అందజేసినట్లు తాండూరు సీఐ వెల్లడించారు.

గ్రీన్‌ఫీల్డ్ రహదారి కోసం భూసేకరణ నోటిఫికేషన్ విడుదల

ఫోర్త్ సిటీని కలుపుతూ నిర్మాణం

554 ఎకరాలు సేకరించనున్న ప్రభుత్వం

హైదరాబాద్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి) : ఔటర్ రింగ్ రోడ్డు నుంచి ఫోర్త్‌సిటీని కలుపుతూ గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణం కోసం 554 ఎకరాల భూమిని సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి సంబంధించి మంగళవారం భూసేకరణ నోటిఫికేషన్ విడుదల చేసింది. రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలోని కుర్మిద్ద గ్రామం, కడ్తాల్ మండలంలోని కడ్తాల్, ముద్విన్ గ్రామాలు, ఆమంగల్ మండలం పరిధిలోని ఆమంగల్, ఆకుతోటపల్లి గ్రామాల్లో ఈ భూములను సేకరించనున్నారు. మీర్‌ఖాన్‌పేట్ నుంచి రీజనల్ రింగ్ రోడ్డు వరకు ఆమంగల్ వద్ద ఓఆర్ఆర్‌కు 100 మీటర్ల దూరం నుంచి ఈ రహదారి నిర్మించనున్నారు. ఈమేరకు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నోటిఫికేషన్ జారీ చేశారు.

అలా అయితే పోలవరం క్లియరెన్స్ చెల్లుబాటు కాదు

పోలవరంపై టీఏసీకి మహారాష్ట్ర ఒడిసా, ఛత్తీస్‌గఢ్‌లను పిలవలేదు

» ప్రాజెక్టుల టీఏసీకి పిలవలేదన్న ఏపీ అభ్యంతరాలకు తెలంగాణ కౌంటర్

» పోలవరం తరహాలోనే తమ ప్రాజెక్టులపై సీడబ్ల్యూసీ వ్యవహరిస్తోందని బదులు

» సీతారామ ఎత్తిపోతల-సీతమ్మసాగర్ ప్రాజెక్టుతో ఏపీకి ఇబ్బందుల్లేవు

» గోదావరి జలాల పంపిణీకి ట్రైబ్యునల్ వాదన అర్థరహితం

» వరద జలాల ప్రాజెక్టులకు నీటి హక్కుల కోసమే ఏపీ అభ్యంతరాలు

» ఏపీ అభ్యంతరాలకు కౌంటర్ ఇస్తూ గోదావరి బోర్డుకు ఈఎన్‌సీ లేఖ

హైదరాబాద్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): 'తెలంగాణలోని పలు ప్రాజెక్టులకు సాంకేతిక అనుమతినిచ్చే విషయంలో జరిగిన సాంకేతిక సలహా కమిటీ (టీఏసీ)కి దిగువ పరీవాహక రాష్ట్రమైన తమను పిలవలేదనే ఏపీ వాదన అర్థరహితం. కేంద్ర జలవనరుల సంఘం(సీడబ్ల్యూసీ) అంతర్గతంగా తీసుకునే నిర్ణయాలకు తాము కట్టుబడి ఉండాల్సిన అవసరం లేదని ఏపీ వాదించడం పూర్తిగా తప్పు. అట్లయితే ఎగువ పరీవాహకంలోని మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఒడిసాలను ఆహ్వానించకుండానే 2009లో టీఏసీ నిర్వహించి పోలవరం ప్రాజెక్టుకి ఇచ్చిన అనుమతులు కూడా చెల్లుబాటు కావు' అని తెలంగాణ రాష్ట్రం స్పష్టం చేసింది. సీతారామ ఎత్తిపోతల పథకం-సీతమ్మసాగర్ బహుళార్థక సాధక ప్రాజెక్టుకు సీడబ్ల్యూసీలోని టీఏసీ క్లియరెన్స్‌కి సిఫారసు చేస్తూ గోదావరి నదీ యాజమాన్య బోర్డు (జీఆర్ఎంబీ) సమావేశంలో చేసిన తీర్మానాన్ని వ్యతిరేకిస్తూ బోర్డుకు ఇటీవల ఏపీ లేఖ రాసింది. డీపీఆర్‌ల పరిశీలనకు 1996 మార్గదర్శకాలను అనుసరించామని సీడబ్ల్యూసీ అంటోందని, ఆ మార్గదర్శకాలేమిటో చెప్పాలని కోరితే ఇవ్వడం లేదని, ప్రస్తుతం 2017 మార్గదర్శకాలు అమల్లో ఉండగా, 1996 మార్గదర్శకాలతో తెలంగాణ ప్రాజెక్టులకు క్లియరెన్స్ ఇవ్వడమేవిటి?' అని ఆ లేఖలో ఏపీ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఏపీ అభ్యంతరాలను తోసిపుచ్చుతూ తెలంగాణ నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ గుమ్మడి అనిల్‌కుమార్ సోమవారం గోదావరి బోర్డుకు లేఖ రాశారు. సీడబ్ల్యూసీ పోలవరం ప్రాజెక్టుకు 2009, 2011లో క్లియరెన్స్‌లను తమ 1996 మార్గదర్శకాల ప్రకారమే ఇచ్చిందని, వాటి ప్రకారమే తెలంగాణ ప్రాజెక్టుల విషయంలో నడుస్తోంది' అని లేఖలో తెలంగాణ బదులిచ్చింది. న్యాయస్థానానికి వెళ్లక తప్పని పరిస్థితి కల్పించారని లేఖలో ఏపీ హెచ్చరించగా, తప్పుడు ఉద్దేశాలతో ఏపీ కేసులేసినా నిలబడవని తెలంగాణ కౌంటర్ ఇచ్చింది. సీతారామ ఎత్తిపోతల పథకం-సీతమ్మసాగర్ బహుళార్థక ప్రాజెక్టుపై తమ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండా తమ హక్కులకు ఎలాంటి నష్టం ఉండదని సీడబ్ల్యూసీ చెప్పడం సరికాదని ఏపీ తప్పుబట్టింది. అయితే ఈ అభ్యంతరాలన్నింటికీ సీడబ్ల్యూసీతో పాటు టీఏసీలు పరిగణనలోకి తీసుకుని ఏపీ హక్కులకు ఎలాంటి ఇబ్బంది భంగం కలుగదని తేల్చాయని తెలంగాణ వివరించింది. ఇచ్చంపల్లి ప్రాజెక్టు ద్వారా నీటి వినియోగంపై గోదావరి ట్రైబ్యునల్ విధించిన ఆంక్షలను పరిగణనలోకి తీసుకోకుండానే సీతారామ ప్రాజెక్టుకు సీడబ్ల్యూసీ క్లియరెన్స్ ఇచ్చిందని, ఇది ట్రైబ్యునల్ తీర్పు ఉల్లంఘన కిందికి వస్తుందని ఏపీ ఆరోపించింది. 35 టీఎంసీలతో దేవాదుల, 195 టీఎంసీలతో కాళేశ్వరం ప్రాజెక్టును చేపట్టడంతో ఆ 85 టీఎంసీలను తెలంగాణ వాడుకున్నట్లేనని, దాంతో సీతారామ ప్రాజెక్టుకు నీటి లభ్యత లేదనే విషయాన్ని ఏపీ స్పష్టం చేసింది. ట్రైబ్యునల్ ఆంక్షలు కేవలం ఇచ్చంపల్లి ప్రాజెక్టుకే పరిమితమని, ఆ ప్రాజెక్టును చేపట్టలేదని తెలంగాణ బదులిచ్చింది. ట్రైబ్యునల్ మార్గదర్శకాలకు లోబడే దేవాదుల, కాళేశ్వరంతో పాటు పోలవరం ప్రాజెక్టులకు సీడబ్ల్యూసీ అనుమతిలిచ్చిందని తెలిపింది. సీడబ్ల్యూసీ ట్రైబ్యునల్ లాగా నీటికేటాయింపులు జరపడం లేదని, కేవలం ప్రాజెక్టులకు అనుమతులిస్తోందని గుర్తు చేసింది. కాగా అంతర్రాష్ట్ర జలవివాదాల చట్టం-1956లోని సెక్షన్-3 కింద ఏపీ, తెలంగాణ మధ్య గోదావరి జలాల పంపకాలకు ట్రైబ్యునల్ ఏర్పాటు చేయాలని ఏపీ కోరగా, ఏమాత్రం అవసరం లేదని తెలంగాణ స్పష్టం చేసింది.

ఆన్‌లైన్‌లో బ్రేక్ దర్శనాల బుకింగ్!

» ప్రజాప్రతినిధులకు ప్రత్యేక యూజర్ ఐడీ, పాస్‌వర్డ్

» కోటా ప్రకారం వారే నేరుగా బుక్ చేసుకొనే అవకాశం

(తిరుమల-ఆంధ్రజ్యోతి)

తిరుమలకు వచ్చే భక్తులకు శ్రీవారి దర్శనం సులభతరంగా, సౌకర్యవంతంగా ఉండేలా టీటీడీ చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే సామాన్య భక్తుల దర్శన నిరీక్షణ సమయాన్ని తగ్గించడంపై కసరత్తు చేస్తున్న ఉన్నతాధికారులు రానున్న రోజుల్లో ప్రజాప్రతినిధులే నేరుగా బ్రేక్ దర్శన టికెట్లు బుక్ చేసుకునేలా ఆలోచన చేస్తున్నారు. నిత్యం దాదాపు 60-70వేల మంది భక్తులు శ్రీవారిని దర్శించుకుంటున్నారు. వారాంతాలు, విశేష పర్వదినాల్లో ఈ సంఖ్యలక్షకు చేరుతోంది. అయితే స్వామి దర్శనానికి వచ్చేవారిలో సగానిపైగా బ్రేక్ దర్శనాల కోసమే ఆరాటపడుతున్నారు. నిత్యం ఎవరో ఒక ప్రజాప్రతినిధి సిఫారసు లేఖతో వచ్చి తిరుమలలోని అదనపు ఈవో కార్యాలయం అధికారులు, సిబ్బందిపై ఒత్తిడి తెస్తున్నారు. కొందరు ప్రజాప్రతినిధుల నుంచి రోజుకు రెండు, మూడు లేఖలు కూడా వస్తున్నాయి. వీటన్నింటికీ అడ్డుకట్ట వేసేలా టీటీడీ నూతన ప్రణాళికలు రూపొందిస్తోంది. గతంలో ప్రత్యేకంగా సాఫ్ట్‌వేర్‌ను తయారుచేసి టీటీడీ బోర్డు సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులకే యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ కేటాయించారు. కోటాకు తగినట్టు వారే ఆన్‌లైన్ ద్వారా బ్రేక్ దర్శన టికెట్లు బుక్ చేసి భక్తులకు అందజేసేవారు. ఇదే పద్ధతిని ప్రజాప్రతినిధులకూ అమలు చేయడంపై అధికారులు పరిశీలిస్తున్నారు. తెలంగాణ నేతల సిఫారసు లేఖలపై కూడా వీఐపీ బ్రేక్ దర్శనాలు కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తాజాగా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఈ నేపథ్యంలో నూతన విధానం అమలులోకి తెస్తే ఆయా ప్రజాప్రతినిధులే తమ కోటాకు తగినట్టు ఆన్‌లైన్ ద్వారా బ్రేక్ టికెట్లు బుక్ చేసుకుంటారని భావిస్తున్నారు. ఇందులో ఉన్న సమస్యలపైనా అధికారులు దృష్టి సారించారు. ఈ విధానంలో నేతలు వంద శాతం కోటాను వినియోగించుకుంటారు. ఈ క్రమంలో సామాన్య భక్తులకు ఇబ్బంది లేకుండా తగిన విధంగా మార్పుచేర్పులు చేయాలని టీటీడీ అధికారులు భావిస్తున్నట్టు తెలిసింది.

రాష్ట్ర బడ్జెట్ కసరత్తు షురూ

» వివిధ శాఖలు ప్రతిపాదనలు పంపాలని ఆర్థిక శాఖ ఉత్తర్వులు

హైదరాబాద్, డిసెంబరు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బడ్జెట్‌పై రేవంత్ రెడ్డి ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. అన్ని శాఖల నుంచి బడ్జెట్ ప్రతిపాదనలు ఆహ్వానించింది. ఈ మేరకు మంగళవారం రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. శాఖలు, పథకాల వారీగా వ్యయ అంచనాలను ప్రతిపాదించాలని సూచించారు. ఈ నెల 4లోపు పంపాలని తెలిపింది. మోదీ సర్కారు ఫిబ్రవరి 1న కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టనుంది. ఆ బడ్జెట్‌లో రాష్ట్రానికి వచ్చే గ్రాంట్లు, కాంట్రిబ్యూషన్లు, ప్రత్యేక గ్రాంట్లు, పన్ను వాటాలను పరిశీలించి రాష్ట్ర బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టడం అనవాయితీగా వస్తోంది. దానికి అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం 2025-26 బడ్జెట్ కసరత్తు ప్రారంభించింది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం రూ.2,91,159 కోట్ల బడ్జెట్ ప్రవేశపెట్టింది. కొత్త బడ్జెట్ ఎంత ఉండాలన్నది అన్ని శాఖల నుంచి ప్రతిపాదనలు అందిన తర్వాత ప్రభుత్వం ఒక అంచనాకు రానుంది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.